fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 56 | విజయవాడ, సోమవారం 26 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

శ్రీదేవి హఠాన్మరణం



గుండెపోటుతో దుబాయ్‌లో మృతి
ముంబయిలో నేడు అంత్యక్రియలు
భారత సినీ పరిశ్రమ దిగ్భ్రాంతి
రాష్ట్రపతి, ప్రధాని, ఎపి, తెలంగాణ సిఎంల సంతాపం

ముంబయి : బూచోడమ్మ బూచోడంటూ బాలనటిగా కబుర్లెన్నో చెప్పి, ఆకు చాటు పిందెగా తెలుగు తెరపై మెరిసి, సిరిమల్లెపువ్వులా, అతిలోక సుందరిగా సినీ అభిమానుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించుకున్న శ్రీదేవి ఇకలేరు. ఒక వివాహ కార్యక్రమానికి దుబాయ్ వెళ్లిన ఆమె శనివారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో అక్కడే కన్నుమూశారు. తమ బంధువు మోహిత్ మర్వా వివాహ కార్యక్రమంలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. హోటల్ గదికి తిరిగి వెళ్లిన తరువాత బాత్‌రూమ్‌లో ఆమె తీవ్ర గుండెపోటుతో కుప్పకూలిపోయారు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీదేవి చివరి సినిమా మామ్‌లో కూతురి అభ్యున్నతి కోసం నిరంతరం తపించే అమ్మ పాత్ర పోషించారు. నిజజీవితం లో కూడా తన కూతురు జాహ్నవి సినీ ప్రవేశం గురించి ఆమె ఎన్నో కలలు కన్నారు. జాహ్నవి మిగతా 8లో



విశాఖలో జరుగుతున్న సిఐఐ సదస్సులో మాట్లాడుతున్న చంద్రబాబు

వినూత్న ఆవిష్కరణలకు కేంద్రం

మరో సిలికాన్ వ్యాలీగా విశాఖ – సిఐఐ సదస్సులో చంద్రబాబు

ప్రజాశక్తి– విశాఖపట్నం ప్రతినిధి

సరికొత్త ఆవిష్కరణలకు విశాఖపట్నం కేంద్రం కానుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఐఐ సదస్సుకు విచ్చేసిన పెట్టుబడిదారులకు వివరించారు. విశాఖ మరో సిలికాన్ వ్యాలీగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఆదివారం ఉదయం విశాఖలోని సిఐఐ ప్లీనరీలో ఆయన రాష్ట్రంలో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, టెక్నాలజీని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. టెక్నాలజీ వాడటం ద్వారా రాష్ట్ర ప్రజలకు ఉపాధి అవకాశాలను పెంచుతున్నామన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలోని ఒక్క సభ్యుడికైనా కంప్యూటర్‌పై అవగాహన ఉందన్నారు. సేవా రంగాలను ప్రయివేటుకు అప్పగించడం ద్వారా ఖర్చులు తగ్గుతున్నాయన్నారు. 40 లక్షల ఎల్‌ఇడి బల్బులను రూపాయి ఖర్చు లేకుండా ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజల నుంచి వినతుల స్వీకరణకూ సాంకేతికతను వాడుతున్నామన్నారు. 1100కి ఫోన్ చేసి సిఎం డ్యాష్ బోర్డుకు ఏ సమస్య గురించి చెప్పినా సిబ్బంది వెంటనే ఫిర్యాదు స్వీకరించి సంబంధిత శాఖ అధికారులకు ఆ సమస్యను సిఫార్సు చేసి 15 రోజుల్లో పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా స్టేజీపై ఓ ప్రతినిధితో 1100కి కాల్ చేయించి ఏ అంశాన్ని గురించి అయినా అడగాలని సూచించారు. అడవులు, పంటల గురించి సమాచారం అడగ్గా సిఎం డ్యాష్ బోర్డు నుంచి అందుకు సంబంధించిన సమాచారం చెప్పడం జరిగింది. అన్ని రంగాల్లోనూ టెక్నాలజీ వాడకంలో దేశంలోనే ఎపి ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మోడ్రేటర్‌గా అమెరికాకు చెందిన టెక్నాలజీ, సమా చార మేనేజ్‌మెంట్ కార్నల్ ఎస్‌సి జాన్సన్ కాలేజ్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ సౌమిత్ర దుత్త వ్యవహరించారు. సిఐఐ భారత అధ్యక్షులు కామినేని శోభన, ఇండియా, సార్క్ సిస్కో సిస్టమ్స్ ఇన్‌ఛార్జి సమీర్ గార్డే, లాక్‌హీడ్ మార్టిన్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఫిల్ షా పాల్గొన్నారు.

మహిళల నేతృత్వంలో
దేశాభివృద్ధి

మన్‌కి బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడి



న్యూఢిల్లీ : మహిళల నేతృత్వంలో అభివృద్ధి దిశగా దేశం అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడి ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీ బాత్ రేడియో కార్యక్రమంలో ఆయన మహిళ అభివృద్ధి లక్ష్యంగా మాట్లాడారు. దేశం మహిళా అభివృద్ధి నుంచి మహిళల నేతృత్వంలో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. జీవితంలోని ప్రతి కోణంలోను మహిళలకు సమాన భాగస్వామ్యాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా మహిళా శక్తిపై స్వామి వివేకానంద చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. రీసైకిలింగ్ చెత్తను, వ్యర్థాలను సృజనాత్మకంగా ఎలా తిరిగి ఉపయోగించుకోవచ్చునో తెలియచెప్పేందుకు ఇటీవల చత్తీస్‌గఢ్‌లో నిర్వహించిన "ట్రాష్ ఫెస్టివల్" గురించి కూడా మోడీ మన్‌కి బాత్‌లో ప్రస్తావించారు. గోబర్ ధన్ పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో వ్యర్థాలను బయోగ్యాస్‌గా మార్పు చేస్తున్న ప్రక్రియ గురించి ఆయన మాట్లాడారు. ఈ ఏడాది బడ్జెట్‌లో వ్యర్థాల నుంచి ఇంధనం, వ్యర్థాల నుంచి సంపద అనే రెండు అంశాలను ప్రతిపాదించిన విషయాన్ని గుర్తు చేశారు. స్వచ్ఛ భారత్ కార్యక్రం కింద గ్రామాలలో "గోబర్ ధన్" పథకాన్ని చేపట్టాలని పిలుపునిచ్చినట్లు చెప్పారు. గ్రామీణ భారతదేశంలో రైతులకు గోబర్ ధన్ యోజన ఆదాయాన్ని కూడా తెచ్చిపెడుతోందని చెప్పారు. గ్రామాల పరిశుభ్రతకు, జంతువుల ఆరోగ్యం మెరుగుదలకు తోడ్పడుతుందని చెప్పారు. గోబర్ ధన్ యోజన కింద వ్యవసాయ వ్యర్థాల కొనుగోలు దారులకు రైతులకు మధ్య అనుసంధానం కల్పిస్తూ ఒక ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. స్వయం మిగతా 9లో

ఆర్థిక నేరగాళ్లు
అంబానీ, అదానీ బంధువులు

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో వెలుగు చూస్తున్న బ్యాంకు రుణాల కుంభకోణాల్లో ఆసక్తికరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ కుంభ కోణాల్లో కీలక నిందితులుగా ఉన్న వారందరూ ఒకరికొకరు బంధువులు కావడం విశేషం. వీరందరికీ భారత వాణిజ్య దిగ్గజాలుగా గుర్తింపు పొందిన అంబానీ, ఆదానీలకు ఏదోరకంగా బంధుత్వం ఉండటం కూడా మరో ఆసక్తికరమైన విషయం. వ్యాపార వర్గానికి చెందిన కుటుంబాలు పరస్పర సంబంధాలు కలిగిఉండటం ప్రపంచ మంతా ఉండేదైనా భారత్‌లో అది మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ బంధుత్వాలలోవ్యాపార ప్రయోజనాలు ముడిపడిఉండటం అత్యంత సహజం! ఆశ్రిత పెట్టుబడిదారీ వ్యవస్థ భారత్‌లో ఎలా అభివృద్ధి చెందుతోందో తాజా కుంభకోణాలను పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతుంది. ఉదాహరణకు వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్ బంధువు సౌరభ్ భూషణ్ పవర్ అండ్ స్టీల్ ఛైర్మన్ సంజయ్ సింఘాల్ కుమార్తె రాధికను 2010లో వివాహమాడాడు. అదే విధంగా రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ గోవాకు చెందిన సల్గావ్‌కర్ కుటుంబంలో తన సోదరి దీప్తిని 80లలో వివాహ బంధంతో ముడివేసిన విషయం తెలిసిందే. అనేక సందర్భాలలో తమకు సంబంధించిన కుటుంబ నేపథ్యం, సాంస్కృతిక వర్గానికిచెందిన వారితోనే బంధుత్వాలు కలుపుకోవాలని అనేక మంది సిఇఓలు, పారిశ్రామిక వేత్తలు మిగతా 8లో



సౌజన్యం : ద వైర్

నోట్ల రద్దుకు కొన్ని గంటల ముందే 90 కోట్లు జమ చేసిన నీరవ్

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 2016లో పెద్ద నోట్ల రద్దును ప్రకటించడానికి కొద్ది గంటల ముందు నీరవ్‌మోడి రూ.90 కోట్ల నగదు డిపాజిట్ చేశారని ఎన్‌సిపి ఎంపి మజీద్ మెమన్ ఆరోపించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)కు చెందిన ఒక శాఖలో ఆ మొత్తాన్ని డిపాజి ట్ చేసినట్లు మెమన్ తెలిపారు. బహుశా ఆయన దానిని బులియన్ కోసం మార్చి ఉంటారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. దీనిపై తగిన దర్యాప్తు చేసి వాస్తవాన్ని వెలుగులోకి తీసుకురావలసిన అవసరమున్నదన్నారు. నిందితుడికి, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి మధ్య ఏదైనా సందేహాస్పదమైన ఒప్పందం కుదిరిందేమోనని అనుమానంగా ఉందన్నారు.

బయట తెగడ్తలు - లోపల పొగడ్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విశాఖలో రెండురోజుల పాటు జరిగిన సిఐఐ సదస్సులో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు అంశాలు ప్రస్తావనకే రాలేదు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించడం ముఖ్యఉద్దేశ్యమైనప్పటికీ రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతున్న నేపథ్యంలో సదస్సు జరుగుతుండటం, కేంద్ర మంత్రులు హాజరు అవుతుండటంతో విభజన సమస్యలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం పరిశీలకుల్లో వ్యక్తమయ్యింది. శనివారం సమావేశం ప్రారంభం కావడానికి కొన్ని గంటల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టిడిపి అధ్యక్షుని హోదాలో పార్టీ నేతలతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేకహోదా అంశాన్ని ప్రస్తావించడమే దీనికి కారణం. రాష్ట్రంలో టిడిపి, బిజెపి నేతలు పరస్పర విమర్శలు చేసుకుంటుండటం, ముఖ్యమంత్రి సైతం కేంద్ర వైఖరిపై తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ సదస్సులో ఎలా స్పందిస్తారన్న ఆసక్తి నెలకొంది. అయితే, బయట దుమ్మెతిపోసుకుంటున్న నేతలు సిఐఐ సమావేశంలో దానికి భిన్నంగా ప్రవర్తించారు. హోదా, విభజన హామీల అంశం నామమాత్రంగా కూడా ప్రస్తావనకు రాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. అదే సమయంలో పరస్పరం పొగుడుకోవడం చర్చనీయాంశంగా మారింది. గతంలో రైల్వేశాఖ మంత్రిగా వ్యవహరించి, వాణిజ్య, పారిశ్రామిక మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సురేష్ ప్రభు ఈ సమావేశానికి హాజరవడంతో విశాఖ రైల్వేజోన్ గురించి కొంత మేరకైనా స్పష్టత వస్తుందన్న ఆశలు అడియాశలయ్యాయి. ఆయన ఈ విషయాన్ని అసలు ప్రస్తావించకపోవడమే కాదు రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టే పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేకంగా ఇచ్చే రాయితీల ఊసు కూడా ఎత్తలేదు. చంద్రబాబు దార్శనికత గురించి చెప్పడానికే ఆయన సమయం కేటాయించారు. ముఖ్యమంత్రి కూడా ఇదే రీతిలో స్పందించారు. రాష్ట్ర విభజన సమయంలో మిగతా 9లో

సైబర్ నేరాలపై ఫిర్యాదులకు
హైదరాబాద్ వెళ్లాల్సిందేనా?

ఎపిలోనే పటిష్ట వ్యవస్థ ఉండాలని మహిళా, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణలోని అదిలాబాద్ జిల్లా మారుమూల ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన భర్త వేధింపులు తట్టుకోలేక అతనిపై గృహ హింస కింద కేసు పెట్టింది. కానీ తన భార్యపై కక్ష సాధింపు కోసం అతను తన భార్య ఫోటో, ఫోన్ నెంబర్‌ను సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకరంగా (కాల్‌గర్ల్ అంటూ) పోస్టు పెట్టాడు. దీంతో ఆమెకు అసభ్యకరంగా ఫోన్లు రావడం మొదలయ్యాయి. తన భర్త చేసిన దానికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన ఆమెకు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని స్థానిక పోలీసులు సూచించారు. ఇందుకామె హైదరాబాద్ వెళ్లడం తప్ప మరో గత్యంతరం లేదు. ఇదే పరిస్థితి తెలంగాణలోనే కాక ఆంధ్రాలోనూ ఏర్పడుతోంది. తాజాగా విశాఖలో రామ్‌గోపాల్ వర్మ పై ఫిర్యాదు విషయంలో కూడా మహిళా సంఘాల నాయకులకు ఈ పరిస్థితి ఎదురైంది. దీంతో రెండు రోజుల పాటు నిరాహార దీక్ష, రాష్ట్రవ్యాప్త నిరసనలు తెలపడంతో మిగతా 9లో

పటిష్ట వ్యవస్థ అవసరం



ప్రభుత్వం సైబర్ నేరాల నియంత్రణకు పటిష్ట వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఆమేరకు ప్రత్యేకంగా సిబ్బం దిని, నిర్వ హణకు సరిపడా బడ్జెట్ కూడా కేటాయిం చాలి. మీ– సేవ కేంద్రాలు పనిచేస్తున్న విధంగా ఒక హెల్ప్ లైన్ సెంటర్ ప్రత్యేకంగా సైబర్ నేరాల నమోదుకు కేటాయించాలి. ఆ కేంద్రాలను ఆధునీ కరించి, సైబర్ నేరాల ఫిర్యాదుకు ఉపయోగించు కునేలా ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయాలి.

– డి రమాదేవి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి

ముగిసిన ధూల్ క్రీడోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

కర్నూలులోని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్ డోర్ స్టేడియంలో మూడు రోజులుగా జరుగుతున్న ధూల్ క్రీడోత్సవంలో చివరిరోజు సినీతార ప్రణీత సందడి చేశారు. పర్యాటక శాఖ, యువజన సర్వీసుల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ధూల్ సాంస్కృతిక, క్రీడాపోటీల కార్యక్రమాలు ముగి సాయి. ఎద్దుల బండ్ల పోటీలు, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, ఖోఖో, కబడ్డీ, హ్యాండ్ బాల్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మెంటన్ పోటీలను నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి, కర్నూలు ఎంపీ బుట్టారేణుక హాజరయ్యారు. విజేతలకు కెఇ.క్రిష్ణమూర్తి, ఎంపీ బుట్టా రేణుక బహుమతులు అందజేశారు.

విందు..వివాదం



విదేశీ ప్రతినిధులకు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (ఇన్‌సెట్‌లో) వుడా పార్కులో కనిపించిన మద్యం బాటిల్స్

చర్చనీయాంశమైన విందు

ప్రజాశక్తి-విశాఖ

భాగస్వామ్య పెట్టుబడుల సదస్సు సందర్భంగా విశాఖలో అత్యంత రద్దీగా ఉండే వుడా పార్కు దగ్గర ఎంజిఎం పార్కులోపల శనివారం రాత్రి మందు, విందు ఏర్పాట్లు భారీగా జరిగాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి దగ్గరుండి ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అతిథులను ఆకట్టుకోవడానికి బాలీవుడ్ నుంచి నృత్యకారిణులు, పాప్ సింగర్‌లతో పాటు విలాసవంతమైన ఏర్పాట్లను చేపట్టారు. మందు, విందు ఇతర నృత్యాలను రుచిచూపించేందుకు చేసిన ప్రయత్నంలో భాగంగా ఇ-ఫాక్టర్ అనే సంస్థకు ఈవెంట్‌ను అప్పగించారు. ' స్వదేశీ, విదేశీ పెట్టుబడులు ఏ మేరకు వస్తాయో తెలియదుగానీ 'మందు, విందు'లతో మాత్రం ముంచెత్తడం విశాఖ నగరంలో ఆదివారమంతా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బందోబస్తు నిర్వహణలో హోంగార్డు మృతి

విశాఖపట్నంలో జరుగుతున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు(సిఐఐ) బందోబస్తులో అపశ్రుతి చోటుచేసుకుంది. సదస్సులో భాగంగా రెండో రోజు ఆదివారం బందోబస్తు నిర్వహిస్తున్న హోంగార్డు సిహెచ్.రాజు(38) గుండెపోటుతో మృతి చెందాడు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో హార్బర్ పార్కు సమీపంలో రోడ్డుపై ట్రాఫిక్‌ను మళ్లిస్తున్న సమయంలో రాజుకు గుండె నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. వెంటనే స్పందించిన తోటి పోలీసులు హుటాహుటినా కెజిహెచ్‌కు తరలించారు. అప్పటికే ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలోని చిలకపేటకు చెందిన సిహెచ్.రాజు 2004లో హోంగార్డుగా చేరాడు. ప్రస్తుతం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇందులో భాగంగా సిఐఐ సదస్సు బందోబస్తుకు ఆయన కూడా వెళ్లారు. ఈ నేపథ్యంలో విధులు నిర్వర్తిస్తుండగా ఆయన ఆదివారం మృతి చెందడం ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రాజుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి నష్టపరిహారంగా రూ.పది లక్షలు చెల్లించాలని హోంగార్డుల రాష్ట్ర నాయకులు ఎన్.రామకృష్ణ యాదవ్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.



పగలు ఎండ.. రాత్రిళ్లు చలి..

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

హిందూ మహాసముద్రంలోని భూమధ్య రేఖా ప్రాంతంలో నైరుతి బంగాళాఖాతానికి సమీపంలో అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఉత్తర చత్తీస్‌గఢ్, పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని తెలిపింది. ఆగ్నేయ అరేబియా నుంచి దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండబోదని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. నాలుగు రోజుల పాటు కోస్తా, సీమల్లో పొడి వాతావరణం ఉంటుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాయలసీమ, కోస్తాలో అక్కడక్కడా 35, 36 డిగ్రీలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం ఎండలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇప్పటికీ చలి తీవ్రత కొనసాగుతోంది. 17 నుంచి 20 డిగ్రీలు నమోదవుతున్నాయి. పశ్చిమ ఆటంకాల ప్రభావంతోనే చలి తీవ్రత కొనసాగుతోందని నిపుణులు చెబుతున్నారు.

హోదా కోసం మహోద్యమం

- ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు
- రాష్ట్రాన్ని మోసం చేసిన బిజెపి, టిడిపి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర విభజన చట్టం అమలు, ప్రత్యేక హోదా కోసం మహోద్యమాన్ని చేపట్టాలని పలువురు వక్తలు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలను నాలుగేళ్లుగా మాయమాటలతో మభ్యపెడుతున్న బిజెపి,టిడిపిలు ఇప్పటికైనా తమ వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. దక్షిణ రాష్ట్రాలపై కేంద్రం ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ పౌరసమాజం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఆలోచనాపరుల రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం దాసరిభవన్‌లో జరిగింది. పౌరసమాజం వ్యవస్థాపకుడు, ప్రధాన కార్యదర్శి డానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు మాట్లాడుతూ బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై మొదటగా వామపక్షాలు గళం విప్పాయన్నారు.

ఇంత జరుగుతున్నా కూడా ఇంకా ప్రజలను మభ్యపెట్టేందుకు బిజెపి, టిడిపి యత్నించడం దారుణమన్నారు. రాష్ట్రానికి న్యాయం జరగాలంటే 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' తరహాలో మరో మహోద్యమం చేయాల్సిందేనన్నారు. రాష్ట్రానికి, రాయలసీమకు బిజెపి ఏమి చేసిందో చెప్పకుండా కర్నూలులో రాయలసీమ తీర్మానంతో అసలు సమస్యను పక్కదోవ పట్టిస్తోందని విమర్శించారు. ఇంత జరిగినా బిజెపితో సర్దుకు పోవాలనే



వైఖరితో టిడిపి ఉందన్నారు. బిజెపి,టిడిపి అనుసరించిన అవకాశావాద విధానాలను ఎండగట్టేందుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీలు, ప్రత్యేక హోదా సాధన సమితులు, ఇతర స్వతంత్ర సంస్థలు, అభ్యుదయ వేదికలు అన్నీ కలిసి ఈ పోరాటానికి సన్నద్ధం కావాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ హోదా ఇవ్వాల్సిన బాధ్యత ఎన్డీఎ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి, టిడిపిలదేనని స్పష్టం చేశారు. హోదా, విభజన హామీలు, లోటుబడ్జెట్ భర్తీ కోసం కలిసొచ్చే పార్టీలు, సంఘాలతో కలిసి ఢిల్లీకి సెగ తాకేలాగా ఉద్యమం చేయాల్సిన అవసరముందన్నారు. మార్చి 6 నుంచి ఢిల్లీలో పార్లమెంటు వద్ద ధర్నాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనవిజ్ఞానవేదిక అధ్యక్షుడు వి లక్ష్మణరెడ్డి, ప్రత్యేక హోదా సాధన సమితి ప్రతినిధి టి శ్రీరామ్ మాట్లాడుతూ ప్రత్యేక తరగతి హోదాతోనే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించగలదన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అందరూ ఒకేతాటిపైకి వచ్చి హోదా కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు, వైసిపి నేత కొణిజేటి రమేష్, రాజకీయ విశ్లేషకుడు సయ్యద్ రఫీ, టిడిపి అధికార ప్రతినిధి దింటకుర్తి వీరరాఘవ తదితరులు పాల్గొన్నారు.

'బెటర్ ఆంధ్రప్రదేశ్' ఆందోళనకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, హోదా ఆంధ్రుల హక్కు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు అన్నారు. ఆదివారం విజయవాడ ధర్నాచౌక్ వద్ద బెటర్ ఆంధ్రప్రదేశ్ (బిఎపి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని కేంద్రం వద్ద తాకట్టు పెట్టారన్నారు. తొలుత ప్యాకేజీ సరిపోతుందన్న సిఎం, ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో ఇప్పుడు హోదా కావాలని చెబుతున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా ఆకాంక్షించే ఇతర పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి పోరాడతామన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి పిలుపు మేరకు వచ్చే నెల 1న గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. హోదా కోసం వచ్చే నెల 2 నుంచి 4 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలకు పిలుపు నిచ్చామన్నారు. అలాగే 5,6 తేదీల్లో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద కూడా ఆందోళన నిర్వహిస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎమ్.ఎ. గఫూర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా ప్రకటిస్తే రాష్ట్రంలో పన్ను మినహాయింపులు ఉంటాయని, పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొస్తారన్నారు. పెట్టుబడులు మరింత ఊపందుకుంటాయన్నారు. అంతేకాని చంద్రబాబు ప్రత్యేక విమానాల్లో విదేశాల్లో పర్యటించినంత మాత్రాన పరిశ్రమలు రావన్నారు. పరిశ్రమల్ని నెలకొల్పితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రజాగ్రహం పెల్లుబికితే హోదా కావాలని, లేనిపక్షంలో ప్యాకేజీ సరిపోతుందని సిఎం రాజకీయ ప్రయోజనాల కోసం హోదాను వాడుకుంటున్నారన్నారు. ఏపీని ఆదుకుంటామని తిరుపతి వెంకన్న సన్నిధిలో హామీ ఇచ్చిన ప్రధాని మోడీ, ఆ విషయాన్నే మరిచారన్నారు. ప్రత్యేక హోదా కోసం ప్రజ లంతా ఉవ్వెత్తున ఉద్యమించాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ హోదా కోసం పోరాడే బిఎపికి మద్దతు ఇస్తామన్నారు. హోదా కోసం ప్రజలు ఉద్యమిస్తున్నారన్నారు. హోదాపై బిజెపి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా అంతకంటే ఎక్కువ ఇస్తామని చెబుతూ ఇప్పటికీ రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తోందన్నారు. బిఎపి అధ్యక్షుడు గౌతంరెడ్డి మాట్లాడుతూ విభజన గాయాన్ని మాన్పేందుకు సిఎం ఎలాంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. బిఎపి ద్వారా ప్రత్యేక హోదా కోసం ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా తీసుకెళ్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు, బిఎపి వ్యవస్థాపకులు విజయరాజు తదితరులు ఆందోళనకు మద్దతు తెలిపారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. బీహార్‌లో నీటి సరఫరా కోసం ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి భారత్ తీసుకున్న రుణం?
2. జీవ ఇంధనాలపై అంతర్జాతీయ సదస్సు ఎక్కడ జరుగుతుంది?
3. ఇటీవల మరణించిన కన్వర్ బాయి ఎవరు?
4. జిమ్నాస్టిక్ ప్రపంచకప్‌లో పతకం సాధించిన తొలి ఇండియన్?
5. ఆస్ట్రేలియా ఓపెన్ 2018 పురుషుల సింగిల్స్ విజేత?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



సదస్సులో మాట్లాడుతున్న ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజమాణిక్యం

శాస్త్రీయ దృక్పథానికి ప్రభుత్వాల విఘాతం

- జెవివి సదస్సులో ఎఐపిఎస్ఎన్ జాతీయ కార్యదర్శి రాజమాణిక్యం

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలందరి సంపదపై పెత్తనం చేస్తున్న వర్గాలు, వారికి సహకరించేందుకు పాలకవర్గాలు చేస్తున్న విధానాలపై సైన్స్ ఉద్యమ కార్యకర్తలు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) జాతీయ ప్రధాన కార్యదర్శి రాజమాణిక్యం పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక (జెవివి) ఆవిర్భవించి 30 ఏళ్లయిన సందర్భంగా గుంటూరులో 'శాస్త్రీయ దృక్పథం'పై రాష్ట్ర సదస్సు ఆదివారం నిర్వహిం చారు. ఈ సదస్సుకు జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా రాజమాణిక్యం మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు ప్రభుత్వాలు కృషి చేయక పోగా తిరోగమన విధానాలు చేపడుతున్నా యని విమర్శించారు. ఆరోగ్యం, విద్యను పూర్తిగా కార్పొ రేట్లకు అప్పగించటం భవిష్యత్ భారతదేశ అభి వృద్ధికి తీవ్ర నష్టదాయకమని చెప్పారు. బడ్జెట్‌లో సైన్స్ పరిశోధనలకు 0.02 శాతమే నిధులను కేటాయించటం ద్వారా ప్రభుత్వాలకు ఏమాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతోందన్నారు. ఎఐపిఎస్ఎన్ రాబోయే కాలంలో 'సబ్‌కా దేశ్, హమారా దేశ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంచటానికి కృషి చేయబోతున్నట్లు వివరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ భయ పడుతున్న సమాజానికి ధైర్యం చెప్పటమే సాహిత్య లక్ష్యమన్నారు. అనంతరం ప్రముఖ సామాజిక, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ హర గోపాల్ 'అసహనం-ఆర్థిక మూలాలు' అంశంపై, ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం '30 ఏళ్ల ప్రజా సైన్స్ ఉద్యమం, అనుభవాలు, గుణపాఠాలు' అంశం పైనా, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు 'సామాజికా భివృద్ధిలో-సైన్స్ ఆవశ్యకత' అంశంపై ప్రసంగిం చారు. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా సైన్స్ ఉద్యమ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్య క్రమంలో ఎఐపిఎస్ఎన్ మాజీ ప్రధాన కార్యదర్శి టి.రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, త్రిమూర్తులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోడీ, చంద్రబాబు ఫిక్సింగ్

మీడియాతో జైరాం రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు పార్లమెంట్‌లో ఫిక్సింగ్ చేసుకున్నారని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ ఆరోపించారు. పిసిసి రాష్ట్రకార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్నారు. 11 రాష్ట్రాలు ప్రత్యేకహోదాను అనుభవిస్తున్నాయని, ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వడానికి మోడీకి ఉన్న అభ్యంతరమేమిటని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని, పోలవరాన్ని నిర్మించాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. వైఫల్యాల్ని కప్పిపుచ్చుకునేందుకు మోడీ, చంద్రబాబు డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

ఇందిరాగాంధీ పర్యావరణ వేత్త అయ్యేవారు..

పర్యావరణ పరిరక్షణకు ఇందిరాగాంధీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవారని కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్ అన్నారు. 'ఇందిరా గాంధీ-ఒక ప్రకృతి ప్రేమికురాలి జీవితం' పుస్తకావిష్కరణ సభ విజయవాడలో ఆదివారం నిర్వహించారు. ఎమ్మెస్కో విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో జైరాం రమేష్ మాట్లాడుతూ ఇందిరా గాంధీ రాజకీయ నేత కాకపోతే, పర్యావరణ, సామాజికవేత్త అయ్యేవారన్నారు. ఆమె లేకపోతే పర్యావరణ చట్టం వచ్చిఉండేది కాదన్నారు. ఇదే కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్‌పై జైరామ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పవన్‌కు కాంగ్రెస్ అంటే అభిమానమని చెప్పారు.

జైరామ్‌తోనే ఇబ్బందులొచ్చాయి : మాజీ ఎంపి ఉండవల్లి

మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజనకు సంబంధించి జైరాం రమేష్ ఆధ్వర్యంలో చేసిన చట్టం బాగోలేదని, ఇబ్బందుల్ని తెచ్చిపెట్టిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. సాక్షి వార్తాసంస్థ ఎడిటోరియల్ డైరెక్టర్ రామచంద్రమూర్తి మాట్లాడుతూ దళిత, ఆదివాసీల పట్ల ఇందిర ఎంతో ప్రేమను కలిగి ఉండేవారన్నారు. ఆమె ప్రవేశపెట్టిన పథకాల వల్ల దళితుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు.



సీపీఎస్ విధానం రద్దు కోసం ఐక్యంగా పోరాడుదామంటూ మద్దతు తెలిపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు

ప్రజాసంకల్పయాత్రలో జగన్ హామీ

ప్రజాశక్తి-కనిగిరి (ప్రకాశం)

తాను అధికారంలోకి రాగానే పెన్షన్‌కు సంబంధించి సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరిస్తానని వైఎస్ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి హామీనిచ్చారు. ఆదివారం ప్రకాశం జిల్లా కనిగిరి నగర పంచాయతీ కాశిరెడ్డి కాలనీ సమీపం నుంచి ప్రారంభమైన ప్రజా సంకల్పయాత్ర చల్లగిరగల, నందనమారెళ్ళ, యడవల్లి క్రాస్‌రోడ్డు మీదుగా సాగింది. పాదయాత్రలో సిపిఎస్ రద్దు కోసం ఉద్యోగులు, యుటిఎఫ్ నాయకులు, వికలాంగులు జగన్‌ను కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కోరగా, జగన్ స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ వైసిపి కనిగిరి యువజన విభాగం ఆధ్వర్యంలో స్థానిక పొగాకు బోర్డు ఎదురుగా జాతీయ రహదారిపై బైఠాయించి తెలిపిన నిరసనకు జగన్ మద్దతు తెలిపారు. అందరం కలిసి పోరాడి హోదాను సాధించుకుందామన్నారు. చల్లగిరగల గ్రామం వద్ద వైసిపి జెండాను జగన్ ఎగుర వేశారు. నందన మారెళ్ల వద్ద 1301 కి.మీ.లు పాదయాత్ర పూర్తవుతుండటంతో జగన్ అభిమానులు రోడ్డుపై ఉప్పుకలిపిన రంగులతో అక్షరాలను సుందరంగా తీర్చిదిద్ది స్వాగతం పలికారు. ఇక్కడ జగన్ మొక్కను నాటి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పాదయాత్ర యడవల్లి క్రాస్‌రోడ్డు నుంచి మార్కాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది. జగన్ వెంట ఎంపి వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు వేల్పుల వెంకటేశ్వరు, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.


ప్రత్యేకం

రాజ్యసభ ఆఫర్‌పై జెపి సందిగ్ధం?

- ఎన్నికల షెడ్యూల్‌తో జోరందుకున్న చర్చలు
- ఆ ప్రతిపాదన సిఎందే: జనసేన
- కాదు పవన్‌దే : టిడిపి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

లోక్‌సత్తా వ్యవస్థాపకులు, మాజీ ఐఎఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ (జెపి)కు అధికార తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన రాజ్యసభ సభ్యత్వ ఆఫర్‌పై అటు జెపి ఇటు లోక్‌సత్తా పార్టీలో సంది గ్ధం నెలకొన్నట్లు సమాచారం. రాజ్యసభ ఆఫర్‌పై అత్యున్నతస్థాయిలో సమాలోచనలు సాగుతుండ గానే కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం ఎన్నికల షెడ్యూలు వెలువరించింది. మార్చి 5న నోటిఫి కేషన్, అదే నెల 12 నామినేషన్లకు తుది గడువుగా ప్రకటించింది. రాజ్యసభ ఆఫర్‌పై జెపి తేల్చుకోడానికి గరిష్టంగా పక్షం రోజులు మాత్రమే సమయ ముంది. దాంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, జెపి తమ తమ కోణాల్లో సన్నిహితులతో చర్చలు సాగిస్తు న్నట్లు తెలిసింది. జెపికి రాజ్యసభ ఆఫర్ వచ్చిన మాట వాస్తవమేనని అయితే ఆయన ప్రస్తుతానికి ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని టిడిపి, లోక్‌సత్తా వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆఫర్ చంద్రబాబు తనకుతానుగా ఇచ్చారా లేక జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రతిపాదించారా అనే అంశాలపై ఎవ రికి తోచినవిధంగా వారు వాదనలు వినిపిస్తున్నారు.



జయప్రకాశ్ కోర్టులో బాల్

ప్రత్యేక హోదా విషయంలో రాజకీయంగా టిడిపికి జరిగిన నష్టాన్ని భర్తీ చేసేదాంట్లో భాగంగా ముఖ్యమంత్రే పవన్‌తో జెపి చెంతకు రాజ్యసభ ప్రతిపాదన పంపారని జనసేన శ్రేణులు చెపుతుండగా ఆ ప్రచారాన్ని టిడిపి నాయకులు తప్పుబడుతున్నారు. జెపికి రాజ్యసభ ఇవ్వాలంటూ చంద్రబాబు వద్ద పవన్ కళ్యాణే రాయబారం చేశారని వారంటున్నారు. టిడిపి, జనసేన రెండు పార్టీలూ జెపికి రాజ్యసభపై ప్రతిపాదించింది మీదు ముందంటే కాదు మీరేనని వాదులాడుకుంటున్న తరుణంలో అసలు జెపి అంతరంగం ఏంటన్న విషయంపై రాజకీయవర్గాల్లో చర్చలు సాగుతున్నాయి.

జెపిని సంప్రదించకుండా చంద్రబాబు వద్దకు పవన్ ప్రతిపాదన తీసుకురారని కొందరంటుంటే, జెపితో మాట్లాడకుండా పవన్ మద్దతును, అభిప్రాయాన్ని సిఎం తీసుకోరని మరికొందరంటు న్నారు. ప్రస్తుతం బాల్ జెపి కోర్టులో ఉందని, తేల్చుకోవాల్సింది ఆయనేనని టిడిపి, జనసేన వర్గాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి.

స్వతంత్ర అభ్యర్థిగా..

ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధనకు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)ని నెలకొల్పేందుకు పవన్ ప్రయత్నించగా జెపి పాల్గొ న్నారు. సరిగ్గా ఇప్పుడే జెపికి రాజ్యసభ ఆఫరొ చ్చింది. దీనిపై జెపి సందిగ్ధంలో ఉన్నట్లు సమా చారం. ఎలాగూ జెఎసిలోకి వచ్చాం కనుక రాబోయే ఎన్నికల్లో టిడిపి, వైసిపిలను కాదని మూడోశక్తిగా జనసేన పోటీ చేస్తే ఆ పార్టీతో పొత్తు పెట్టుకుంటే రాజకీయంగా లోక్‌సత్తాకు లాభం ఉంటుందని జెపి ఆలోచిస్తున్నట్లు తెలిసింది. జనసేన మూడోశక్తిగా పోటీ చేసే విషయంపై ఇప్పటి వరకు పవన్ నుంచి స్పష్టత రాలేదని లోక్‌సత్తా అంటోంది. పైగా రాజ్యసభ ఆఫర్‌ను పవన్ తీసుకురావడంపై జెపి అంతర్మథనంలో పడ్డట్లు సమాచారం. ఒకవేళ రాజ్యసభ తీసుకునేటట్లయితే టిడిపి 'బి' ఫారంపై కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి, అధికారపార్టీ మద్దతు పొందితే ఎలా ఉంటుం దనేదానిపై చర్చలు సాగుతున్నట్లు తెలిసింది. ఏ పార్టీకి చెందకుండా మేధావిగా రాజ్యసభకు వెళితే ఇబ్బందులుండవని ఆలోచన చేస్తున్నట్లు సమా చారం. ఇదిలా ఉండగా ఒకవేళ జెపి రాజ్యసభకు వెళ్లదలిస్తే లోక్‌సత్తా పార్టీలో కూలంకుషంగా చర్చ జరుగుతుందని, తమ పార్టీలో ప్రజాస్వామ్యం ఉందని ఆ పార్టీ నేతలు కొందరంటున్నారు.

సంక్షిప్తం

సీనియర్ జర్నలిస్టు రమేష్ బాబు సేవలు ఎనలేనివి ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీనియర్ జర్నలిస్టు, ఈనాడు న్యూస్‌టుడే మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన జి రమేష్ బాబు పత్రికా రంగానికి అందించిన సేవలు ఎనలేనివని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య (ఎపిడబ్ల్యుజెఎఫ్) ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో జర్నలిస్టుగా, ఈనాడులో న్యూస్‌టుడే మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆయన బాధ్యతలు నిర్వహించారని పేర్కొన్నారు. ఆయన అందించిన సేవలతో గ్రామీణ జర్నలిస్టు వ్యవస్థ పటిష్టమైందని తెలిపారు. నాలుగు దశాబ్దాల పాటు జర్నలిస్టుగా కొనసాగిన రమేష్ బాబు లేని లోటు తీర్చలేదని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు సమాఖ్య తరపున సానుభూతి తెలిపారు.

ఐబిఇఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ముగిసిన జాతీయ సమావేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండియన్ బ్యాంకు ఉద్యోగుల ఫెడరేషన్ నూతన కార్యవర్గం 19 మంది సభ్యులతో ఎన్నికయ్యింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు జరిగిన ఫెడరేషన్ 12వ జాతీయ సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. ఫెడరేషన్ జాతీయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కె కృష్ణన్, రంజన్ రాజ్, కోశాధికారిగా తపన్ దాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలను చేశారు. ఎఫ్ఆర్‌డిఐ బిల్లును, కార్మిక వ్యతిరేక చట్టాలను, ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలను నిలిపివేయాలని, తాత్కాలిక ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై మద్రాస్ హైకోర్టు తీర్పును అమలు చేయాలని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

రాష్ట్రంలో గేమింగ్, డిజిటల్ లెర్నింగ్ హబ్

యునెస్కో- ఎమ్‌జిఐఇపి డైరెక్టర్‌తో మంత్రి లోకేష్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గేమింగ్ అండ్ డిజిటల్ లెర్నింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు యునెస్కో-ఎమ్‌జిఐఇపి కంపెనీ ముందుకొచ్చింది. విశాఖపట్నంలో జరుగుతున్న సిఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆ కంపెనీ డైరెక్టర్ అనంత్‌తో ఆదివారం భేటీ అయ్యారు. గేమింగ్ అండ్ డిజిటల్ లెర్నింగ్‌లో ఏపీని గ్లోబల్ డెస్టినేషన్‌గా మార్చేందుకు అనేక అవకాశాలున్నాయని లోకేశ్ ఆ కంపెనీ డైరెక్టర్‌కు వివరించారు. గేమింగ్, యానిమేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, అనేక ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు. ఎపి ఫైబర్‌గ్రిడ్ ద్వారా విద్యార్థులకు మరింత సమాచారం అందించే అవకాశముంటుందని, కంటెంట్ కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.

గేమింగ్, యానిమేషన్ రంగంలో ఉన్న ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, యునెస్కో-ఎమ్‌జిఐఇపి సహకారంతో సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. ఫైబర్ గ్రిడ్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని, గేమింగ్, డిజిటల్ లెర్నింగ్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని కంపెనీ డైరెక్టర్ హామీ ఇచ్చారు. అంతకు ముందు ఎజిస్ కంపెనీ గ్లోబల్ సిఇఒ సందీప్ సేన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఇప్పటికే విజయవాడలో 400 మందితో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, త్వరలో రాష్ట్రంలో మరో వెయ్యి మందితో కార్యకలాపాల్ని విస్తరిస్తామని సందీప్ సేన్ తెలిపారు. ఫైబర్ గ్రిడ్ ద్వారా బిజిఒ కార్యకలాపాల్ని ప్రారంభిస్తామని, ఇంటి నుంచే పని చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. వచ్చే నెలలో పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించి ఇంటి నుంచే పని చేసే విధంగా శిక్షణ ఇస్తామని సందీప్ పేర్కొన్నారు.

ముగిసిన సిక్కోలు సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా సాంస్కృతిక శాఖ, సంప్రదాయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 23న ప్రారంభమైన సిక్కోలు సంబరాలు మూడో రోజు ఆదివారంతో ముగిశాయి. హైదరాబాద్‌కు చెందిన విక్టరీ ఈవెంట్ సంస్థ ఘనంగా ఈ సంబరాలను నిర్వహించింది. జానపద కళారూపాలు, జిల్లాకు చెందిన కళాకారుల ప్రదర్శనలతో సంబరాలు అంబరాన్ని తాకాయి. ప్రముఖ నృత్యకారిణి, శిక్షకులు నీరజా సుబ్రహ్మణ్యం స్వాగత నృత్యం ఆకట్టుకుంది. కీర్తి ప్రియా శాస్త్రీయ ఫ్యూజన్ నృత్యం ప్రేక్షకులను కట్టి పడేసింది. సుసరావు లక్ష్మీగణపతిశర్మ సినీ శాస్త్రీయ సంగీతం వీణలు విందు చేసింది. గిరిజా బృందం కోలాటం, శివకుమార్ బృందం నృత్యం సందర్శకులను ఆకట్టుకుంది.



శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన సిక్కోలు సంబరాలులో ప్రదర్శించిన నృత్యం

రాష్ట్రంలో కొత్తగా పది క్రీడా అకాడమీలు

దక్షిణాఫ్రికా, కెన్యా కోచ్‌లతో శిక్షణ - యువజన సర్వీసుల్లో క్రీడా శాఖ విలీనం : బంగార్రాజు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో కొత్తగా పది క్రీడా అకాడమీలను ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర క్రీడా సాధికారిత సంస్థ (శాప్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బంగార్రాజు తెలిపారు. జిల్లా పర్యటనకు ఆదివారం వచ్చిన ఆయన కలెక్టరేట్‌లోని సెట్‌శ్రీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో యువజన సర్వీసుల శాఖ, క్రీడా శాఖలను విలీనం చేసి కొత్త ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇకపై జిల్లాలో పరిపాలనాపరమైన అంశాలను జిల్లా యువజన క్రీడల అధికారి నిర్వహిస్తారని తెలిపారు. క్రీడాకారులకు కోచింగ్, క్రీడా సాంకేతికతకు సంబంధించిన అంశాలను చీఫ్ కోచ్ (క్రీడాభివృద్ధి అధికారి) చూస్తారని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసిందని తెలిపారు. రాష్ట్రంలో క్రీడల్లో స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో ప్రతిభావంతులైన 75 మంది క్రీడాకారులను ఎంపిక చేసి అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా విదేశీ నిపుణులైన కోచ్‌లతో శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. విదేశీ కోచ్‌లు మూడేళ్లపాటు ఇక్కడే ఉండి కోచింగ్ ఇస్తారని తెలిపారు. తరువాత మూడేళ్లు తర్ఫీదును పర్యవేక్షిస్తారన్నారు. దక్షిణాఫ్రికా నుంచి నలుగురు, కెన్యా నుంచి ముగ్గురు కోచ్‌లతో ఒప్పందం కుదిరిందని తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకూ ఎన్‌టిఆర్ క్రీడా వికాస కేంద్రాలను మంజూరు చేశామన్నారు. వాటిలో 30 కేంద్రాలు ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. మరో 118 ప్రగతిలో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

భూమికి బదులు కొండ!

- వివాదాల్లో ఉన్న భూముల అప్పగింత
- అగమ్యగోచరంగా పోలవరం నిర్వాసితుల పరిస్థితి



పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన రాళ్లు, రప్పలతో కూడిన భూమి ఇదే..

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టుతో సర్వం కోల్పోయిన నిర్వాసితుల పరిస్థితి ప్రభుత్వ తీరుతో అగమ్యగోచరంగా మారింది. భూమికి భూమి కింద రాళ్లు, రప్పలు ఉన్న భూములు, ఇసుక, వివాదాల్లో ఉన్న భూములు అప్పగించి, వారికి తీవ్ర అన్యాయం చేసింది. పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం చేగొండపల్లి గ్రామం ఖాళీ చేయించి రెండేళ్లు గడుస్తోంది. ఆ గ్రామానికి చెందిన తొమ్మిది గిరిజన కుటుంబాలకు గుంజవరం గ్రామ సమీపంలోని రాయుడు చెరువు వద్ద 17.50 ఎకరాలను భూమికి.. భూమి కింద ఇచ్చారు. ఆ భూములన్నీ ఇసుక, రాళ్లతో నిండి ఉన్నాయి. నీటి సదుపాయమే లేదు. సాగుకు ఏ మాత్రమూ యోగ్యంకావు. ఈ భూముల్లో పంటలు ఎలా పండించాలని, తమకు వేరే భూములు ఇవ్వాలని గిరిజన రైతులు తహశీల్దార్ నుంచి కలెక్టర్ వరకూ అందరి వద్దకు కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. ఆ భూమి తప్ప వేరే భూమి ఇవ్వడం కుదరదంటూ కరాఖండీగా చెబుతున్నారు. పండే పంట భూములు తీసుకుని ఇసుక నేలలు ఇవ్వడంతో రెండేళ్లుగా పంటలు పండక గిరిజన రైతులకు చిల్లిగవ్వ ఆదాయం లేకుండా పోయింది. అదే గ్రామానికి చెందిన మరికొంతమంది రైతులకు అక్కడకు దగ్గరలోనే భూమి ఇచ్చారు. ఆ భూమి పెద్దకొండ, రాళ్ళు, రప్పలతో ఉంది. అక్కడ పంటలు పండించడం అసాధ్యమని ఎవరైనా ఇట్టే చెబుతారు. ఈ భూములన్నీ కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అసలు ఇలాంటి భూములు ఏ విధంగా కొనుగోలు చేశారో అర్థం కావడం లేదు. ఈ నేపథ్యంలో దీని వెనుక పెద్ద కుట్ర దాగున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వివాదాస్పద భూముల అప్పగింత

పోలవరం మండలంలో ఖాళీ చేయించిన గ్రామాల్లోని గిరిజనుల్లో కొంతమందికి బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరం వంటి గ్రామాల్లో భూములను భూమికి.. భూమి కింద కేటాయించారు. అవన్నీ ఎల్‌టిఆర్ భూములు. స్థానిక గిరిజనులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకుని ఎప్పటి నుంచో సాగుచేసుకుంటున్నారు. ఆ భూము లను నిర్వాసిత గిరిజనులకు అప్పగించి గిరిజనుల మధ్య తగాదా నెలకొనే పరిస్థితులు కల్పిస్తున్నారు. టిడిపి అనుయాయులకు లబ్ధిచేకూర్చేందుకు కొండ, రాళ్ళు, రప్పలు, ఇసుక నేలల భూములను వారి వద్ద నుంచి కొనుగోలు చేసి గిరిజనులకు అప్పగించారు. ఇదంతా ముం దస్తు వ్యూహంతో కుట్రపూరితంగానే జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకూ పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఎనిమిది గ్రామాలను ఖాళీ చేయించారు. ప్రతి గ్రామంలోనూ భూమికి.. భూమి కింద భూములు అందాల్సిన వారు పది నుంచి 20 కుటుంబాల వరకూ ఉన్నట్లు గిరిజనులు చెబుతున్నారు. భూములిచ్చిన వారికి సైతం సరిహద్దులు నిర్ణయించడం, పట్టాలు ఇవ్వడం వంటివి ఏమీ జరగలేదని అంతా చెబుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన ఏ భూముల్లోనూ నీటిసదుపాయం లేదు. బోర్లు వేస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ వేయలేదు. కట్టుబట్ట లతో బయటకొచ్చిన గిరిజనులకు చిల్లిగవ్వ ఆదా యం లేకుండా పోయింది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బం దులు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు.

ఆరెకరాల కొండ ఇచ్చారు



భూమికి.. భూమి కింద మా కుటుంబానికి ఆరు ఎకరాలు ఇవ్వాల్సి ఉండగా.. సర్వేనెంబర్ ఐదులో భూమిని చూపించారు. అక్కడికి వెళితే పెద్ద రాతికొండ ఉంది. అదేమని అడిగితే అధికారులొచ్చి పరిశీలించారు తప్ప ఇప్పటివరకూ వేరే భూమి కేటాయించలేదు. కాళ్లు అరిగేలా తిరిగి మా నాన్న, అమ్మ చనిపోయారు. పంటలేక చిల్లిగవ్వ ఆదాయం లేకుండా పోయింది.

- ముచ్చిక శివ, గిరిజన రైతు, చేగొండపల్లి

ఇసుక నేల కేటాయించారు



నాకు చేగొండపల్లిలో 1.15 ఎకరాల సాగు భూమి ఉండేది. మా కుటుంబానికి ప్రధాన ఆదాయం ఆ పొలమే. భూమికి.. భూమి కింద గుంజవరంలోని రాయుడు చెరువు వద్ద ఇసుక నేల కేటాయించారు. నీటి సదుపాయం లేకపోగా, సాగుకు యోగ్యం కాని భూమి అది. వేరే భూమి ఇవ్వాలని అడిగితే అదిగో.. ఇదిగో అనడం తప్ప అధికారులు పట్టించుకోకపోవడంతో మా పరిస్థితి అధ్వానంగా మారింది.

- ముచ్చిక చల్లబ్బాయ్, గిరిజన రైతు



రైతుపై పోలీస్ జులుం

బట్టలు చించి ఈడ్చుకుపోయారు

సచివాలయం వద్ద ఉద్రిక్తత

వాస్తు పేరుతో సీఎం కోసం కొత్త రహదారికి యత్నం

సిపిఎం చొరవతో రైతుల ఐక్య ప్రతిఘటనతో వెనక్కి...

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణమంటూ గొప్పలు చెపుకుంటున్న ప్రభుత్వం పోలీసుల చేత ఆదివారం ఓ రైతుపై పాశవికంగా దాడి చేయించింది. సొంత పొలంలోనే ఆ రైతుకు చేదు అనుభవం ఎదురైంది. వెలగపూడి తాత్కాలిక సచివాలయం వెనుక వైపు నుంచి దారి ఏర్పాటు చేసుకునేందుకు భూ సమీకరణలో భూమి ఇవ్వని రైతు పొలంలో మీదుగా నిర్మాణాలు చేపట్టేందుకు సిఆర్‌డిఏ అధికారులు ప్రయత్నించగా రాత్రి 11-12 గంటల ప్రాంతంలో పలువురు అడ్డుకోవడంతో ఆదివారం రాత్రి ఉద్రిక్తత ఏర్పడింది. సీఎంకు ఉన్న వాస్తు నమ్మకంతో వెనుక భాగం నుంచి రాకపోకలు కొనసాగించాలన్న లక్ష్యంతో గతంలో నిర్మించిన ప్రహరీగోడను తొలగించి ఈ రహదారిని నిర్మించాలని అధికారులు తలపెట్టారు. అయితే రైతు గద్దె మీరా రాం ప్రసాద్ భూమిని సమీకరణలో ఇవ్వలేదు. నిర్మాణాలు జరగకుండా ఉన్నత న్యాయ స్థానం నుంచి స్టే తెచ్చుకున్నారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నించారు. వీరికి బందోబస్తుగా తుళ్లూరు డిఎస్‌పి, సిఐలు వచ్చారు. న్యాయవాదులు, సిపిఎం నాయకులు కూడా రైతుకు మద్దతుగా పనులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పనులు ప్రారంభించాల్సిందేనని సిఆర్‌డిఏ అధికారులు పోలీసుల మద్దతులో ముందుకు వెళ్లగా సిపిఎం నాయకులు అడ్డుకోగా తమకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని పోలీసు అధికారులు నిరసన తెలుపుతున్న వారిని తొలగించే ప్రయత్నం చేశారు. సమీకరణలో భూమి ఇవ్వకుండా రోడ్డు ఎలా నిర్మిస్తారని రైతు రాం ప్రసాద్ తరుపు న్యాయవాదులు ప్రశ్నించారు. కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కింద ప్రైవేటు కేసు వేస్తామని న్యాయవాదులు స్పష్టం చేశారు. దీంతో అధికారులు కొంత వెనక్కి తగ్గారు. కానీ సిఐ సుధాకర్, ఎస్ఐ శ్రీనివాస్‌లు రెచ్చిపోయి రైతుపై జులుం ప్రదర్శించారు. సిపిఎం నాయకులతో పాటు వైసిపి కార్యకర్తలు కూడా అధికారుల చర్యలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు.దీంతో స్వల్పంగా తోపులాట జరిగింది. సిపిఎం రాజధాని ప్రాంత కార్యదర్శి ఎం.రవి, వైసిపి మండల కార్యదర్శి బత్తుల కిషోర్, సిపిఎం నాయకులు కె.రమేష్, గడ్డం కృష్ణ,రైతులు గద్దె మీరా రాంప్రసాద్, గద్దె చంద్రశేఖర్ తదితరులు అధికారుల చర్యలను ఖండించారు. సమీకరణలో భూమి రైతులను ఇబ్బంది పెట్టడం, దౌర్జన్యం చేసి బెదిరించడం తగదని సిపిఎం నాయకులు ఎం.రవి వ్యాఖ్యానించారు. వాస్తు పేరుతో మూఢ నమ్మకాలకు పోయి రైతులను బలి చేస్తారా అని ప్రశ్నించారు. చివరకు రైతులందరూ ప్రతిఘటిం చడంతో రైతును ఆ పొలంలోనే వదిలి సమీపంలో ఉన్న యంత్రాలను, లారీలను వెనక్కి తీసుకెళ్లారు.

త్వరలో ఎసిబిలో 350 పోస్టులు భర్తీ

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కెఇ.క్రిష్ణమూర్తి



అవినీతి నిరోధక శాఖ కార్యాలయ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

అవినీతి నిరోధకశాఖలో త్వరలోనే 350 పోస్టులు భర్తీ చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కెఇ.క్రిష్ణమూర్తి పేర్కొన్నారు. ఇందులో 50 పోస్టులు అవుట్‌సోర్సింగ్ కింద కేటాయిస్తామని తెలిపారు. ఆదివారం కర్నూలులోని చాణక్యపురి కాలనీలో అవినీతి నిరోధకశాఖ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెఇ.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ.. సొంత భవనం నిర్మించుకున్న ఎసిబి శాఖ కార్యాలయాన్ని తాను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అన్ని శాఖల్లోకెల్లా కీలకమైన ఎసిబిను పటిష్టం చేసి అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణబద్దులై ఉన్నారని తెలిపారు. ఎసిబి శాఖ కార్యాలయానికి 2004లో 10 సెంట్ల భూమిని జిల్లా కలెక్టర్ కేటాయించగా ఈ స్థలంలో కేవలం 7 నెలల కాలంలో రూ.87.30 లక్షలతో అన్ని హంగులతో కూడా భవనాన్ని నిర్మించారని చెప్పారు. అవినీతిని నిర్మూలించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన 1100కి కాల్ చేసి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలోని కేసులను సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక కోర్టును కర్నూలులో ఏర్పాటు చేశారన్నారు. అవినీతి శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. డైరెక్టర్ జనరల్ ఆర్‌సి.ఠాగూర్, రాయలసీమ ఐసి షేక్ మహమ్మద్ ఇక్బాల్, రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్, పిఎసి చైర్మెన్ బుగ్గనా రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కేంద్రం చిన్నచూపు చూస్తే ఏ నిర్ణయానికైనా వెనుకాడం

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం మోసగిస్తే ఏ చర్య తీసుకోవడానికైనా వెనుకాడబోమని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. రాష్ట్రంలోని 110 మున్సిపాల్టీల నుంచి ఇళ్ల కోసం 12 లక్షల దరఖాస్తులు వచ్చాయని వాటిలో 8.50 లక్షల దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చామని చెప్పారు. మొదటి విడతగా 6.81 లక్షల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. విజయనగరం పట్టణ శివారు సారిపల్లి ప్రాంతంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం కింద షేర్ టెక్నాలజీతో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను మంత్రి ఆదివారం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన ఇళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు.



ప్రత్యేక హోదాతో ఏవైతే ఉపయోగాలుంటాయో అవే ప్రయోజనాలను కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడంతో ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నామని చెప్పారు. మంత్రి వెంట ఎమ్మెల్యే మీసాల గీత, జాయింట్ కలెక్టర్ శ్రీకేశ్ బి లఠ్కర్, ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి, మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కమిషనర్ రవీంద్ర, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

పరిశ్రమలన్నీ రాయలసీమకే..

బిజెపి నేతల వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్నాయుడు ఫైర్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని బిజెపి వాళ్లు, బుద్ధిలేని వాళ్లు మాట్లాడుతున్నారని, రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమలన్నీ రాయలసీమకే వెళ్తున్నాయని, అందులో భాగంగా కియో కార్ల కంపెనీ, ఎలక్ట్రానిక్స్ కంపెనీ వంటివి ఉన్నాయని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. విశాఖలోని సిఐఐ సదస్సుకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో ఫార్మాకు అనుకూలంగా ఉందన్నారు. శ్రీకాకుళంలోని భావనపాడులో ఆదానీ పోర్టు నిర్మాణానికి అంగీకరించారన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో వోక్స్ వ్యాగన్ వచ్చినా ప్రారంభించే సమయానికి వెళ్లిపోయిందన్నారు. కియో రాయలసీమలో పెట్టినందువల్ల ఈ సారి ఉత్తరాంధ్రకు ఆటోమొబైల్ సంస్థను తీసుకురావాలనే అలోచనలో సిఎం ఉన్నారన్నారు. ప్రత్యేక హోదా వద్దని తాము చెప్పలేదన్నారు. పార్లమెంటులో హామీ ఇచ్చారని, ఆనాడు బిజెపి కూడా అడిగిందని అన్నారు. దాని వల్ల కొన్ని రాయితీలు, ఇన్సెంటివ్స్ వస్తాయన్నారు. ఎపి బాగుందని తాము చెబుతుండటం వల్లే కేంద్రం ఏమీ ఇవ్వలేదని కొందరంటున్నారని, వాళ్లు సహకరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం చేతులు ముడుచుకుని కూర్చోదని అన్నారు.

ఐటి కంపెనీలో అగ్నిప్రమాదం

కాలిబూడిదైన కంప్యూటర్లు, ఫర్నీచర్

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఓ ఐటి కంపెనీలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గత నెల 17న రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ప్రారంభించిన రెండు ఐటి కంపెనీలు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. చారువికెంట్ ఐటిఎస్ ప్రైవేటు లిమిటెడ్, అద్వైత్ అల్గారిథం కంపెనీల్లో విద్యుదాఘాతానికి గురై ప్రమాదం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారులు అనుమానిస్తున్నారు. కంపెనీ నుండి ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు పొగలు వస్తుండడంతో గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అదించారు. మొత్తం ఐదు ఫ్లోర్లలో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అక్కడికి చేరుకున్న మంగళగిరి అగ్నిమాపక సిబ్బంది దాదాపు గంటన్నరపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఆయా కంపెనీల్లో ఫర్నిచర్, కంప్యూటర్లు, ఇతర వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. రూ.40 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉండొచ్చని అంచనా. ఘటనా స్థలిని అర్బన్ ఎస్‌పి విజయరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మురళికృష్ణ, పట్టణ సిఐ బి.హరికృష్ణ సందర్శించారు. సిసి కెమెరాలు మొత్తం పరిశీలించి సమగ్ర విచారణ అనంతరం ప్రమాదం ఎలా వాటిల్లిందో నిర్ధారిస్తామని ఎస్‌పి ప్రకటించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు.



గుంటూరు జిల్లా మంగళగిరిలో ఐటి కంపెనీ నుండి ఎగసిపడుతున్న మంటలు

వీడని మిస్టరీ!

రైల్వే ఎస్‌పి ఆధ్వర్యంలో పోస్టుమార్టం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు రూరల్ మండలం సత్రంపాడు పంచాయతీ వద్ద రైలునుంచి కిందపడి మృతిచెందిన సిక్కిం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకు చెందిన యువకుల మృతిపై మిస్టరీ ఇంకా వీడలేదు. సిక్కిం రాష్ట్రం తూర్పు రాజ్యభవన్‌కు చెందిన సిల్వెస్టర్ లెప్చా, వెస్ట్ బెంగాల్ రాష్ట్రం పగాగ్ గుంపాపోంగ్‌కు చెందిన ఆమోస్ లెప్చా ఇద్దరూ బెంగళూరులో ఓ హోటల్‌లో ఇంటర్వ్యూకు కామాఖ్య యశ్వంత్‌పూర్ స్పెషల్ రైలులో బెంగళూరుకు బయలుదేరారు. ఆ రైలు శనివారం తెల్లవారుజామున ఏలూరు రూరల్ మండలం సత్రంపాడు ప్రాంతానికి చేరుకునే సరికి వారిద్దరూ రైలునుంచి కిందపడిపోయారు. తీవ్ర గాయాలపాలైన వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. వారి మృతదేహాలకు ఆదివారం కృష్ణాజిల్లా రైల్వే ఎస్‌పి కెవి.మోహనరావు, డిఎస్‌పి ఎం.సత్తిబాబు, సిఐ డి.గంగాధరరావు సమక్షంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను పశ్చిమబెంగాల్, సిక్కిం రాష్ట్రాలకు వేరువేరు అంబులెన్స్‌లలో తరలించారు. అయితే వీరిద్దరి మృతిపై పలు అనుమానాలు కమ్ముకున్నాయి. వారి మృతదేహాల మధ్య పది మీటర్ల దూరం ఉండడం, బ్యాగు కూడా వారివద్దనే ఉండడం అనుమానాలకు తావిస్తుంది. వారిని ఎవరైనా తోసి హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సహకరించకుండా సమస్యలు సృష్టిస్తున్నారు..

కేంద్రంపై మంత్రి పత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యలు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విభజన హామీల అమలుకు సహకరించకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సమస్యలు సృష్టిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. సిఐఐ సదస్సులో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే అమరావతి నిర్మాణానికి సహకారం అందించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విభజన చట్టంలోని హామీల అమలుకు కృషి చేయాలన్నారు. అమరావతిని దక్షిణ భారతదేశంలో రెండో రాజధానిగా ప్రకటించాలన్నారు. రాయలసీమకు అన్యాయం చేస్తున్నారన్న బిజెపి నేతలపై ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబే రాయలసీమ వాసి అయినప్పుడు అన్యాయం ఎలా జరుగుతుందన్నారు. రాయలసీమ డిక్లరేషన్‌ను బిజెపి తెరపైకి తెచ్చినందున దానికి ఆ పార్టీ వాళ్లే సమాధానం చెప్పాలన్నారు. ఆ ప్రాంత అభివృద్ధికి వారే నిధులివ్వాలని, మూడున్నరేళ్లలో అన్నీ చేశామంటున్న బిజెపి నేతలు నామమాత్రపు నిధులతో ఎన్ని సంవత్సరాల్లో పూర్తి చేస్తారో సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికీ రైల్వే జోన్, అమరావతి, పోలవరానికి నిధులు ఇవ్వలేదన్నారు. 9 కేంద్ర ప్రభుత్వ సంస్థలకు నిధులు విడుదల చేయలేదన్నారు. కేంద్రం హామీల అమలు చేసిందీ లేనిదీ మార్చి 5 లోపు టిడిపి నిర్ణయం తీసుకుంటుందని హెచ్చరించారు.

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి.
అక్షరం, ప్రజాశక్తి సాహిత్య పేజీ, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ - 2.
prajasavvadi@gmail.com

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti


4 | విజయవాడ | సోమవారం 26 ఫిబ్రవరి 2018



సంగీతం నుంచి నృత్యాన్ని వేరు చేసి చూసే కళ్లకు నృత్యకారులు మతి లేనవారిగా అగుపిస్తారు

– ఫ్రెడరిక్ నీషే.
ప్రముఖ జర్మన్ తత్వవేత్త

నాకు విభజన రేఖలు లేవు.. నేను బ్రాడ్ లెఫ్ట్



ప్రఖ్యాత కవి కె.శివారెడ్డి దేశమంతా అభిమానుల్ని పోగేసుకున్న మన తెలుగు కవి అని చెప్పకోవడానికి అందరం గర్వపడతాం. ఇటీవలే ఆయన ఎంతో ప్రతిష్టాత్మకమైన కబీర్ సమ్మాన్ పురస్కారాన్ని అందుకున్నారు. తాజాగా కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు భాష సలహా సంఘానికి కన్వీనర్‌గా ఎంపికయ్యారు. 'నేను ఔట్ అండ్ ఔట్ మార్క్సిస్టుని.. నాది బ్రాడ్ లెఫ్ట్' అంటున్న ఈ కాలపు కలం వీరుడు శివారెడ్డితో ప్రముఖ కవి ప్రసాదమూర్తి జరిపిన సంభాషణ ఈ వారం ప్రత్యేకం.

మన కాలపు అక్షర యోధుడు కె.శివారెడ్డి ఇంటికి చాలాసార్లు వెళ్ళాను. ఈసారి ఇంటర్వ్యూ కోసం వెళ్ళినప్పుడు ఆయన్ని కొంచెం క్రిటికల్‌గా చూశాను. బక్కపలచని అయిదడుగుల దేహం చుట్టూ చిన్న తుండుగుడ్డ చుట్టుకుని ఉన్నారు. ఒక మహాసముద్రం 75 సంవత్సరాల వద్దుడిలా మారి తువ్వాలు కట్టుకుని ఇంట్లో పచార్లు చేస్తున్నట్టనిపించింది. 'వచ్చావా నాన్నా.. ఒక్క నిమిషంలో బట్టలేసుకుని వచ్చేస్తా.. బయటకు పోదాం.' అన్నాడు. ఆ కంఠం వింటే అతని రక్తంలో ఎక్కడా ముసలితనం జాడలు కనిపించలేదు. శరీరం వడలిందేమో కానీ.. యవ్వనోద్రేకం ఎక్కడా సడలలేదు. మాటల్లో తాత్వికత.. చూపుల్లో జ్ఞాన తేజస్సు.. ఆలోచనల్లో ఎప్పటిలా కణకణమండే అదే అగ్ని సరస్సు. చాలా మాట్లాడుకున్నాం గాని మీకోసం కొన్ని విలువైన విశేషాలిక్కడ.

– డా. ప్రసాదమూర్తి

ముందుగా కేంద్ర సాహిత్య అకాడెమీ తెలుగు భాష సలహా సంఘం కన్వీనర్‌గా మీరు ఎంపికైనందుకు అభినందనలు. ఎంతో సుదీర్ఘమైన కవన ప్రస్థానం తర్వాత ఇప్పుడేమనిపిస్తోంది?

శివా : అయిదు దశాబ్దాలకు పైగా సాగిన ఈ కవితా ప్రస్థానం తర్వాత ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే కవిత్వమనేది ఔట్ సైడ్ లేదు, ఇన్ సైడ్ ఉంది. లేదు, నేను దాని లోపలున్నాను, అది నాలోపలుంది. తొలిదశలో సొంత ఐడెంటిటీ అనేది ఉంటుంది. ఇప్పుడు రెండూ లేవు. అంటే భౌతిక ప్రపంచం ఆంతరిక ప్రపంచమైంది. ఆంతరిక ప్రపంచం భౌతిక ప్రపంచమైంది. కొత్తగా మొదలైన వాడికి ఇది అనుభవంలోకి రాదు. ఇంత విస్తారంగా చదువుకున్నాక, కవిత్వమే ప్రాణంగా బతికిన ఇన్ని దేశాల కవులను చదువుకున్నాక, ఇంత జీవనానుభవం తర్వాత అదంతా వృథా పోదు కదా. అంతా నా లోపలికి ప్రవహించింది. అది ఇతరుల్లోకి ప్రవహిస్తోంది. ఏ కవైనా వాడిమట్టుకు వాడే లిమిట్ కాడు. వాడు ఇతరుల్లోకి ప్రవహిస్తాడు.

ఇంత ప్రయాణం, ఇన్ని విజయాలు, ఇంత గుర్తింపు తర్వాత మీకు సంతృప్తిగా ఉందా? ఇంకా చేయాల్సింది, రాయాల్సింది, మిగిలి ఉందనే అనుకుంటున్నారా?

ఏ కవికీ అలా తృప్తి వుండదు. నాకు ఈ ఇంటి మీద (వనస్థలిపురం ఇల్లు) ఓ దీర్ఘ కవిత రాయాలని వుండేది. ఇల్లు నాన్ లివింగ్. నా దృష్టిలో ది హౌస్ ఈజ్ మోర్ లివింగ్ దేన్ ది లివింగ్ థింగ్స్, దేన్ ది యానిమల్స్. ఒక కాన్సెప్ట్ పెట్టుకుంటే కావ్యం రాయడం పెద్ద కష్టమేం కాదు. రెండోది ఈ 50 ఏళ్ళ తెలంగాణా జీవితానుభవాన్ని నేపథ్యంగా ఒక మహత్తర కావ్యం రాయాలనుంది.

భావప్రకటనా స్వేచ్ఛకు భంగం వాటిల్లింది దేశంలో. కల్బుర్గిలాంటి వారిని చంపేశారు. అప్పడందరూ అకాడెమీ అవార్డులను వెనక్కి ఇచ్చేశారు. మీరు మాత్రం ఇవ్వలేదని కొందరు అన్నారు.

1990లో నేను కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు తీసుకున్నప్పుడే చర్చ జరిగింది. అప్పుడే చెప్పాను. సాహిత్య అకాడెమీ అనేది ఒక ఇండిపెండెంట్ అటానమస్ బాడీ అని. తర్వాత కాలంలో 12 పుస్తకాలు వచ్చాయి. శివారెడ్డి విశ్వరూపం ఏంటో కనపడలేదా? శివారెడ్డి ఏం రాశాడో, ఏం చేశాడో, ఎవరి పక్షాన నిలబడ్డాడో వీళ్ళకి తెలీదా? అవార్డులు వెనక్కి తిరిగిచ్చేసే సందర్భంలో వరవరరావు మీటింగ్‌లో కూడా నేను మాట్లాడేను. అందరం కలిసి ఏం చేయడానికైనా నేను సిద్ధమే. నిరసన తెలపడానికి అనేక మార్గాలున్నాయి.

నిరసన గళాలను తెగనరుకుతున్న ఈ కాలంలో మీరెలాంటి నిరసన వ్యక్తం చేశారు?

ఉన్నాయి. కొంచెం స్వేచ్ఛ కావాలి లాంటి కవితలున్నాయి.. డైరెక్టుగా మోడీని ఎటాక్ చేస్తూ రాసినవే. అచ్చుకాని కవిత ఒకటి చాలా తీవ్రమైంది ఉంది. అదీ వస్తుంది. యాంటీ స్టేట్ అనేది తొలి దశలో పైపైన వుంటుంది. రానురాను కవి అయ్యేకొద్దీ అది ఆ కవిలో అంతర్భాగమవుతుంది. ఇప్పుడు సజషనే. కొంచెం స్వేచ్ఛ కావాలి, రెక్కలల్లార్చడానికి అనే కవితలు ఇక్కడే కాదు, ఇతర రాష్ట్రాల్లోనూ చదివాను, బ్రెజిల్‌లో చదివాను. ఎక్కడ చదివినా మంచి స్పందన వచ్చింది.

అభ్యుదయ, విప్లవ, దిగంబర, స్త్రీవాద, దళిత మైనారిటీ ఉద్యమాలు మీ ముందే నడుచుకుంటూ వెళ్ళాయి. శ్రీశ్రీలాంటి ఎందరో దిగ్గజ కవులు తాండవమాడిన కాలమది. మీరెలా మీ సొంత ఉనికిని కాపాడుకున్నారు?

అశ్రద్ధ చేయబడనంత స్థాయికి నువ్వు ఎదగాలి. విరసం మెంబరో, మరో మెంబరో అయితే వాళ్ళు నిన్ను ఓన్ చేసుకుంటారు. ఇప్పుడు తెలంగాణలో జరిగినట్టు... దట్ వోంట్ హెల్ప్ యూ ఇన్ ద లాంగ్ రన్. ఈ ఎరుక నాకెక్కడి నుంచి వచ్చింది? భారతదేశంలో మహాకవుల్ని చదివినాక, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన గొప్ప కవుల్ని చదివినాక ఈ విషయం నాకు బోధపడింది. కేదార్‌నాథ్ సింగ్ జీవితం చదువు. నెరుడాని చదువు. మరే ఇతర ప్రపంచ మహాకవుల్ని చదువు. ఏ సిద్ధాంతమైనా, ఏ తాత్వికత అయినా తొలినాళ్లలో పైపైనే ఉంటుంది. అది క్రమంగా ఎదిగేకొద్దీ నీలో భాగమైపోతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కవిత్వం చదవడం నాకు రక్షణ అయింది. ప్రపంచవ్యాప్తంగా వున్న లెఫ్ట్ మహాకవుల్ని, అన్ని రకాల కవుల్నీ చదివాను. ఒక సిద్ధాంతం, ఒక దార్శనికత, ఒక తత్త్వం ఉన్నటువంటి కవుల్ని ఎక్కువగా చదివాను. డిసెంట్ పోయిట్రీ ఎక్కువగా చదివాను. గ్రీక్ పోయెట్ రిట్ సాస్ ఉన్నాడు. 40 ఏళ్ళు నిర్బంధంలో ఉన్నాడు. జెక్ పోయెట్ హొలాలన్ 30 ఏళ్ళు గృహ నిర్బంధంలో ఉన్నాడు. వాళ్ళెలా సర్వైవ్ అయ్యారు? దానికి కారణం కవిత్వమే. ఇన్నేళ్లుగా శివారెడ్డి కూడా ఎన్నో సంక్షోభాలు ఎదుర్కొన్నాడు. కవిత్వమే కాపాడింది. అన్నింటి కంటే జీవితం వుంది కదా. నీచుట్టూ ఉన్న జీవితాన్ని కవిత్వీకరించాలి. కళీకరించాలి.

ప్రభుత్వం నుంచి ఏమైనా ఒత్తిళ్లు ఎదుర్కొన్నారా?

సంభాషణ



సంభాషణలో డాక్టర్ కె శివారెడ్డి, డాక్టర్ ప్రసాదమూర్తి

ఎమర్జెన్సీ కాలంలో పది రోజులు జైల్లో పెట్టారు. నా కాలేజికీ సీఐడీలు వచ్చేవారు. నా మీద ఎప్పుడూ ఒక నిఘా వుండేది.

హైదరాబాద్ కవిత్వం కోసమే వచ్చానని చాలాసార్లు చెప్తుంటారు? ఎవరైనా ప్రోత్సహించారా?

లేదు. 66లో ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ పూర్తయ్యాక మార్కుల లిస్టు పట్టుకుని హైదరాబాద్ వచ్చింది ఉద్యోగం కోసం కాదు, కవిత్వం కోసమే. అప్పటికి పద్యాలు మాత్రమే రాసేవాడిని. రాజధాని కదా. అనేక భావాలకు కూడలి. ఎందరో గొప్ప కవులకు నిలయం. హైదరాబాద్ రాకుంటే శివారెడ్డి ఇలా ఉండేవాడు కాదు. ఇప్పటి శివారెడ్డి తెలంగాణ ప్రొడక్ట్. ఇది నేను గర్వంగా చెప్పుకుంటాను.

మార్క్సిజంలోకి ఎలా అడుగు పెట్టారు?

పద్యాన్ని వదిలి వచన కవిత్వంలోకి అడుగు పెట్టాక అక్కడ నుంచి అన్వేషణ మొదలైంది. చైనా ఏంటి? రష్యా ఏంటి? మార్క్సిజం ఏంటి? చదవడం మొదలు పెట్టా. కమ్యూనిస్టు మేనిఫెస్టో చదవడమనేది నా రీడింగ్ లైఫ్‌లో ఒక టర్నింగ్ పాయింట్. అందుబాటులో ఉన్న సిద్ధాంత గ్రంథాలన్నీ చదివాను. అర్థమైనంత మేరకు అర్థమైంది. కవిత పదునెక్కింది. సిద్ధాంతం రక్తంలోకి ఇంకినాక మొత్తం మారింది. రక్తం సూర్యుడు, చర్య లాంటి పుస్తకాల్లో ఆ ప్రభావం స్పష్టంగా కనపడుద్ది.

కేవలం మావోయిస్టులే మీకిష్టులా ?

లేదు. మావోయిస్టులతో ఎంత దగ్గర సంబంధాలున్నాయో సీపీఐ, సీపీఎంలలతో కూడా అంతే మంచి సంబంధాలున్నాయి. ఎవరు పిలిచినా పోతాను. నాకు విభజన రేఖలేవీ లేవు. నేను బ్రాడ్ లెఫ్ట్. పదిమందిని కలిపేవారంటే నాకిష్టం. మౌలిక మానవీయ లక్షణాలుంటే చాలు, నేను కలవడానికైనా.. నన్ను కలవడానికైనా.

మీ మీద ఏ కవి ప్రభావమైనా ఉందా?

లేదు. చిన్నప్పుడే నన్ను నేను విముక్తం చేసుకోవడానికి పద్యాలు మొదలు పెట్టాను. నాకు ఏడేళ్ళ వయసులో అమ్మ చచ్చిపోయింది. ఆ దు:ఖం నుంచి నన్ను నేను బయట పడేసుకోడానికి కవిత్వాన్ని ఆశ్రయించాను. ఏడో తరగతి నుంచే పద్యాలు రాయడం మొదలు పెట్టాను. అచ్చయిన మొదటి పద్యాలు అమ్మను గురించి రాసినవే. బిఏ సెకండ్ ఇయర్ కాలేజీ మేగజైన్‌లో వచ్చాయి. అమ్మను గురించిన దు:ఖమే నన్ను కవిని చేసింది. బిఏ చదువుకున్నప్పుడే తెలుగు కావ్యాలన్నీ చదివేశాను. ఎంఏ తెలుగు చదవకపోయినా అలా చదివిన వారి కంటే నేనే ఎక్కువగా తెలుగు గ్రంథాలు చదువుకున్నాను. ఆధునిక తెలుగు కవిత్వం చదవడం మొదలు పెట్టింది హైదరాబాద్ వచ్చాకే. నా మీద నెరుడా ప్రభావం వుంది. రిట్సాస్ ప్రభావం వుంది. హొలాలన్ ప్రభావం వుంది. 30లలో వచ్చిన బ్రిటిష్ కవిత్వం ప్రభావం వుంది. అమెరికన్ పోయిట్రీ ప్రభావం వుంది. ఒక్కోడి నుంచి ఒక అంశ స్వీకరించాను. అందుకని ఫలానా కవి ప్రభావం వుందని చెప్పడం చాలా కష్టం.

మీరంటూ వుంటారు, నేను వర్క్ షాప్ కవిని అని. అంటే ఏంటి?

ఇలాగ రాయాలని నాకెవరూ చెప్పలేదు. రాయడం ద్వారా నిరంతర అధ్యయనం ద్వారా నేను తెలుసుకున్నాను. ఒక పిల్లాడిని సైకిల్ మెకానిక్ షాపులో పడేస్తే ముందు సైకిల్ తుడవడం, తర్వాత నట్లు బిగించడం, ఆ తర్వాత ఎప్పటికో పెద్ద మెకానిక్ అవుతాడు. నేను కూడా అలానే కవినయ్యాను.

గొప్పగా చదువుకున్నంత మాత్రాన గొప్ప కవిత్వం రాయగలమా?

రాయలేం. గొప్ప కవిత్వ నిర్మాణానికి అధ్యయనం దోహదం చేస్తుందేమో కాని దానంతటకి అదే నిన్ను గొప్ప కవిని చేయదు. ఆ జీవ లక్షణం మూల లక్షణం నీ తత్త్వంలో వుండాలి. అప్పుడే గొప్ప కవిత్వం వచ్చుద్ది. నీ స్వభావానికి భిన్నమైన కవిత్వం నువ్వు రాయలేవు. నీ సాధనా క్రమంలో నీ తాత్విక ప్రపంచం నీకు ఏర్పడుద్ది కదా. నువ్వంటే నీ తాత్విక ప్రపంచమే. దానికనుగుణంగా వస్తు రూపాలు మారుతూ వుంటాయి. అందుకు అనువుగా భాష కూడా మారుతుంది.

మీరు వస్తు రూపాలను మార్చుకుంటూ వచ్చారా?

ఆ. శివారెడ్డికి సంబంధించిన కీలకమైన అంశం ఇదే. పుస్తకానికి పుస్తకానికి వాడు మారతాడు. ఒక పుస్తకం మరో పుస్తకంలా వుండడానికి వీల్లేదు. రక్తం సూర్యుడు, *ఆసుపత్రి గీతం, భారమితి, మోహనా మోహనా* అన్నింటినీ పోల్చి చూడు. తేడా కనిపిస్తుంది. అంతా ప్రయత్న పూర్వకంగా వచ్చిందే. వస్తువుకి అనుగుణంగా నీ శైలి, నీ భాష మారకపోతే నీ ఎదుగుదల వుండదు.

మీకు 75 సంవత్సరాలు. ఒక చోట కూర్చుని హాయిగా కవిత్వం రాసుకోక ఇంకా తిరుగుతూనే ఉంటారు. పొగడ్తల కోసమా? సత్కారాల కోసమా?

కూచోని రాస్తే వచ్చేది కాదు కవిత్వం. పుస్తకం చదవడం ఎలాంటిదో తిరగడమూ అలాంటిదే. నన్ను నేను పునరుజ్జీవింపజేసుకోడానికి వెళుతున్నాను తప్ప సన్మానాల కోసం కాదు. ఒక్కో టూర్ ఒక ప్రాణప్రదమైంది. తిరగకపోతే స్తంభించిపోతావ్. నిలవ నీరులా అయిపోతావ్. తిరుగుడే నన్ను బతికిస్తుంది.

మీకు కాలిరిగి మంచం మీద పడ్డా కవిత్వమే. భార్యో కొడుకో ఆసుత్రిలో ఉన్నా వారి చెంతనుంటూనే, అన్ని బాధ్యతలూ నెరవేరుస్తూనే కవిత్వం రాస్తూనే వుండడం. ఇంత మానసిక దారుఢ్యం ఎలా మీకొచ్చింది?

నేననుభవించినంత సంక్షోభం, దు:ఖం చాలా తక్కువమంది అనుభవించి వుంటారు. అదే నన్ను మరింత రాటు దేల్చింది. నాన్న వారియర్ రా అని నా పిల్లలు అనుకుంటుంటారు. ఎదిగిన కొడుకు ఆసుపత్రిలో మంచం మీద పడి వుంటే పక్కనే కూర్చుని శోకంతో ఆ స్థితి మీదే పద్యాలు రాశాను. గొప్ప గొప్ప ముందు మాటలు ఆసుపత్రిలో ఉన్నప్పుడే రాశాను. అది డీ లింక్ చేసుకున్న స్థితి! ఆ స్థితి నుంచి పద్యమొచ్చినా బావుంటుంది. వచనమొచ్చినా బావుంటుంది.

అసలు కవిత్వం సమాజానికేమైనా మేలు చేస్తుందంటారా?

నిన్ను నువ్వు బాగు చేసుకుంటే సమాజాన్ని బాగు చేసినట్టే. కవిత్వం నిన్ను మనిషిని చేసిందంటే అది సమాజానికి జరిగే మేలే కదా. కవిత్వ ప్రయోజనం నీ నుంచే మొదలవ్వాలి కదా. అంతేనా? నువ్వొకలా వుండి నీ కవిత్వం మరొకలా ఉంటానికి ఆస్కారం లేదు. అది ఆత్మ ప్రతిఫలనం కదా.

భారతీయ భాషల్లో ఇప్పడెలాంటి కవిత్వం వస్తోంది?

హిందీలో కేదార్ నాథ్ సింగ్ ఎంతో గొప్ప కవి. గుల్జార్ కూడా చాలా మంచి కవి. ఒరియాలో మంచి కవులున్నారు. జయంత్ మహాపాత్ర, సీతాకాంత్ మహాపాత్ర, కేరళలో సచ్చిదానందన్, ఫణిక్కర్ లాంటి ఎంతోమంది వివిధ భాషల్లో వైవిధ్యభరితమైన కవిత్వం రాశారు, రాస్తున్నారు. ఆ లెక్కలో తీసుకుంటే మనం ఎవరికీ తీసిపోం.

ఈ మధ్య ఒకరు ఒక పత్రికలో రాస్తూ మన కవిత్వానికి అంతర్జాతీయ స్థాయి లేదన్నారు.

తనకేం తెలుసు? నన్నెక్కడికైనా పంపు.. తెలుగు కవిత్వం జెండా ఎగరేసొస్తా. బ్రెజిల్ వెళ్ళినప్పుడు ఓ కవిత చదివాను. అతను ఓ చెట్టు ముందు నుంచుంటాడు. గుర్తు పట్టలా గుర్తు పట్టలా. చెరువు ముందు నుంచుంటాడు. గుర్తు పట్టలా గుర్తు పట్టలా. ఇంటి ముందు నుంచుంటాడు. గుర్తు పట్టలా గుర్తు పట్టలా. ఇలా సాగాక చివరగా అన్నాను. అతను అద్దం ముందు నుంచుంటాడు. గుర్తు పట్టలా. గుర్తు పట్టలా. అంతే పేలింది పోయెం.

ఇప్పుడు తెలుగు కవిత్వం ఎలా ఉంది?

చాలా క్రిటికల్‌గా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వస్తు రాహిత్యం వచ్చింది. క్రమక్రమంగా కవుల్ని పొదువు కోవాలని, రెక్కల కింద పెట్టుకోవాలని పాలకుల ప్రయత్నం ఏదో జరుగుతోంది. ఉగాది సన్మానాలు కావొచ్చు మరొకటి కావొచ్చు. గొంతు నొక్కే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకే రెండు ప్రాంతాల్లో కొంచెం వస్తు దారిద్ర్యం కనపడుతోంది. ఈ పరిస్థితుల్లో కొందరు కవులు అయోమయంలో పడ్డారు. ఇది ఉద్యమాల ముందు, తర్వాత ఉండే పరిస్థితి! ఏ స్థితిలో నువ్వు స్ట్రగుల్ అవుతున్నావో.. దాన్ని కవిత్వం చేయి. నువ్వున్న స్థితిలో నీకిక్కడ నిర్దిష్టమైన వస్తువు దొరక్కపోవచ్చు. గ్లోబలైజేషన్‌లో ఎలా మనిషి మనిషి కాకుండా పోతున్నాడో అదే వస్తువిప్పుడు.

ప్రభుత్వానికి అనుకూలంగా ఉండడం వల్ల చాలా సందర్భాల్లో పాలకులు పాల్పడే దాష్టీకాల పట్ల కవులు మిుభావంగా వుండిపోవల్సి వస్తుంది. అదెలా దాటాలి?

ఓ ముఖ్యమంత్రి నీకు సన్మానం చేశాడు. అంటే నోరు మూసుకోమని అర్థం కాదు కదా. భయపడ్డం అంటే అది నీ చేతకానితనం. తెలుగు సభల్లో పాల్గొన్నాను. మర్నాడే మావోయిస్టుల ఎన్‌కౌంటర్ విషయంలో ప్రభుత్వాన్ని ఖండిస్తూ ప్రకటనిచ్చాం. నువ్వే స్థితిలో ఉన్నా అంతరాంతరాల్లో యాంటీ స్టేట్‌గా ఉంటే కవిత్వం వచ్చుద్ది.

ఈ తరం కవులు ఎలా రాస్తున్నారు?


అద్భుతంగా రాస్తున్నారు. నా దృష్టిలో అడ్వాన్స్‌డ్. ముఖ్యంగా 30ల వయసులో వున్న యువకవులు బ్రహ్మాండంగా రాస్తున్నారు. నాకు చాలా తృప్తిగా వుంది. 'విస్తృతంగా చదవండి. నిర్భయంగా రాయండి. మిమ్మల్ని మీరు టోటల్‌గా వ్యక్తీకరించుకోండి.' అనేది వారికి నా సూచన.

మొత్తం తెలుగు కవిత్వంలో మీ కంట్రిబ్యూషన్ ఏమని చెప్తారు?

విప్లవ కవిత్వాన్ని ఎక్స్‌టెండ్ చేశాను. వస్తు విస్తృతికి దోహదం చేయడమే నా కంట్రిబ్యూషన్ అనుకుంటాను. మడి కట్టుకోవడం పోయింది. కవి మల్టీ డైమన్షనల్ అని నా ఉద్దేశం. కవిత్వానికి అది నేనిచ్చిన అదనపు చేర్పు అనుకుంటున్నాను. అనంతమైన వస్తు వైవిధ్యం వుండాలి. ఏదీ నాకు అస్పృశ్యం కాదు. గొప్ప కవిత ఎప్పుడూ అంతర్గత ఫ్రిక్షన్ నుంచి వస్తుంది. మంచి కవిత వేరు. గొప్ప కవిత వేరు. గొప్ప కవిత అంతర్గత పెనుగులాట నుంచే వచ్చుద్ది. ఏ గొప్ప కవి లక్షణమైనా అదే.

తెలుగు కవిత్వం భవిష్యత్తు మీకు ఆశాజనకంగా వుందా?

చాలా. కవులు, కళాకారులు ప్రొడక్ట్స్ ఆఫ్ ది టైమ్. తనకు కావల్సిన కవుల్ని కాలమే సృష్టించుకుంటుంది. కాలం శ్రీశ్రీని సృష్టించింది. మమ్మల్ని సృష్టించింది. మిమ్మల్ని సృష్టించింది. యువ కవులున్నారు. తర్వాత ఇంకెందరో వస్తారు. అయిపోవడమంటూ ఏమీ ఉండదు. ఒకరి తర్వాత ఒకరు వస్తారు. ఎక్కడైతే స్ట్రగుల్ ఉంటుందో.. ఎక్కడైతే జీవితం చిన్నాభిన్నం అవుతుందో అక్కడి నుంచి గొప్ప కవిత్వం వచ్చుద్ది. నాకా నమ్మకం ఉంది.



నలిగిన నేత్రాలు

అతను తన జత కన్నులను
తన ఇంటిగోడ కొక్కికి తగిలించి
ఒక సమూహాన్ని అవతలి తీరం చేర్చేందుకు
గాలిని చీల్చుకుంటూ పరిగెడుతున్నాడు!

ఒక పాదం యంత్రపు గొంతును నొక్కుతుంటే
మరో పాదం చల్లటి గుడ్డతో ఆవిరి పడుతోంది
రెండు చేతులతో నరాలు లేని మెడను
బొంగరంలా తిప్పుతున్నాడు....

అతగాడి ప్రయత్నమంతా
భూమి మరో అంచుకు చేరి
తెగిన బంధాల పీకలను
కుట్లు వేసి అతికించడానికే...!

ఎన్నో ఆత్మీయతలను అతికించినందుకు
మనసు ముత్యమై మెరుస్తోంది కానీ
ఇంటిలోని గోడకున్న నేత్రాలు మాత్రం
రక్తపు సిరాను కారుస్తున్నాయి...
వాటిని తుడుచుకుంటున్న కొన్ని చూపుల్లో
సూది మొనలు మొలిచి
నిరీక్షణ పోగులు రాలుస్తూ
మరో రోజుని మింగేసాయి...!!

– అఖిలాశ
072595 11956

బాలలే కథకులు, కవులు

ప్రయోగం

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడమొక్కటే కాదు, సాహిత్య సృజన పాఠాలూ నేర్పుతున్నారు. నేర్చే వయసులో పిల్లలకు రచనాసక్తి రేకెత్తిస్తే ఎన్నో అద్భుతాలు జరుగుతాయి. అలాంటి అద్భుతాల కలబోతకు సంబంధించిన ప్రస్తావనే ఇది.

అనంతపురం జిల్లాలో వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షరమాలి కలం పేరుతో కవనసేద్యం చేస్తున్న యువకవి కొత్తపల్లి సురేష్ పాఠశాల తెలుగు సహాయకులుగా పనిచేస్తున్నారు. బాలలవనం పేరిట ఆసక్తి గల విద్యార్థులందరినీ ఒకచోట చేర్చి సాహిత్య పాఠాలు చెప్పడం ఆరంభించారు. ఖాళీ సమయాల్లో విద్యార్థులకు కవిత్వం, కథలు పరిచయం చేస్తున్నారు. నీతి ప్రబోధం, సామాజిక స్పృహ కలిగిన కవిత్వం, కథలు పరిచయం చేస్తూ, పిల్లల్లో ఆలోచన రేకెత్తించారు. ఇక పిల్లల్లో రచనాసక్తి, రాసే శక్తి పురి విప్పాయి. మొత్తం 139 కవితలు రాశారు. తమకు తెలిసిన వస్తువూ, తమదైన శైలీ ఆ కవిత్వానికి అద్దారు. వాటిని సురేష్ చూసి, ఒక క్రమంలో అమర్చారు. దాన్నొక సంకలనం తీసుకొచ్చారు. ప్రముఖ రచయిత బండి నారాయణస్వామి ముందుమాట రాశారు. దీనికి బాలలవనం అనే పేరు పెట్టారు. ఇది బాల సాహిత్యంలో ఒక మంచి ప్రయోగం. అదే పాఠశాలకు చెందిన కె.ఎం.రమేష్ ఆరో తరగతి నుంచి కవితలు రాస్తున్నాడు. గతేడాది ఆ విద్యార్థి రాసిన 78 కవితలతో పిచ్చుక పాడిన పాట పేరుతో సంకలనం తీసుకొచ్చారు.

కర్నూలు జిల్లాలో పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పుల్లా రామాంజనేయులు కవితలు, కథలు రాస్తున్న సృజనశీలి. పిల్లలకు పాఠాలతో పాటు సాహిత్య జ్ఞానం పెంపొందిస్తున్నారు. పిల్లల చేత కథలు రాయించి, అందులోంచి 28 కథలను ఎంపిక చేసి సృజన పేరుతో ఒక కథాసంకలనం తీసుకొచ్చారు. ఈ సంకలనానికి శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దాసరి వెంకటరమణ ముందుమాటలు రాశారు. ఈ కథల్లోని సామాజిక స్పృహ, వస్తువైవిధ్యం పాఠకులను చదివింప జేస్తాయి. ఈ ఉపాధ్యాయుడు తన పిల్లలను ఇదే పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలిచారు. తన కుమారుడు మురళీ ఆకాష్‌ను సాహిత్యంలో తీర్చిదిద్దాడు. ఆకాశ్ రాసిన 16 కథలతో 'ప్రేరణ' పేరిట ఒక పుస్తకం ప్రచురించారు. రాష్ట్ర సమాచార శాఖమంత్రి కాల్వ శ్రీనివాసులు ముందుమాట రాశారు. అదే పాంశాల బాలికలు రాసిన 16 కథలను జాగృతి పేరుతో సాహిత్య లోకానికి పరిచయం చేశారు. ఈ సంకలనానికి పల్లె రఘునాథరెడ్డి ముందుమాట రాశారు.

అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ.రాఘవేంద్ర తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయన స్వయంగా కవి. తెలుగు సాహిత్యంలో చిక్కనైన కవిత్వం రాస్తున్న యువకవుల్లో ఆయనొకరు. ఆయన నేతృత్వంలో విద్యార్థులు కవిత్వం రాయడం నేర్చుకున్నారు. 42 మంది విద్యార్థులు కవితలు రాయగా, చినుకులతోట పేరిట ఓ సంకలనం తీసుకొచ్చారు. ఈ సంకలనంలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల కవితలు ఉన్నాయి. కర్నూలు జిల్లా డోన్ పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డా.దేవేంద్రప్ప తెలుగు పండితులు. తెలుగు కవిత్వం, కథలు, పరిశోధనా వ్యాసాలు విరివిగా రాస్తున్నారు. తన విద్యార్థులను తెలుగు భాషా సాహిత్యాలపై ఆసక్తిని కలిగించారు. రచనలో శిక్షణ ఇవ్వగా 27 మంది విద్యార్థులు కథలు రాసి చూపించారు. 'సంకల్పం' పేరుతో ఆ కథలు వెలుగు చూశాయి. ఇందులో 27 మంది విద్యార్థినీ విద్యార్థులు రాసిన నీతికథలు, 14 మంది రాసిన కవితలు ఉన్నాయి. 'స్రవంతి' పేరిట మరికొంత మంది పిల్లల రచనలతో మరొక సంకలనం తీసుకొచ్చారు. ఇందులో 22 కథలు, 7 కవితలు, సూక్తులు, బొమ్మలు ఎంతో చక్కగా ఆకట్టుకుంటాయి. ఇలా ప్రభుత్వ ఉపాధ్యాయుల చొరవతో, కృషితో బడిపిల్లలు కవులుగా, రచయితలుగా మారటం ఎంతో సంతోషకరం. పాఠశాలల్లో జరుగుతున్న ఈ సృజనాత్మక ప్రయోగాలూ, ప్రయోజనాత్మక ప్రచురణలూ ముమ్ముందు మరిన్ని మంచి ఫలితాలకు దోహదపడాలని ఆశిద్దాం.

– కెంగార మోహన్
94933 75447



నిండుగా... మెండుగా



మనలాగానే కాలానికీ ఇష్టాలూ, అనుకూలతలూ ఉంటాయి. వెళ్లిపోతున్న చలికాలానికి ఉన్ని దుస్తులు ఇష్టమైతే.. వేంచేస్తున్న వేసవికి చేనేత వస్త్రాలంటే ప్రీతి! కాలమే కావాలని అంతగా కోరుకుంటున్నప్పుడు - చేనేత మాత్రం కాలానికి అనుగుణంగా సరికొత్తగా మారకుండా ఉంటుందా? ఇదిగో చూడండి.. చూడటానికి నిండుగా, వాతావరణానికి మెండుగా కొత్త కొత్త డిజైన్లతో, రంగులతో ఆకర్షణీయమైన చేనేత చీరల సోయగాలు... ఇవి వేసవిని జయించటానికి ప్రకృతి ప్రసాదితాలు.



హోండా షైన్.. సరికొత్తగా!

ప్రపంచపు బెస్ట్ సెల్లింగ్ 125సీసీ మెటార్ సైకిల్‌గా నిలిచిన 'సిబి షైన్' మోటార్‌సైకిల్‌కు కొనసాగింపుగా ప్రత్యేకమైన బాడీ స్టైల్‌తో సిబి షైన్ ఎస్‌పి బైకును మార్కెట్లోకి తీసుకొస్తోంది హోండా. 2018 ఎడిషన్‌లో సిబి షైన్ ఎస్‌పి మోటార్‌సైకిల్‌ను కొన్ని మార్పులు, చేర్పులతో లాంచ్ చేసింది. ఈ బైకులో 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో అనుసంధానం చేశారు. దీని ఫ్యూయల్ ట్యాంకు కెపాసిటి 10.5 లీటర్లు. సస్పెన్షన్ కోసం ముందు వైపున టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్, వెనుకవైపున ట్విన్ షాక్ అబ్జార్వర్లు అందించారు. సాంకేతికంగా చూస్తే హోండా సిబి షైన్ ఎస్‌పి బైకులో అదే మునుపటి 124.73సీసీ కెపాసిటీగల గాలితో చల్లబడే సింగిల్ సిలిండర్ పెట్రోల్ ఇంజన్ ఉంది. ఇది 7,500ఆర్‌పిఎమ్ వద్ద 10.16 బిహెచ్‌పి పవర్, 5,500 ఆర్‌పిఎమ్ వద్ద 10.30 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. బ్రేకింగ్ డ్యూటీ కోసం బేస్ వేరియంట్లో 130 ఎమ్ఎమ్ డ్రమ్ బ్రేకులు ఉన్నాయి. మిగతా రెండు వేరియంట్లలోని ఫ్రంట్ డ్రమ్ బ్రేకుల స్థానంలో 240 ఎమ్ఎమ్ డిస్క్ బ్రేకులు వచ్చాయి. ఇరువైపులా ఉన్న 18-అంగుళాల అల్లాయ్ వీల్స్‌కు అత్యుత్తమ మైలేజ్ ఇవ్వగలగేందుకు సహకరించే టైర్లను జోడించాలి. అలాగే, ఈ బైక్‌లో కాస్మొటిక్ మెరుగులు, అప్‌గ్రేడ్స్ జోడించారు. బైకులో రివైజ్ చేయబడిన ఫ్యూయల్‌ట్యాంక్, ఇరువైపులా సరికొత్త బాడీ డీకాల్స్, గ్రాఫిక్స్ ఉన్నాయి. సెమీ-డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌లో ఇప్పుడు కొత్తగా సర్వీస్ ఇండికేటర్, గడియారం ఫీచర్లను అందించింది. అథ్లెటిక్ బ్లూ మెటాలిక్, ఇంపీరియల్ రెడ్ మెటాలిక్, జెనీ గ్రే మెటాలిక్, పర్ల్ సిరెన్ బ్లూ, బ్లాక్ ఇలా ఐదు విభిన్న రంగుల్లో లభ్యమవుతోంది. పూర్తి స్థాయిలో విడుదలైన హోండా 125సీసీ కమ్యూటర్ మోటార్ సైకిల్. మార్కెట్లో ఉన్న బజాజ్ డిస్కవర్ 125, హీరో గ్లామర్ ఎఫ్ఐ బైకులకు గట్టి పోటీనివ్వనుంది. ★



ఇతడు.. హరిత స్వాప్నికుడు!

రకరకాల కారణాలవల్ల పచ్చదనం రానురానూ కనుమరుగవుతోంది. ఏటా ప్రభుత్వాలు మొక్కలు నాటే కార్యక్రమాలంటూ హడావిడి చేయడం, ఎన్ని చెట్లు కొట్టేస్తున్నా ఏమాత్రం పట్టించుకోకపోవడాన్ని చూస్తూనే ఉన్నాం. ప్రకృతితో మమేకమై బతకాలంటే వృక్ష సంపదకు నష్టం కలగకూడదని పర్యావరణవేత్తలు చెబుతూనే ఉన్నారు. అయితే ఈ పర్యావరణ ప్రేమికుడు మాత్రం అందరిలా మొక్కలు నాటడు. ఏకంగా చెట్లనే నాటుతుంటాడు. ఆ విశేషం ఏమిటో తెలుసుకోవాలంటే.. మనం హరిత స్వాప్నికుడైన అప్పారి రామచంద్రని కలవాల్సిందే.

హైదరాబాదుకి చెందిన అప్పారి రామచంద్ర చిన్నప్పటి నుంచీ ప్రకృతి ప్రేమికుడు. మొక్కలు నాటడంతోనే పాలకులు పరిమితమై మరోపక్క పచ్చనిచెట్లని నరికేస్తున్నా కిమ్మనకపోవడం అతనిని ఆలోచనల్లో పడేసింది. కళ్లు మూసినా తెరిచినా చెట్టే కనిపిస్తోంది. వటవృక్షాలు కూకటివేళ్లతో పెకిలించేస్తుంటే, అతని మనసు తట్టుకోలేకపోయింది. రోడ్డేయ్యాలంటే అడ్డంగా ఉన్న చెట్లను అడ్డగోలుగా నరకడమొక్కటే పరిష్కారమా? వందల ఏళ్ల నాటి వృక్షాన్ని మరోచోట నాటలేమా? ఈ ఆలోచనలు రామచంద్రను ఒకపట్టాన ఉండనీయలేదు. ప్రకృతి కోసం, పచ్చదనం కోసం ఉద్యోగాన్ని వదిలేశారు.

ఏ చెట్లయితే అభివృద్ధికి అడ్డుగా ఉన్నాయని భావిస్తున్నారో, అవే చెట్లకు ప్రాణప్రతిష్ట చేసే బృహత్ కార్యక్రమాన్ని తలకెత్తుకున్నాడు. గ్రీన్ మార్నింగ్ హార్టికల్చర్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్ పేరుతో వటవృక్షాలను ఒడుపుగా తీసి, మళ్లీ నేలతల్లి ఒడిలో నిలబెడుతున్నాడు.



ఈజిప్టులో ఈ తరహా ఉద్యమం ఏనాడో వచ్చింది. రామచంద్రలాంటి పర్యావరణ ప్రేమికుల పుణ్యమాని తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పుడిప్పుడే రీప్లాంటేషన్లో చైతన్యం వస్తోంది. ఇందుకోసం ప్రైవేట్ సెక్టార్ బ్యాంకు ఉద్యోగాన్నే వదిలేశాడంటే.. అతని సంకల్పం ఎంత గొప్పగా నాటుకుందో అర్థం చేసుకోవచ్చు.



ఆస్ట్రేలియాలో చెట్లను ఒకచోటి నుంచి మరోచోటికి తరలించి ఎలా పునఃప్రతిష్ఠిస్తారో ఒక స్నేహితుడి ద్వారా తెలుసుకున్నారు. 'గ్రీన్ మార్నింగ్' అనే ఈ సంస్థను నెలకొల్పాడు.

ఒక్క హైదరాబాద్ చుట్టుపక్కలే కాదు.. గుజరాత్, బెంగళూరులోని కొన్నిప్రాంతాల్లోనూ ట్రీ ట్రాన్స్ లొకేషన్ చేశారు. మెట్రోతో కలుపుకుని, ఇప్పటిదాకా సుమారు ఐదువేల చెట్లదాకా తిరిగి నాటారు. అందులో సక్సెస్ రేట్ 80 శాతం ఉంది. అనుకున్నంత వేగంగా జరిగే ప్రక్రియ కాదు కాబట్టి, చెట్టు తిరిగి కోలుకుని, ఎదగడానికి కొద్దిగా సమయం పడుతుందంటారు రామచంద్ర. ఏదేమైనా రామచంద్ర చేస్తున్న ప్రయత్నం ఎంతో అభినందనీయమని పర్యావరణ శాస్త్రవేత్తలంతా ప్రశంసల వర్షాన్ని కురిపిస్తున్నారు. ★



జామతో మేలెంతో!



జామకాయంటే అందరికీ చాలా ఇష్టం. తీపి, వగరు, పులుపు మూడు రుచుల మేలైన కలయిక జామకాయ. చిన్నారుల నుంచి పెద్దలవరకూ జామకాయంటే ఎంతో ఇష్టపడి తింటారు. జామకాయ, జామపండులోనూ పోషక విలువలు మెండుగా ఉంటాయి. పచ్చిదే తింటారు చాలామంది. మిగతా పండ్లకంటే విటమిన్-సి, ఇనుము దీనిలో అధికంగా ఉంటాయి. రోజుకొక జామకాయను తినడం వలన చాలా ప్రయోజనాలున్నాయి.

✧ దగ్గు, జలుబు, ఇన్‌ఫెక్షన్లు రావు. విటమిన్-సి వలన రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. పచ్చికాయలో విటమిన్ల శాతం అధికంగా ఉంటాయి. ఇంకా పచ్చిజామ జ్యూస్ తాగడం చాలా మంచిది.

✧ సాధారణంగా మనిషి రోజుకు ఒక జామకాయ తింటే ఆరోగ్యం, ఆయుష్షు మెరుగుపడుతుందంటారు నిపుణులు. జామకాయ తిన్నవారికి అధిక బరువు సమస్య ఉండదు.

✧ జామపండు తింటే త్వరగా జీర్ణమవుతుంది. అందువల్ల ఇది చిన్నపిల్లలకు, గర్భిణీలకు మంచిది.

✧ దీనిలో కండరాలకు, నరాలకు ఉపశమనం కలిగించే గుణాలు అధికంగా ఉంటాయి. కంటిచూపుకు దోహదపడే విటమిన్-ఎ జామలో ఉండడమూ విశేషం.

✧ పంటినొప్పికి జామ ఆకు దివ్య ఔషధంగా పనిచేస్తుంది. జామ ఆకుల్ని మెత్తగా నూరి, చిగుళ్ళకు పట్టించుకుంటే నోటిలోని చెడు బ్యాక్టీరియా పోతుంది. పంటినొప్పి ఉండదు.

✧ గుండె ఆరోగ్యానికి సోడియం, పొటాషియం ముఖ్యమైనవి. రక్తప్రసరణ సవ్యంగా జరగటానికి దోహదపడే పొటాషియం జామలో ఉంటుంది.

✧ దీనిలో పీచు పదార్థాలు 12 శాతం లభిస్తాయి. ప్రతి మనిషీ రోజుకొక జామపండు తింటే ఆరోగ్యకరం, ఆనంద దాయకమంటారు నిపుణులు.

✧ జామ తినేవారిలో మధుమేహం దరిజేరదు. ★

జీవన సౌరభం

జీవితం ఎప్పుడూ సవాళ్ళను విసురుతూనే ఉంటుంది. దానిని ఎదుర్కొని నిలిచినవారే విజేతలు.

మీ కోసం

స్నానాల గదిలో షవర్ రంధ్రాలు మూసుకుపోతే వైట్ వెనిగర్‌తో శుభ్రం చేయొచ్చు.





Sk. Khaja Hussain
SABS, ZPHS Dirisavancha , Kanigiri Mandal, Prakasam District

GENERAL SCIENCE PAPER-2

S.S.C.MODEL PAPER

(BIOLOGICAL SCIENCE)

2.15 M Part-A Marks : 30

Instructions :

1. This Question paper consist of part-A&part B.

2. Part-A must be answered in a separate answer sheet and part -B answers in the Question paper it self.

3. 15 Minutes are alloted to read the question paper and 2.30 hours are alloted to write answers.

Section -1

4x1=4 M

Note : 1. Answer the following questions.
2. Each question carries ONE mark.

1. Name the three end products of photosynthesis ?

2. Identify the given nerve and write its functions ?



3. What is the use of platelets ?

4. How is reproduction useful for survival of organisms ?

Section -2


5x2=10 M

Note : 1. Answer the following questions.
2. Each question carries TWO marks.

5. What Questions will you ask a paleantologist about fossils ?

6. Explain the role of green house gases in global warming ?

7. Observe the given diagram and answer the following question.



1. What is the aim of the experiment ?

2. What change you have observed in the reading of thermometer ?

8. We people have very less awareness about organ donation to motivate people write slogans about organ donation .

9. Write differences between mastication and Ruminatin ?

Section -3

4x4= 16 M

Note : 1. Answer the following questions.
2. Each question carries FOUR marks.

10. Rahim said that "Nephrons are functioinal and structural units of kidneys" how will you support him?

Or

One student wants to cross pure tall plant (TT) with pure dwarf plant (tt). What would be the F1 and F2 generations ? Explain ?


11. Answer the following Questions by observing the diagram showing the experiment.

a) what will you prove by this experiment ?

b) what apparatus do you use in this experiment ?

c) Why do we use KOH in this experiment ?





d) Why did we study two leaves in this experiment ?

Or


Explain the experiment which you have conducted in your school laboratory to know the effect of saliva on the starch by drawing a diagram.

12. Collect the information about cranial nerves and spinal nerves from internet or from your school library ?

Or

Collect information about respiratory diseases (due to pollution, tobacco) and discuss with your classmates.

13. Observe the given diagram heart.



a) what are the parts. a, b, c, d

b) From which blood vessels heart receives blood ?

c) How is lub dub sound produced by heart ?

d) How many valves are present in heart ?

Or

a) Draw a neat labelled diagram of L.S.of Flower .

b) what are the sexual parts in the flower.

PART-B

Time : 30 Min Marks : 10

Note : 1. Answer all the questions.
2. Each question carries 1/2 mark.
3. Answer should be written on question paper it self .

Put correct answer in the brackets given below.

14. in our country which state stands first in the utilization of solar energy ( )
a) Andhra Pradesh b) Tamilnadu
c) Gujarat d) Kashmir

15. Which part of the plant takes in Co2 from the air for photosynthesis. ( )
a) Root hair b) stomata
c) leaf veins d) sepals


16. Energy is stored in ( )
a) Nucles b) Mitochondria
c) ribosomes d) cell wall

17. An aphid pierces its proboscis in to the ...to get plant juices ( )
a) phloem b) xylem
c) cambium d) vascular bundle

18. which of the following is the correct path taken by urine in our body ( )
a) kidney, urethra, ureters, bladder
b) kidney, ureters, bladder, urethra
c) kidney, bladder, ureters, urethra
d) kidney, urethra, bladder, ureters

19.Deficiency of folic acid causes ( )
a) Anj aemia
b) Pellagra
c) Glossitis
d) Rickets

20. Name of the part 'x' in the given diagram ( )



a) Acrosome b) Head
c) Nucles d) Tail

21. The ratio of out dentition is 2:1:2:3 hear 3 represents ( )
a) Incisors b) canines
c) molars d) premolars

22. Observe the a, b statements ( )
A) Yellow colour YY is pure breed
B) Green colour yy is also pure breed.
a) both are true
b) A is true, B is false
c) A is false B is true
d) both are false

23. Sustainable development means ( )
a) preventation of wastage
b) Stable growth
c) high yieldings in less time
d) develpment without damaging.

24. $H_2O \xrightarrow[\text{Chlorophyll}]{\text{Light}} H^+ + H^-$ **this equation denotes ( )**
a) Mohi's reaction
b) Hill's reaction
c) priestley's reaction
d) Harvely reaction

gas	% in inhaled air	% in exhaled air
Oxygen	21	16
Co2	0.03	04
Nitrogen	79	79

25. observe the above table and identify the gas which does not have any roll in respiration ( )
a) o2 b)Co2
c) N2 d) All the above

26. Expanded form the ESRD is ( )
a) End stage renal disease
b) Emergency service and rural development
c) Endocrine supplement renal disease
d) Erythrocyte sedimantation rate of Deficiency

27. The number of pairs of cramial Nerves in man ( )
a) 10 b) 11
c) 12 d) 13

28.

List-A	List-B
1.Fragmentation	a) fungi
2. Budding	b) Paramoecium
3. Binaray Fission	c) Flat worm


Indentify the mis-matched pairs
a) 1, 2 b) 2,3
c) 1,3 d) 1,2,3

29. Sphincter that helps in opening of stomach at to duodenum. ( )
a) Cardiac b) pyloric
c) Anal d) Gastric

30. According to mendal, alleles have the following character ( )
a) responsible for character
b) Recessive factors
c) producation of gamtes
d) pair of genes

31. Ban all pesticides, this means that ( )
a) Control on usage of pesticides
b) prevention of pesticides
c) promote eco friendly agricultural practices
d) stop Bio chemical factories.

32. Match the following ( )
1. somato trophin a. fight and flight
2. Adrenalin b. Growth of bones
3. Testosterone c. males
a) 1-a, 2-b, 3-c b) 1-c, 2-b, 3-c
c) 1-b, 2-c, 3-a d) 1-b, 2-a, 3-c



33. The given blood vessel carries blood from bodyparts to heart. Name the blood vessel ( )
a) Artery b) vein
c) Capillary d) Muscular fibre

★

గ్రూప్స్‌, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

పారిశ్రామిక విత్తం - సహాయ సంస్థలు



ఎస్‌.ఎం.సువర్ణకుమార్‌
డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌, ఏలూరు.
సెల్‌ : 9441169869

ఇండియన్‌ ఎకానమి

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పరిశ్రమల మనుగడకు, అభివృద్ధికి పారిశ్రామిక విత్తం ఆవశ్యకమైంది. పరిశ్రమలు, వస్తువులు ఉత్పత్తికి సంబంధించి వివిధ రకాలైన కార్యకలాపాల కోసం కోరే ఆర్థిక సహాయాన్ని పారిశ్రామిక విత్తం అంటారు.

స్వాతంత్ర్యానంతరం మన దేశంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి.. పారిశ్రామిక సంస్థల విత్త అవసరాలను తీర్చుకోవడానికి.. ప్రభుత్వం కాలానుగుణంగా విత్త అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ సంస్థలను ఏర్పాటు చేసింది.

1. ఇండస్ట్రియల్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా

జాతీయ స్థాయిలో ఏర్పాటైన మొదటి అభివృద్ధి బ్యాంకు. దీనిని 1948 జులై 1న పరిశ్రమలకు మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలిచ్చేందుకు ఏర్పరిచారు. ఇది అప్పటికే ఉన్న ఆర్థిక సంస్థలకు పోటీగాగాక అవి చొచ్చుకు వెళ్లలేని రంగాల కోసం నిర్దేశించింది. బ్యాంకింగ్‌ సంస్థల నుంచి గానీ, ప్రజల నుంచి గానీ, రుణాలని సేకరించలేని పారిశ్రామిక సంస్థలకు దీర్ఘకాలిక, మధ్యకాలిక రుణ సహాయం అందించడమే ఈ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం. ఇది ప్రయివేటు, ప్రభుత్వరంగ లిమిటెడ్‌ కంపెనీలకు, కో-ఆపరేటివ్‌ సొసైటీలకు మధ్య దీర్ఘకాలిక రుణాలిస్తుంది.

2. ఇండస్ట్రియల్‌ క్రెడిట్‌ అండ్‌ ఇన్వెస్ట్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియా (ఐసిఐసిఐ)

ఐఎఫ్‌సిఐ తర్వాత అఖిలభారత స్థాయిలో పరిశ్రమల ప్రత్యేక అవసరాలను తీర్చడానికి ఐసిఐసిఐను 1955 జనవరి 5న స్థాపించారు. ప్రారంభదశలో ఈ సంస్థ ప్రయివేటు రంగానికి మాత్రమే రుణాలను మంజూరు చేసేది. తదనంతర కాలంలో ఉమ్మడి, ప్రభుత్వ, సహకార రంగాలలో ఏర్పాటయ్యే పరిశ్రమలకూ రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సంస్థ భారత ప్రభుత్వం, విదేశీ ప్రయివేటు పెట్టుబడుల సంస్థలు నడిపే ఒక పబ్లిక్‌ లిమిటెడ్‌ కంపెనీ. దీనిని ప్రయివేటురంగ యాజమాన్యంలో ప్రయివేటు నిర్వహణలో ప్రారంభించారు. మూలధన మార్కెట్‌ అభివృద్ధికి దోహదం చేయడం, పరిశ్రమలకు అవసరమైన మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేయడం, పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందజేయడం దీని ప్రధాన లక్ష్యాలు. 2002లో ఐసిఐసిఐ, ఐసిఐసిఐ బ్యాంకులను విలీనం చేశారు. అభివృద్ధి బ్యాంకింగ్‌ కార్యకలాపాలతో పాటు షెడ్యూలు బ్యాంకు విధులను నిర్వహించడం ద్వారా ఇది దేశంలోనే తొలి యూనివర్సల్‌ బ్యాంకుగా అవతరించింది.

3. ఇండస్ట్రియల్‌ డెవలప్‌మెంట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఐడిబిఐ)

పారిశ్రామిక సంస్థల నిధుల అవసరాలు పెరుగుతున్నందున 1964 జులై 1న రిజర్వుబ్యాంకు ఆఫ్‌ ఇండియా ఇండస్ట్రియల్‌ డెవలప్‌మెంట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియాను ఏర్పాటు చేసింది. అభివృద్ధి బ్యాంకింగ్‌లో శిఖరాగ్ర సంస్థగా ఇది పనిచేయాలని నిర్దేశించారు. ఇది ఇతర అభివృద్ధి బ్యాంకులకు రీ ఫైనాన్స్‌ సౌకర్యాన్ని కలుగజేస్తుంది. రాష్ట్ర ఆర్థిక సంస్థలకూ ఈ సదుపాయాన్ని కలుగజేస్తుంది. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, లఘు పరిశ్రమలకు సహాయం, ప్రాజెక్టుల మదింపు, పారిశ్రామిక నైపుణ్యం, అభివృద్ధి వంటి కార్యకలాపాలకు శిక్షణ సదుపాయాలు కల్పిస్తుంది. ఎటువంటి పరిశ్రమలూ లేని జిల్లాలను ఎంపికచేసి వాటి పారిశ్రామీకరణ, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటుంది. ప్రయివేటు రంగంలోని ఐడిబిఐ బ్యాంకును ఐడిబిఐలో విలీనం చేసి.. 2004 అక్టోబర్‌ 1న ఇండస్ట్రియల్‌ డెవలప్‌మెంట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా లిమిటెడ్‌ను యూనివర్సల్‌ బ్యాంకుగా ఏర్పరిచారు.

4. చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (ఎస్‌ఐడిబిఐ)

దేశంలో కీలకపాత్ర వహిస్తున్న చిన్నతరహా పరిశ్రమలకు ఆర్థిక సహాయం అందించడానికి చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి)ను 1990లో ఐడిబిఐకి అనుబంధ సంస్థగా ఏర్పాటు చేశారు. ఈ సంస్థను 1989 భారత చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధి చట్ట ప్రకారం ఏర్పాటు చేశారు.

దేశంలో ఉన్న చిన్న పరిశ్రమలకు ద్రవ్య సహాయం అందించడానికి, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సహకార పరపతి సంఘాలు, రాష్ట్ర ద్రవ్య సంస్థలను ఉపయోగిస్తుంది. జాతీయ స్థాయిలో పెట్టుబడి సంస్థలైన యుటిఐ, ఎల్‌ఐసి, జిఐసి వంటి సంస్థలూ వివిధ రాష్ట్రాలలోను పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

5. జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసి)

భారత ప్రభుత్వం పెట్టుబడితో జీవితబీమా సంస్థ ఎల్‌ఐసి చట్టం 1956 ప్రకారం ఏర్పాటు చేశారు. దేశ ఆర్థికవ్యవస్థను ప్రభావితం చేసే అతికొద్ది ఆర్థిక సంస్థలలో ఎల్‌ఐసి ఒకటి. సమాజంలోని వివిధ స్థాయిలలోని ప్రజలకు సాంఘిక భద్రత కల్పించడం కోసం వైవిధ్యంగల బీమా పాలసీలను ఆఫర్‌ చేస్తుంది. దీనిని ప్రీమియం రూపంలో నగదును వసూలు చేస్తుంది. జాతీయ ప్రణాళికా ప్రాధాన్యతలను ఆధారంగా చేసుకొని, తన పెట్టుబడులను పెడుతుంది. ఈ సంస్థ సేకరించిన మొత్తం నిధులు 75 శాతానికి పైగా కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో పెట్టుబడి పెడుతుంది.


6. జనరల్‌ బీమా కంపెనీ (జిఐసి)

1972లో కేంద్ర ప్రభుత్వం జనరల్‌ ఇన్సూరెన్స్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఇండియాను స్థాపించింది. ఈ సంస్థ ప్రధానంగా బీమా వ్యాపారాన్ని చేస్తుంది. మిగిలిన నిధులతో పెద్ద సంస్థల వాటాలను కొనుగోలు చేయడం ద్వారా రుణపత్రాలు కొనడం ద్వారా ద్రవ్య సహాయం చేస్తుంది.

7. యూనిట్‌ ట్రస్ట్‌ ఆఫ్‌ ఇండియా (యుటిఐ)

మధ్యతరగతి, అంతకంటే కిందిస్థాయి ప్రజల పొదుపు సొమ్మును సమీకరించి.. పరిశ్రమలలో పెట్టుబడిపెట్టి దేశ పారిశ్రామికాభివృద్ధి ఫలితాలు వారికందేలా చేయడం కోసం యూనిట్‌ ట్రస్ట్‌ ఆఫ్‌ ఇండియాను 1964 జులైలో ఏర్పాటు చేశారు. ఇది ప్రజలలో వారి చిన్న పొదుపు మొత్తాలకు భద్రత కలిగించి, లాభదాయకమైన పెట్టుబడులలో పెట్టే అవకాశం ఈ సంస్థ కల్పించింది. ఇటీవల కాలంలో భారతదేశంలో గ్రామీణ ప్రాంతాలలో యూనిట్‌ ట్రస్ట్‌ ప్రత్యేకకృషి వల్ల పొదుపు పెట్టుబడులు బాగా పెరిగాయి.

★



సెంట్రల్‌ గవర్నమెంట్‌ హెల్త్‌ స్కీమ్‌లో 128 ఉద్యోగాలు

కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్‌ గవర్నమెంట్‌ హెల్త్‌ స్కీమ్‌ (సీజీహెచ్‌ఎస్‌).. అహ్మదాబాద్‌, ముంబై, నాగ్‌పూర్‌, పూణె విభాగాల్లోని 128 గ్రూప్‌ 'సి' పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు: ఎంటీఎస్‌ (మెడికల్‌ అటెండెంట్‌)-77, ఎంటీఎస్‌ (లేడీ మెడికల్‌ అటెండెంట్‌)-51.

వేతనశ్రేణి: రూ.18,000 - రూ.56,900.

అర్హతలు: పదోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఫస్ట్‌ ఎయిడ్‌లో సర్టిఫికెట్‌ ఉండాలి.

వయసు: 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: రాతపరీక్ష.

దరఖాస్తు ఫీజు: రూ.200, ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగ/ వికలాంగులు/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌.

దరఖాస్తు చివరి తేదీ: మార్చి 3, 2018.

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

ఉద్యోగాలు

వెబ్‌సైట్‌: cghsrecruitment.mahaonline.gov.in

మినిస్ట్రీ ఆఫ్‌ ఎర్త్‌ సెన్సైస్‌లో 62 పోస్టులు

చెన్నైయిలోని ఇంటెగ్రేటెడ్‌ కోస్టల్‌ అండ్‌ మెరైన్‌ ఏరియా మేనేజ్‌మెంట్‌ ప్రాజెక్ట్‌ డైరెక్టరేట్‌(ఐసీఎంఏఎం-పీడీ).. 62 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది మినిస్ట్రీ ఆఫ్‌ ఎర్త్‌ సైన్సెస్‌కు చెందింది.

పోస్టులు-ఖాళీలు: ప్రాజెక్ట్‌ సైంటిస్ట్‌ 'డి'-1, ప్రాజెక్ట్‌ సైంటిస్ట్‌ 'సి'-17, ప్రాజెక్ట్‌ సైంటిస్ట్‌ 'బి'-33, టెక్నికల్‌ అసిస్టెంట్‌-3, ఫీల్డ్‌ అసిస్టెంట్‌-8 ఉన్నాయి.

అర్హతలు: సంబంధిత విభాగాల్లో మాస్టర్స్‌ డిగ్రీ/ బ్యాచిలర్స్‌ డిగ్రీ/ ఇంజనీరింగ్‌ డిప్లొమా/ పదోతరగతి ఉత్తీర్ణులు అర్హులు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌ దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ పంపాలి.

ఆన్‌లైన్‌ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 14, 2018

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్‌: www.icmam.gov.in

క్రికెట్ బెట్టింగుకు పాల్పడిన 12 మంది అరెస్ట్

ప్రజాశక్తి-వాల్మీకిపురం (చిత్తూరు)

క్రికెట్ బెట్టింగ్ కాస్తున్న 12 మంది బెట్టింగ్ రాయుళ్లను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి 13 సెల్ ఫోన్లు, ఒక టివిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన చిత్తూరు జిల్లాలోని వాల్మీకిపురం మండలంలో చోటు చేసుకుంది. మదనపల్లి డిఎస్‌పి చిదానంద రెడ్డి కథనం మేరకు.. వాల్మీకిపురం పట్టణం తోటవీధిలోని సబ్ బుకీలు హరిప్రసాద్, ప్రశాంత్ అలియాస్ ఫణిల వద్ద ఇరు జట్లపై గెలుపు ఓటమిలపై నగదును పందెం కాస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు హరిప్రసాద్ ఇంటిపై దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకొన్నారు.



సదస్సు గుంటూరు జిల్లా మంగళగిరిలో అఖిల పక్ష సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రైతు సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వేదికపై వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తదితరులు

రింగురోడ్డు పేరుతో మరో భూదోపిడీ

సదస్సులో సిపిఎం నేత బాబూరావు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

రింగురోడ్డు పేరుతో వేలాది ఎకరాలను లాక్కొని రియలెస్టేట్ వ్యాపారులకు అప్పగించేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు విమర్శించారు. రాజధాని ఇన్నర్ రింగురోడ్డు కోసం భూ సమీకరణ, భూ సేకరణకు వ్యతిరేకంగా అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం 0జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మంగళగిరి డివిజన్ కార్యదర్శి ఏటుకూరి గంగాధరరావు అధ్యక్షత వహించారు. బాబూరావు మాట్లాడుతూ రింగురోడ్డుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. 2010లో కాజ నుండి గుండుగొలను రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఇంకా పనులెందుకు చేయలేదని ప్రశ్నించారు. దాన్ని నిర్మిస్తే రింగురోడ్డ అవసరం కొంతమేరకు ఉండదని చెప్పారు. ఇన్నర్ రోడ్డు నిర్మాణానికి ప్రజలు సహకరిస్తారని, అయితే ప్రభుత్వ విధానమే సరిగా లేదని విమర్శించారు. వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం ఇంకా ఎన్నాళ్ల పోరాటాలు చేయాలన్నారు. వామపక్షాలు అనేక ఏళ్లుగా పోరాడుతున్నాయని, ప్రస్తుతం వైసిపి కూడా పోరాటం చేస్తోందని చెప్పారు. చంద్రబాబు పాలన అంతమయ్యే వరకూ పోరాడాల్సి వస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నరసింహారావు, సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.శివశంకరరావు, వై.రాధాకృష్ణ, ఇతర పార్టీలు, సంఘాల నాయకులు మాట్లాడారు.

విద్యుత్ కార్మికుల్లో సడలని పట్టుదల



విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద కార్మికులకు సంఘీభావం తెలిపిన అనంతరం మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు
ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్


అనంతపురంలో బైక్ ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

- పశ్చిమగోదావరిలో భిక్షాటన చేసిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు
- శ్రీకాకుళంలో మానవహారం
- 'అనంత'లో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. పలు జిల్లాల్లో కార్మికులు తమ నిరసనలను వ్యక్తం చేశారు. విజయవాడలోని ధర్నా చౌక్, ఇబ్రహీంపట్నంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరింది. ధర్నా చౌక్ వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు పాల్గొని సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఇబ్రహీంపట్నంలో కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు సబ్‌స్టేషన్ వద్ద సమ్మె శిబిరాన్ని నిర్వహిస్తున్న కార్మికులు ఆదివారం కలెక్టరేట్ వద్దకు మార్చారు. దీక్షలను పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే ఐదో తేదీ నుంచి నిర్వహించే అసెంబ్లీ సమావేశాల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీల తరుపున నిలదీస్తామన్నారు. శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలి వద్ద విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు మానవహారం నిర్వహించారు. విజయనగరంలో విద్యుత్ భవనం వద్ద కార్మికులు కళ్లకు గంతలు కొట్టుకొని నిరసన తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఎం.బాలకాశీ ఆందోళనకారులకు మద్దతు తెలిపారు. విద్యుత్ కార్మికులు సమ్మె పట్ల సిఎం చంద్రబాబు నిర్లక్ష్యం వీడాలని కోరారు.పశ్చిమ గోదావరి జిల్లాలో కలెక్టరేట్ నుంచి జెడ్‌పి మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకుని రోడ్డుపై వెళ్తున్న పాదచారులు, వాహనదారులు, బస్సుల్లో వెళ్తున్న ప్రయాణికుల వద్ద భిక్షాటన చేస్తూ తమ ఆవేదన తెలియజేశారు.అనంతపురంలో దీక్షలకు మద్దతుగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి దీక్షలకు మద్దతు తెలిపారు. టిడిపి ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన మేరకు విద్యుత్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒంగోలులో దీక్షలకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు సంఘీభావం తెలిపి..మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.

సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకున్నారు

త్వరలో మరోసారి చర్చలు - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మెను విచ్ఛిన్నం చేసే విషయంలో యాజమాన్యం కోరిక నెరవేరలేదని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ అన్నారు. ఇందుకు కారణం సమస్యల పరిష్కారం కోసం కార్మికులు గట్టి పట్టుదలతో ఉండటమేనని చెప్పారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె శిబిరాన్ని ఆదివారం ఉదయం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ సానుకూలంగా స్పందించారన్నారు. సిఎం చంద్రబాబు మాత్రం కార్మికుల్ని మనుషులుగా చూడటం లేదన్నారు. ఇటీవల కార్మిక సంఘాలు కలిసినప్పుడు విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతో మాకు సంబంధం లేదని చెప్పడమే ఇందుకు నిరద్శనమన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఇతర కార్మిక సంఘాలతో కలిసి సిఐటియు అన్ని ప్రయత్నాలూ చేస్తోందన్నారు. ఈ క్రమంలో కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణను భీమవరంలో కలిసిన కార్మిక సంఘాల నాయకులు సమ్మె విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారన్నారు. విశాఖపట్నం వెళ్లి ముఖ్యమంత్రితో కూడా చర్చిస్తానని మంత్రి చెప్పారన్నారు. మరోవైపు మంత్రి కళా వెంకట్రావును శ్రీకాకుళం కార్మిక సంఘాల నాయకులు కలిశారని, మరోమారు చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారన్నారు. 26న కలెక్టరేట్ల వద్ద పికెటింగ్, 28న డిస్కంల ముట్టడిలో విద్యుత్ కార్మికులతోపాటు ఇతర కార్మిక సంఘాలు కూడా పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు ముజఫర్, ఐక్య వేదిక జిల్లా నాయకులు అనిల్, మణిపాల్ తదితరులు పాల్గొన్నారు.

హోదా వచ్చేదాకా పోరాటం

విజయనగరం జిల్లాలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాజ్యసభ ఎన్నికలను బహిష్కరించాలి : రఘువీరా

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించారు. ప్రత్యేక హోదా సాధనకు ఆందోళనలను తీవ్రతరం చేయాలని తీర్మానించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం టౌన్ హాల్లో ప్రత్యేక హోదా సాధన కమిటీ, విజయకృష్ణ జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. శాసనమండలి సభ్యులు బచ్చుల అర్జునుడు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రత్యేక హోదా సాధనకు పార్టీలకతీతంగా కలసి రావాలని తీర్మానించారు. మున్సిపల్ చైర్మన్ ఎం.బాబాప్రసాద్, వైసిపి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఐసిఐయు, పలు ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. చిత్తూరు జిల్లా తిరుపతిలోని ఎంబి భవన్‌లో సిపిఎం ఆధ్వర్యాన జిల్లా వర్క్‌షాపు జరిగింది. ఇందులో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేంతవరకూ పోరాడతామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో తలపెట్టిన రిలేనిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కోరుతూ విజయనగరం జిల్లా రామభద్రపురం బస్టాండ్‌లో సిపిఎం ఆధ్వర్యాన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రత్యేక హోదాకు మద్దతుగా పురిటిపెంట పంచాయతీ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, జనసేన, సిఐటియు, ఎపి రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి భవిరి కృష్ణమూర్తి పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో రాజకీయ పార్టీలు, వివిధ ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రత్యేక హోదా సంజీవిని లాంటిదని తెలిపారు. మార్చి ఆరున ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరగనున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తీర్మానించారు. సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, వైసిపి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, జిల్లా అభివృద్ధి వేదిక నాయకులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా హిందూపురంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే పోరాటంలో భాగంగా రాజ్యసభ ఎన్నికలను టిడిపి, వైసిపి బహిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మార్చి 6, 7, 8 తేదీల్లో చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలోని నంద్యాల, ఆదోని, కర్నూలు డివిజన్లలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు జరిగాయి. ప్రత్యేక హోదా సాధనకు ఢిల్లీ వరకూ జరిగే ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని వక్తలు కోరారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఎన్‌జిఒ హోమ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రత్యేక హోదా సాధనే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించారు. మాజీ మంత్రి ముత్తా గోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, లోక్‌సత్తా, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - కడప

రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని కడప, కర్నూలు జిల్లాలో న్యాయవాదులు చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. కడపలో కోర్టు ఎదుట న్యాయవాదులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 34వ రోజుకు చేరుకున్నాయి. 34వ రోజు దీక్షల్లో ఐదు జిల్లా అధ్యక్షులు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, కడప న్యాయవాదుల సంఘం మహిళా కార్యదర్శి ఎ.ఉమాదేవి, న్యాయవాదులు కె.శ్రీనివాసులు, ఎం.ఎల్. నాయారణరాజు కూర్చున్నారు. ఈ సందర్భంగా రాయలసీమ న్యాయవాదుల జెఎసి కన్వీనర్ ఎస్.మస్తాన్‌వలి మాట్లాడుతూ.. సోమవారం కడపలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీక్షా శిబిరాన్ని జయఫౌండేషన్ ప్రతినిధి జయప్రద, బిజెపి నేతలు విజయ నరసింహులు, మల్లేశ్వర్‌రెడ్డి, అంతర్జాతీయ మానవహక్కుల సంఘం కన్వీనర్ దస్తగిరి సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.. కర్నూలులో హైకోర్టు చేపట్టాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు జిల్లాలోని నంద్యాల, ఆదోని, కర్నూలు డివిజన్లలో కొనసాగాయి. ఆదోనిలో న్యాయవాదులు చేపట్టిన దీక్షలకు సిపిఎం జిల్లా పశ్చిమప్రాంత కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మద్దతు తెలియజేసి మాట్లాడారు.

హోటల్స్, రెస్టారెంట్లపై మాంస అభివృద్ధి సంస్థ దాడులు

ప్రజాశక్తి - కృష్ణా

కృష్ణా జిల్లా నూజివీడు పట్టణంలోని హోటల్స్, రెస్టారెంట్లు, మాంసం దుకాణాలపై ఎపి మాంస అభివృద్ధి సంస్థ చైర్మన్ చంద్ర ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. భారీగా నిల్వ ఉన్న మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాలుగు మోటల్స్‌ను సీజ్ చేసి రూ.1.50 లక్షల పెనాల్టీ విధించారు.

ప్రజ్ఞ

జవాబులు

1.84 మిలియన్ డాలర్లు
2. న్యూఢిల్లీ (ఈ నెల 26, 27)
3. స్వచ్ఛ భారత్ ప్రచారకర్త
4. అరుణ బుద్ధా రెడ్డి
5. పారుపల్లి కశ్యప్

4న మన్యం బంద్

- రాష్ట్ర గిరిజన జెఎసి చైర్మన్, మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు
- సమస్యలపై గిరిజన జెఎసి తీర్మానం

ప్రజాశక్తి-జిల్లాపరిషత్(విశాఖ)

గిరిజన యూనివర్సిటీని వెంటనే ప్రారంభించాలని, బోయ, వాల్మీకులను ఎస్టీలో చేర్చొదని, పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించేవరకూ పనులు నిలుపుదల చేయాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్యాకేజీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) డిమాండ్ చేసింది. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల బంద్ చేపడుతున్నట్లు రాష్ట్ర గిరిజన జెఎసి చైర్మన్, మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు తెలిపారు. విశాఖపట్నం గిరిజన భవన్‌లో ఆదివారం జరిగిన గిరిజన సంఘాల రాష్ట్ర సదస్సులో బాబూరావు మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలో అన్ని విద్యా సంస్థలు ఏర్పాటు చేసినప్పటికీ గిరిజన యూనివర్సిటీని ప్రారంభించలేదని, దీనికి భవనాలు లేవనే కారణంతో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. టిడిపి ప్రభుత్వం 2017 డిసెంబర్ 2న బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని, దీనిని చూసి మత్స్యకారులు తమను ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేయడంతో అందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఇది సరైన విధానం కాదన్నారు. రాజకీయ ప్రయోనాల కోసం ఆదివాసీల హక్కులు, చట్టాలను హరించడం దుర్మార్గమన్నారు.


విశాఖ సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన జెఎసి చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు

వివిధ రాజకీయ పార్టీలు గిరిజన రిజర్వేషన్ వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చే విషయంలో పార్టీలకతీతంగా పార్లమెంటులో వ్యతిరేకించాలని, అంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు తీరని అన్యాయం చేస్తున్నారని, ప్రభుత్వమే సరైన పరిష్కారం చూపాలని కోరారు. ఈ సదస్సులో మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, గిరిజన ఉద్యోగుల సంఘం రూరల్ జిల్లా అధ్యక్షులు కె.కాంతారావు, గిరిజన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, 50 గిరిజన, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి

అన్‌ఎయిడెడ్ ఉద్యోగులతో వెట్టిచాకిరి

- జిఒ 35తో తీవ్ర ఇబ్బందులు
- ప్రభుత్వ తీరుపై అన్‌ఎయిడెడ్ సిబ్బంది ఆగ్రహం
- నేడు విజయవాడలో మహాధర్నా

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

ఫలితాల సాధన కోసం నిరంతరం కృషిచేస్తున్న అన్‌ఎయిడెడ్ అధ్యాపకులకు వేతనాలు నామమాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జిఒ 35తో అన్‌ఎయిడెడ్ ఉపాధ్యాయుల మనుగడను ప్రశ్నార్థకంగా మారింది. ఈ జిఒ ప్రకారం ఖాళీ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉండకపోవటంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు ఉద్యోగ భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారింది. దినకూలీలు, మున్సిపల్ కార్మికులకు వచ్చే వేతనాలు కూడా అన్‌ఎయిడెడ్ అధ్యాపకులకు అందటం లేదు. ప్రభుత్వం తమ సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఈ నెల 26న విజయవాడలో ధర్నా కార్యక్రమం చేపట్టేందుకు అన్‌ఎయిడెడ్ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు సిద్ధమయ్యారు. జాతీయస్థాయి ఉన్నత విద్యలో అత్యధిక కళాశాలలు ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉంది. అందులో ఎయిడెడ్ కళాశాలల్లో అత్యుత్తమ ఫలితాలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 179 జూనియర్, డిగ్రీ ఎయిడెడ్ కళాశాల్లో 2,500 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 1964 నుంచి ఎయిడెడ్ సెక్టారు ప్రారంభం అయ్యింది. అప్పటి నుంచి 1976, 1982, 1990, 1995, 1996, 1997లో కొంతమంది అన్ ఎయిడెడ్ సిబ్బందిని అప్పటి ప్రభుత్వాలు రెగ్యులరైజ్ చేశాయి. టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అన్‌ఎయిడెడ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలకు పూనుకుంది.



అనంతపురంలో ధర్నా చేస్తున్న అన్‌ఎయిడెడ్ అధ్యాపకులు (ఫైల్ ఫొటో)

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యావిధానంలో జిఒ నెంబరు 41 ద్వారా అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించింది. ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అన్‌ఎయిడెడ్ సిబ్బంది పట్ల మాత్రం ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తోంది. ఈ శాఖలో పనిచేస్తున్న వీరికి కేవలం రూ.6 వేలు వేతనం అందు తుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దశాబ్దాలుగా పనిచేస్తున్న అన్‌ఎయిడెడ్ సిబ్బందికి ఇఎస్‌ఐ, పిఎఫ్, మెడికల్ లీవ్ సైతం ఇచ్చే పరిస్థితులు లేవు. మహిళా అధ్యాపకులకు కనీసం ప్రసూతి సెలవులు కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. కర్నాటక, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలు ఎయిడెడ్ వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంటే రాష్ట్రంలో మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్‌ఎయిడెడ్ ఉద్యోగులను రెగ్యులర్ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఉద్యోగులు కోరుతున్నారు.

జిఒ 35 రద్దు చేయాలి

అన్‌ఎయిడెడ్ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్న జిఒ 35ను ప్రభుత్వం రద్దు చేయాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. ఎన్నో ఏళు ్లగా పనిచేస్తున్న అనుభవజ్ఞులైన సిబ్బందికి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వారికి ఇస్తున్న కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవటం విచారకరం. ఉద్యోగ భద్రత కల్పించి కనీస అవసరాలైన ఇఎస్‌ఐ, పిఎఫ్, సౌకర్యాలు కల్పించాలి.

డాక్టర్ పివిబి.సంజీవరావు,
ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

రాష్ట్రంలో ఎయిడెడ్ కళాశాలల్లో దాదాపు 2,152 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. చాలా కాలంగా పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం లేదు. ఇప్పటికైనా అన్‌ఎయిడెడ్ ఉద్యోగులకు భరోసా కల్పించే చర్యలను ప్రభుత్వం చేపట్టాలి.

డాక్టర్ గేయానంద్, మాజీ ఎమ్మెల్సీ

ఆక్వా కాలుష్యాన్ని నివారించాలి : మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆక్వా జోన్లు ఏర్పాటు చేసే జీవో 8ను వెంటనే రద్దు చేయాలని, కాలుష్యాన్ని నివారించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో అధికంగా, ఇతర కోస్తా జిల్లాల్లో యథేచ్ఛగా అక్రమ రొయ్యల చెరువులు తవ్వుతుంటే వాటిని అడ్డుకోకుండా ఆక్వా జోన్‌ల ఏర్పాటుకు జీవో జారీ చేయడం సరికాదని సూచించారు. చట్టవిరుద్ధంగా ఏర్పాటైన కాలుష్య కారక రొయ్యల చెరువులను ధ్వంసం చేయాలని, కొత్తగా రొయ్యల చెరువులు తవ్వొద్దని డిమాండ్ చేశారు. కోస్తా జిల్లాల్లో అక్రమ ఆక్వా చెరువుల మూలంగా వేలాది గ్రామాల్లో కాలుష్యం విపరీతంగా పెరిగి ప్రజలు తాగడానికి మంచినీరు కూడా లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆక్వా చెరువులకు సంబంధించి కేంద్రప్రభుత్వం చేసిన 'కోస్టల్ ఆక్వా కల్చర్ ఆథారిటీ చట్టం' రూల్సు, రాష్ట్రప్రభుత్వం చేసిన జీవోలు 7,15,48 లలోని నిబంధనలను ఖాతరు చేయకుండా చెరువులు తవ్వేశారని వివరించారు. అక్రమార్కులకు ప్రజాప్రతినిధుల అండ ఉండడంతో అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రిటైర్డ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ధర్మారావు రాసిన లేఖను ఉమ్మడి హైకోర్టు సుమోటో పిటిషన్‌గా స్వీకరించి విచారణ చేపట్టిందని తెలిపారు. రాష్ట్రప్రభుత్వమే నెలల పాటు ప్రొఫెసర్లతో నియమించిన నిపుణుల కమిటీ రొయ్యల సాగును ఆరు నుంచి ఎనిమిది నెలల పాటు పూర్తిగా నిలిపివేయాలని సిఫారు చేసిందని పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్రప్రభుత్వం ఆక్వా జోన్‌ల పేరుతో జీవో 8ను జారీ చేయడం సబబు కాదని తెలిపారు. ఇప్పటికైనా కోస్తా జిల్లాల్లో అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాన్ని అడ్డుకోవాలని అధికారులకు, పోలీసులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ప్రజాశక్తి - రొంపిచర్ల/బాపట్ల (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లాలో ఆదివారం సంభవించిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు వద్ద ఆగి ఉన్న ట్యాంకర్‌ను మరో వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మరో పది మందికి గాయాలయ్యాయి. బాపట్ల పట్టణంలోని టీచర్స్ కాలనీ వద్ద ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పిడుగురాళ్లకు చెందిన ఓ కుటుంబంలోని ఓ చిన్నారికి పుట్టెంటుక్రలు తీయించడానికి కారులో తిరుపతి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు వద్దకు రాగానే అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను వాహనం ఢీకొట్టింది. దీంతో కారు ముందుభాగంలో కూర్చున్న పొత్తూరి ఝాన్సీ (40) పొత్తూరి రోహిత్ (11) కొదమగుండ్ల మాన్యత (5) అక్కడికక్కడే మృతి చెందగా, చికిత్స పొందే క్రమంలో కొదమగుండ్ల మోతీ(38) మృతి చెందింది. మరో పది మందికి గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను నరసరావుపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలకు స్పీకర్ కోడెల శివప్రసాదరావు, నరసావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సానుభూతి తెలిపారు. బాపట్ల పట్టణం టీచర్స్ కాలనీ వద్ద వాటిల్లిన ప్రమాదంలో కర్లపాలెం మండలం గణపవరానికి చెందిన కనమర్లపూడికి వెంకట సుబ్రహ్మణ్యం (70) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చైనా అధ్యక్ష పదవికి కాల పరిమితి తొలగింపు ప్రతిపాదన

బీజింగ్ : చైనా అధ్యక్షుడి పదవి కాలం పరిమితిని తొలగించాలని కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతిపాదించినట్లు చైనా అధికార పత్రిక సిన్హువా తెలిపింది. ఇప్పటి వరకూ ఒక వ్యక్తి అధ్యక్ష పదవిని నిర్వహించే అవకాశం కేవలం రెండు సార్లకు మాత్రమే పరిమితమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం తొలిసారి దేశాధ్యక్ష పదవిని నిర్వహిస్తున్న సీ జిన్‌పింగ్ పదవీ కాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దీనితో మార్చి 5న ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాలలో ఆయన మరోసారి అధ్యక్ష పదవికి ఎన్నిక కానున్నారు. గత అక్టోబర్‌లో ముగిసిన పార్టీ జాతీయ మహాసభల్లో సీ జిన్‌పింగ్ రెండోసారి పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విషయం తెలిసిందే.



చెట్ల కోసం మూడు రోజుల కర్నాటక పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెట్లను సంరక్షించాలంటూ ఆ రాష్ట్ర పార్టీ నిర్వహించిన ర్యాలీలో జెండా ఊపి ప్రారంభించారు

పని కావాలంటే కాంగ్రెస్... మాటలు కావాలంటే బిజెపి

కర్ణాటక ఓటర్లతో రాహుల్ గాంధీ

బెంగళూరు : పనులు కావాలనుకుంటే కాంగ్రెస్‌లోకి రండి, ఒట్టి మాటలు కావాలనుకుంటే నరేంద్ర మోడీ దగ్గరకు వెళ్ళండి అని కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ ఓటర్లనుద్దేశించి అన్నారు. కర్ణాటకలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. రాష్ట్రంలో మూడు రోజులు జరిపే పర్యటనలో భాగంగా ఆదివారం బగల్‌కోట్, బిలాజ్‌పూర్ జిల్లాల్లో పర్యటించారు. బిజెపికి పూర్తి మద్దతున్న లింగాయత్ కమ్యూనిటికి చెందిన మత ప్రాధాన్యత గల ప్రదేశాలను రాహుల్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడు ఒక్కడేనని, అందరిలో దేవుడున్నాడని బసవన్న చెప్పాడని, ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టే సమయంలో ఆయన ఆలోచనే తమకు మార్గదర్శకంగా ఉంటుందని రాహుల్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ గాంధీ రాష్ట్రంలో పర్యటించడం ఇది రెండోసారి. రాహుల్ మొదటిసారి జరిపిన రాష్ట్ర పర్యటనలో భాగంగా బళ్ళారి, కొప్పల్, రాయ్‌చూర్, యాద్‌గిర్, గుల్బర్గా, బీదర్ జిల్లాలలోని పలు స్థానిక ఆలయాలను, మత కేంద్రాలను సందర్శించారు. ఈ విడత మోడీ కర్ణాటక పర్యటనకు వచ్చినప్పుడు బసవన్న పట్ల విశ్వాసం కలిగి ఉంటే ఆయన చెప్పిన మాటలను చేతల్లో చూపించాల్సిందిగా కోరాలని ఓటర్లను ఉద్దేశించి అన్నారు. మేకిన్ ఇండియా, సిట్‌డౌన్ ఇండియా, స్టాండప్ ఇండియా, సీ రైట్ ఇండియా అంటూ మోడీ పలు కార్యక్రమాలను ప్రారంభించారన్నారు. అయితే మార్కెట్‌లో ఉన్న ప్రతి వస్తువు కూడా చైనాలో తయారయ్యిందే అని ఆయన అన్నారు. గుజరాత్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాలలో విద్య, ఆరోగ్యం వంటి సౌకర్యాలు కలగచేయడంలో మోడీ విఫలమయ్యారని రాహుల్ విమర్శించారు.

మేఘాలయలో ఎన్‌కౌంటర్

నిషిద్ధ జిఎన్‌ఎల్‌ఎ కమాండర్ ఇన్ చీఫ్ షిరా మృతి

షిల్లాంగ్ : మేఘాలయలో పనిచేస్తున్న గరో నేషనల్ లిబరేషన్ ఆర్మీ (జిఎన్ఎల్ఎ)సంస్థకు చెందిన సోహాన్ డి షిరాను పోలీసులు శనివారం ఎన్‌కౌంటర్ చేశారు. రాష్ట్రానికి చెందిన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి హత్య వెనుక షిరా హస్తమున్నదని పోలీసులు భావిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఎన్‌సిపి అభ్యర్థి హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఎస్ఎఫ్ 10, రాష్ట్ర పోలీసుల కమాండో యూనిట్ ఉమ్మడిగా శనివారం ఉదయం 10.50 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ చేశారు. తూర్పు గరో పర్వత ప్రాంత జిల్లాలోని డోబు వద్ద ఎన్‌కౌంటర్ చేశారు. షిరా నిసిద్ధ జిఎన్‌ఎల్‌ఎకు కమాండర్ ఇన్ చీఫ్‌గా ఉన్నాడు. షిరాను పట్టిచ్చిన వారికి 10 లక్షలు రివార్డు ఇస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. షోహాన్‌ను తమ బలగాలు ఎన్‌కౌంటర్ చేశాయని డిజిపి ఎస్‌పి సింగ్ స్పష్టం చేశారు. అయితే షిరా మృతిని ధృవీకరిస్తూ జిఎన్‌ఎల్‌ఎ ఇంకా ప్రకటనను జారీ చేయలేదు.

పాక్ దౌత్యాధికారి సిద్ధికికి ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు

ప్రక్రియను ప్రారంభించిన ఎన్ఐఎ

న్యూఢిల్లీ : 2014 నాటి ఉగ్రవాద కేసులో పాక్ దౌత్యాధికారి అమిర్ జుబెయిర్‌సిద్ధిక్విపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసును జారీ చేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సిద్ధమవుతున్నది. అందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించింది. దేశంలోని అమెరికా, ఇజ్రాయిల్ దౌత్య కార్యాలయాలపై ఉగ్రవాద దాడులు జరిపేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై గతవారంలో సిద్ధికి పై చార్జిషీటు నమోదైంది. ఆయనపై చార్జిషీటు నమోదైన తరువాత రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని ఎన్ఐఎ నిర్ణయం తీసుకుంది. రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసేందుకు పేపర్ వర్క్ పూర్తయ్యిందని ఎన్ఐఎ అధికారులు తెలిపారు. వీటిని త్వరలోనే ఫ్రాన్స్‌లోని లియాన్‌లో ఉన్న ఇంటర్‌పోల్ ప్రధాన కార్యాలయానికి పంపనున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు.

రాష్ట్రాలను రబ్బరుస్టాంపుల్లా మారుస్తున్న నిబంధనలను తొలగించండి

కేంద్రానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం లేఖ

భోపాల్ : వన్య ప్రాణి సంరక్షణ చట్టంలోని కొన్ని నిబంధనలు రాష్ట్రాలను రబ్బరు స్టాంపులుగా మార్చేస్తున్నాయని, అటువంటి నిబంధనలను మార్పుచేయాల్సిన అవసరముందని సూచిస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి ఒక లేఖ రాసింది. అలాగే 1972నాటి చట్టంలో కూడా మార్పు తీసుకు రావలసిన అవసరముందని పేర్కొంది. టైగర్ రిజర్వులోని అదనపు ప్రాంతంలో మార్పులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు అనుమతివ్వాలని కూడా కోరింది. మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన కొంతమంది కార్యదర్శులు, డెహ్రాడూన్‌కుచెందిన వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ ఇండియా డైరెక్టర్‌తో పాటు మరికొందరు కలిసి ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. 1972 నాటి వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ చట్టంలోని మార్పులపై తాము ఇచ్చిన సమాచారాన్ని షేర్ చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్నికోరింది. దీనికి సంబంధించి అంతకుముందు పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు (ఎంఒఇఎఫ్‌సిసి) మంత్రిత్వ శాఖ నుండి ఒక లేఖ అందిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన సిఫార్సులతో కేంద్రానికి లేఖ రాసింది. 1972 నాటి చట్టానికి సంబంధించి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని కోరుతూ ఎంఒఇఎఫ్‌సిసి మధ్య ప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాసింది.

శ్రీదేవి హఠాన్మరణం

(మొదటి పేజీ తరువాయి)

తొలి సినిమా షూటింగ్‌లో ఉండగానే ఆమె కన్ను మూశారు. ఈ సమయంలో ఆమె భర్త బోని కపూర్, కూతురు ఖుషీ అక్కడే ఉన్నారు. దుబాయ్‌లోనే శ్రీదేవి భౌతికకాయానికి పోస్ట్‌మార్టం నిర్వహించారు. వైద్యులు నివేదిక ఇచ్చిన తర్వాత ప్రత్యేక విమానంలో ఆదివారం రాత్రి ఆమె భౌతికకాయం ముంబయికి చేరింది. సోమవారం ఆమె నివాసం నుంచి ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం మోహబూబా స్టూడియోకు తరలిస్తారు. మధ్యాహ్నం రెండు గంటలకు జుహులోని శాంతాక్రజ్ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారు. శ్రీదేవి మరణ వార్త వినగానే అభిమానులంతా శోకసంద్రంలో మునిగిపోయారు. ముంబయిలోని ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. ఆమె అత్యధికంగా తెలుగు సినిమాల్లో నటించినప్పటికి, హిందీ సినిమాల్లో కూడా నటించి మెప్పించారు. అనిల్ కపూర్, ఊర్మిళ మటోండ్కర్‌తోకలిసి జుదాయ్ సినిమాలో నటించిన తరువాత ఆమె దాదాపు 15 సంవత్సరాల పాటు ఇంటికే పరిమితమయ్యారు. ఆ తరువాత 2012లో గౌరి షిండే డైరెక్టర్‌గా "ఇంగ్లీషు వింగ్లిషు" సినిమాలో నటించారు. ఇంకా విడుదల కావలసిన షారూఖ్ ఖాన్ సినిమా 'జీరో'లో శ్రీదేవి ప్రత్యేక పాత్రను పోషించాల్సివుండేది. శ్రీదేవి 1969లో "తనైవన్" అనే తమిళ సినిమాలో బాల నటిగా ఆరంగేట్రం చేశారు. ఇదే ఆమె తొలి తమిళ సినిమా. అటుతరువాత 70 దశకంలో ఆమె తమిళ సినిమాలతో చిత్ర రంగ ప్రవేశం చేశారు. మలయాళం, తెలుగు, కన్నడ సినిమాలలో నటించారు.

ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం

ప్రముఖ నటి శ్రీదేవి మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం సంతాపం వ్యక్తం చేశారు. తన సంతాప సందేశాన్ని ట్వీట్ చేశారు. "శ్రీదేవి అకాల మృతి విచారాన్ని కలిగిస్తోంది. సినీ పరిశ్రమ ఒక ప్రముఖ నటిని కోల్పోయింది. సినీ నటిగా ఆమె సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విభిన్నమైన పాత్రలు పోషించి, అద్భుతమైన నటనా తీరును ప్రదర్శించారు. ఎన్నో గుర్తుండిపోయే పాత్రలలో జీవించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను" అని మోడీ ట్వీట్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీ తన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శ్రీదేవి మృతి వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. శ్రీదేవి అద్భుత ప్రతిభావంతురాలైన బహుముఖ నటి అని పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఒక తరానికి చెందిన అత్యంత ప్రజాదరణ కలిగిన నటి శ్రీదేవి అకాల మృతి విచారంగా ఉంది. ఆమె కుటుంబానికి, పరిశ్రమలోని సహచరులకు, అభిమానులకు సంతాప సానుభూతి అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి స్మృతి ఇరానీ సంతాప సందేశాన్ని ట్వీట్ చేశారు. నటనకు ఆమె గొప్ప నిర్వచనమని, ఆమె ఆకస్మిక మృతి కలచి వేసిందని పేర్కొన్నారు. ఆమె మృతి పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాలీవుడ్ సంతాపం

ప్రముఖ నటి శ్రీదేవి మృతి వార్త భారతీయ చిత్ర పరిశ్రమను దిగ్భ్రాంతికి గురిచేసింది. బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా సంతాపాలు వ్యక్తం చేశారు. ఆమె మృతివార్త తెలిసిన నిముషాల వ్యవధిలోనే అమితాబ్ బచ్చన్, ప్రియాంక చోప్రా, సుష్మిత సేన్, సిద్ధార్థ మల్హోత్ర, రితేష్ దేశ్‌ముఖ్‌లు ట్విట్టర్ వేదికగా సంతాపం తెలిపారు.ఎందుకో తెలియని ఓ వింత బాధ హృదయాన్ని అలుముకుందని అమితాబ్ ట్వీట్ చేయగా, ఇది ఒక చీకటి రోజని, తనకు మాటలు రావడం లేదని, శ్రీదేవికి నివాళులు అర్పిస్తున్నానని ప్రియాంక చోప్రా ట్వీట్ చేశారు. హాస్యనటుడు జానీ లివర్ కూడా శ్రీదేవికి సంతాపం తెలుపుతూ ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. శ్రీదేవి మృతి వార్త తనకు ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందని సిద్ధార్థ మల్హోత్రా పేర్కొన్నారు. దిగ్భ్రాంతికరమైన వార్త గుండెలను చీల్చివేసిందంటూ శిల్పా శెట్టి శ్రీదేవి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆమె తనకు అత్యంత సమీప స్నేహితురాలని రజనీకాంత్ అన్నారు. ఆమె మృతి తనకు ఎంతోవిచారంగా ఉందన్నారు. శ్రీదేవి మృతి తీరని నష్టమన్నారు. జన్మత్తః ఆమె నటి అని పేర్కొన్నారు.

రోహింగ్యా సంక్షోభానికి ఆర్నెల్లు..!

కనుచూపు మేరలో కనిపించని పరిష్కారం



ఢాకా : మయన్మార్‌లోని సరిహద్దు రాష్ట్రంలో నివసిస్తున్న రోహింగ్యా ముస్లింల సంక్షోభం ప్రారంభమై ఆర్నెల్లు పూర్తయినా ఈ సమస్యకు కనుచూపు మేరలో పరిష్కారం కన్పించటం లేదు. బౌద్ధులు మెజార్టీగా వున్న మయన్మార్‌లో రోహింగ్యాలను అధికారికంగా గుర్తించేందుకు నిరాకరించటంతో పాటు వారు ఎదుర్కొంటున్న వివక్ష, అణచివేతలు ఈ ఆర్నెల్ల కాలంలో విపరీతంగా పెరిగిపోయాయి. మయన్మార్ సైన్యం చేపట్టిన అణచివేత చర్యలకు తీవ్ర భయాందోళనలకు గురైన పలువురు రోహింగ్యాలు పొరుగునే వున్న బంగ్లాదేశ్‌కు శరణార్థులుగా చేరుకున్నారు. ఇప్పుడు మయన్మార్‌లో పరిస్థితి సద్దుమణిగిందంటూ అక్కడి ప్రభుత్వం భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా వారు మాత్రం దానిని ఏ మాత్రం విశ్వసించటం లేదు. బంగ్లాదేశ్‌లో వుంటే తమకు ప్రాణభయం లేదని, ఇక్కడ ప్రశాంతంగా బతుకుతున్నామని వారుచెబుతున్నారు.

తిరిగి రప్పించటంలో జాప్యం

గత ఆగస్టు 25న కొందరు రోహింగ్యా తీవ్రవాదులు భద్రతా దళాలపై దాడి చేసి 14 మందిని హతమార్చారు. కొద్ది గంటల వ్యవధిలోనే సైన్యం, బౌద్ధుల బృందాలు రోహింగ్యా గ్రామాలపై దాడులు చేసి రక్తపాతాన్ని సృష్టించాయి. వేలాది మందిని హతమార్చటమే కాక మహిళలపై అత్యాచారాలకు పాల్పడటంతో పాటు మొత్తం గ్రామాలకు గ్రామాలనే కాల్చి బూడిద చేశారు. హింసాకాండ ప్రారంభమైన తొలి నెలరోజుల వ్యవధిలోనే మయన్మర్‌లో దాదాపు 6,700 మందికి పైగా రోహింగ్యాలు ప్రాణాలు కోల్పోయారని ప్రముఖ సహాయక బృందం డాక్టర్స్ వితవుట్ బోర్డర్స్ అంచనా వేసింది. ఆర్నెల్ల తరువాత ఇప్పుడు మయన్మార్‌లో పరిస్థితి సద్దు మణుగుతున్న సంకేతాలు అందుతుండటంతో కొంత మంది తమ ఇళ్లకు ప్రయాణమవుతున్నారు. తమ దేశానికి చేరిన శరణార్థులను దశలవారీగా వెనక్కి తిప్పి పంపే విషయంలో బంగ్లాదేశ్ మయన్మార్ ప్రభుత్వంతో ఇప్పటికే ఒక ఒప్పందం కుదుర్చుకుంది. వారికి భద్రత, గౌరవప్రదమైన జీవితం కల్పిస్తామని మయన్మార్ హామీ ఇచ్చినప్పటికీ ఈ ప్రక్రియ నత్త నడక నడుస్తుండటంతో శరణార్థులకు ఇంకా ప్రమాదచ్ఛాయలు కన్పిస్తూనే వున్నాయి. రఖినే రాష్ట్రంలో ఖాళీగా వున్న గ్రామాలను ఉపగ్రహ ఛాయాచిత్రాలు చూపుతున్నాయి. మయన్మార్ సైన్యంపై ఏర్పడిన భయాందోళనలు తమను ఇంకా వీడకపోవటంతో అనేక మంది శరణార్థులు అనువైన పరిస్థితి కోసం ఎదురు చూస్తున్నారు. తమకు ఎటువంటి గుర్తింపూ లేకుండా వెనక్కి పంపితే తమకు తిరిగి చిత్రహింసలు తప్పవని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అది బిజెపి నేత వాహనం

బీహార్‌లో పాఠశాల విద్యార్థుల మృతిపై పోలీసులు

పాట్నా : బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో శనివారం తొమ్మిది మంది స్కూలు పిల్లల మృతికి కారణమైన వాహనం సీతామర్హి ప్రాంతానికి చెందిన ఒకబిజెపి నేత మనోజ్ భాటియాదని పోలీసు అధికారులు ఆదివారం తెలిపారు. 77వ నెంబరు జాతీయ రహదారిపై శనివారం ప్రమాదం జరిగిన సమయంలో మనోజ్ భాటియా ఆ వాహనంలోనే ఉన్నాడని, ప్రమాదం జరిగిన వెంటనే తన డ్రైవర్‌తో కలిసి పరారయ్యాడని చెప్పారు. దీంతో పాలక జెడి(యు)-బిజెపి ప్రభుత్వంపై ఆర్‌జెడి విరుచుకు పడింది. పిల్లల మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరింది. ప్రమాదం శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో జరిగింది. స్కూల్ వదిలిపెట్టిన తరువాత పిల్లలు జాతీయ రహదారిని దాటుకుని ధరమ్‌పూర్ గ్రామానికి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. అదే సమయంలో ముజఫర్‌పూర్ నుంచి సీతామర్హి వెళ్తున్న జీపు తొలుత ఒక మహిళను ఢీ కొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో స్కూలు పిల్లలను కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో మరో పది మందికి పైగా పిల్లలు గాయపడినట్లు సమాచారం. వీరందరూ ముజఫర్‌పూర్‌లోని శ్రీ కృష్ణ మెడికల్ కాలేజి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ గాయపడిన వారిని సందర్శించి పరామర్శించారు. బాధిత కుటుంబాలను కలుసుకున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో ఎవరినీ ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. డ్రైవర్ మద్యం సేవించి ఉంటాడేమోనన్నారు. ప్రమాదంలో మృతి చెందిన పిల్లలందరూ పేద కుటుంబాలకు చెందిన వారే. వారి తల్లిదండ్రులు రోజువారి వేతన కూలీలు. పాఠశాల జాతీయ రహదారికి పక్కనే ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, పాఠశాలను తక్షణమే మార్చాలని రైతులు, విద్యార్థులు డిమాండ్ చేశారు.

బిజెపి నేత అవమానంతో మహిళ ఆత్మహత్యాయత్నం

జబల్‌పూర్ : స్థానికంగా వున్న బిజెపి మైనార్టీ సెల్ నేత ఒకరు తన తండ్రిని అవమానించారన్న బాధతో మధ్యప్రదేశ్‌లో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం సృష్టించింది. బిజెపి నేత తన తండ్రిని ఒంగో పెట్టి వీపుపై పిడిగుద్దులు గుద్దుతూ అవమానించి నట్లు ఈ యువతి చెబుతోంది. ఇందుకు సంబంధించిన మూడు వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఒక ఆర్థిక వివాదంలో తనకు వ్యతి రేకంగా మాట్లాడిన బాధితుడిని బిజెపినేత మహమద్ షఫిక్ అలియాస్ హీరా బెదిరిస్తున్న దృశ్యాలు ఒక వీడియోలో వున్నాయి. మరో వీడియోలో ఆస్పత్రిలో కోలుకుంటున్న మహిళ, ఆమె తల్లి మాట్లాడుతూ కన్పించారు. తన తండ్రికి జరిగిన అవమానాన్ని తట్టుకోలేక తన కుమార్తె సాయంత్రం కళాశాలనుండి వచ్చిన వెంటనే విష పదార్థాన్ని తీసుకున్నదని ఆమె తల్లి వివరిస్తోంది. ఇందుకు బాధ్యులైన వ్యక్తులను అరెస్ట్ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నామని ఆమె చెబుతోంది.

పడవ ప్రమాదం నుండి బయటపడిన ఎమ్మెల్యే

ముంబయి : ఎమ్మెల్యే, పోలీసు అధికారి సహా 15 మంది ప్రయాణిస్తున్న పడవ మునిగిపోయిన ఘటన స్థానిక మఢ్ ఐలండ్‌లో చోటుచేసుకుంది. ప్రమాదం నుంచి అందరూ క్షేమంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు. మఢ్ ఐలండ్‌లోని దర్గాను సందర్శించి తిరిగి బయలుదేరిన పడవ కొద్దిదూరం ప్రయాణించిన అనంతరం అకస్మాత్తుగా మునిగిపోయినట్లు బృహన్ ముంబై మునిసిపల్ కార్పోరేషన్ ప్రకృతి విపత్తు నిర్వహణ అధికారులు తెలిపారు. ఈ ప్రమాదం నుండి ఎమ్మెల్యే అస్లాం షేక్, పోలీసు అధికారి, ఇతర భక్తులు బయటపడినట్లు అధికారులు తెలిపారు. తీరానికి దగ్గరగా ప్రమాదం జరగడంతో పెను ప్రమాదం తప్పినట్టు పేర్కొన్నారు.

మానసిక వికలాంగునిపై దాడి ఘటనలో 16మంది అరెస్టు

తిరువనంతపురం : కేరళలో పాలక్కడి జిల్లాలో మానసిక వికలాంగుడైన గిరిజనుడిపై దాడి చేసిన 16మంది యువకులను శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. 27 ఏళ్ల మానసిక వికలాంగుడైన మధుని దొంగతనం ఆరోపణతో కొందరు యువకులు తీవ్రంగా హింసించిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై వివరణనివ్వాల్సిందిగా కేంద్రం కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన సంగతి తెలిసిందే. బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్ రూ.10లక్షల పరిహారాన్ని ప్రకటించారు.

సెహ్వాగ్ క్షమాపణ

ముంబయి : కేరళలో గిరిజన యువకుడి హత్య కేసులో క్రికెటర్ వీరేందర్ సెహ్వాగ్ చేసిన ట్వీట్ వివాదాస్పదమవడంతో వెంటనే అతను క్షమాపణలు చెప్పాడు. ఒక దుకాణంలో ఆహార పదార్థాలు దొంగిలించాడనే నెపంతో మధు అనే మతిస్థిమితం లేని గిరిజనుడిని కొంతమంది దాడి చేసిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సెహ్వాగ్ ఈ ఘటన పట్ల సిగ్గుతో తలదించుకుంటున్నానని ట్విటర్‌లో తెలిపారు. దాడికి పాల్పడిన నిందులంటూ ముస్లిం పేర్లను ట్విటర్‌లో ప్రస్తావించారు. దీంతో 16మంది నిందితుల్లో నీకు ముస్లింలే కనిపించారా అంటూ నెట్‌లో సెహ్వాగ్‌ను విమర్శించారు. అసంపూర్తి సమాచారంతో ట్విటర్‌లో స్పందించానని, దీనికి బేషరతుగా క్షమాపణలుచెబుతున్నానని, అయతే ఈ ట్వీట్ మతానికి సంబంధించినది కాదని, శాంతంగా ఉండండి అని ట్వీట్ చేశారు.

యూపీలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

భాదోహి : అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భాదోహి జిల్లాలోని మిశ్రాని గ్రామంలో ఉండే అంబేద్కర్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఈ ఘటన పై గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు గ్రామస్తుల అంగీకారంతో నాలుగు అడుగుల ఎత్తు ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. కాగా, నిందితుల పై సంబంధిత సెక్షన్ల కింద కేసుల నమోదు చేసినట్టు పోలీసు అధికారి రాం కరణ్ తెలిపారు.

ఆర్థిక నేరగాళ్లు అంబానీ, అదానీ బంధువులు

(మొదటి పేజీ తరువాయి)

కోరుకుంటుంటారు. టాఫె ట్రాక్టర్ తయారీ సంస్థ కు చెందిన మల్లి శ్రీనివాసన్ టివిఎస్ గ్రూప్ వేణు శ్రీనివాసన్‌ను వివాహమాడటం ఇందుకు చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

నీరవ్ మోడీ, అంబానీ

ఇక ప్రస్తుతానికి వస్తే గత వారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలో ప్రధాన నిందితుడైన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, అతడి మేనమామ మెహుల్ చోక్సీకి చెందిన కంపెనీలకు అంబానీ, ఆదానీ కంపెనీలకు మధ్య వివాహ బంధాలున్నాయన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నిందితుడైన నీశాల్ మోడీ ముఖేష్ అంబానీ మేనకోడలు ఇషేత సల్గావ్‌కర్‌ను వివాహం చేసుకున్నాడు. ముఖేష్ అంబానీ తన సోదరి దీప్తిని మైనింగ్ సామ్రాట్ విఎం సల్గావ్‌కర్ కుటుంబంలోకి పంపారు. దీప్తి కుమార్తె ఇషేతకు 2016లో నీశల్ మోడీతో వివాహనిశ్చితార్థం జరిగింది. ఈ నిశ్చితార్థ సంబరాలను ముకేష్ అంబానీ ముంబయిలోని తన ఇంటిలోనే నిర్వహించారు. నీరవ్‌మోడీ, అంబానీ సంబంధాలు వ్యక్తిగతం దాటి వ్యాపారంలోకి కూడా ప్రవేశించిన విషయాన్ని సిబిఐ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. నీరవ్‌మోడీ కంపెనీలలో ఒకదానికి చీఫ్ ఫైనాన్షియల్ అధికారిగా వున్న విపుల్ అంబానీని సిబిఐ అరెస్ట్ చేసింది. ఇతడు ధీరూభాయ్ అంబానీ మేనల్లుడు, ముకేష్, అనిల్ అంబానీకి పెద్ద బావ. రిలయన్స్‌లో తన కెరీర్‌ను ప్రారంబించిన విపుల్ తరువాత బ్రోకరేజ్ సంస్థ టవర్ కేపిటాలో పనిచేసి తరువాత నీరవ్‌మోడికి చెందిన ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్‌లో చేరాడు.

కొఠారి, ఆదానీ మరియు మెహతా

గత రెండు రోజులుగా వెలుగులోకి వచ్చిన రోటోమ్యాక్ పెన్స్ కేసులో ఆ సంస్థ అధినేత విక్రమ్ కొఠారి బ్యాంకులకు రు.3,696 కోట్లకు పైగా రుణాలు ఎగవేసిన ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. విక్రమ్ కొఠారి కుమార్తె నమ్రత వివాహమాడిన ప్రణవ్ ఆదానీ మరెవరో కాదు పారిశ్రామిక వేత్త గౌతమ్ ఆదాని దగ్గర బంధువే.. బోస్టన్ యూనివర్శిటీలో బిజినెస్ మేనేజ్‌మెంట్ డిగ్రీ పూర్తి చేసిన ప్రణబ్ ఆదానీ వ్యాపార సామ్రాజ్యంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి ఆదానీ గ్రూప్ వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ ఆదానీ విల్మర్‌కు మేనేజింగ్ డైరెక్టరయ్యాడు. ఆదానీ కార్పొరేట్ పత్రాలలో తరచు ప్రస్తావనకు వచ్చే నమ్రతా ఆదానీ విక్రమ్ కొఠారి కూతురే. నీరవ్ మోడీతో పాటు బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన మరో వజ్రాల వ్యాపారి జతిన్ మెహతా. విన్సమ్ డైమండ్స్‌కు చెందిన జతిన్ మెహతా కుమారుడు ఆదానీ సోదరుడు వినోద్ శాంతిలాల్ ఆదానీ కుమార్తె కృపను 2012 లో వివాహం చేసుకున్నాడు.

వినోద్ శాంతిలాల్ అదానీపై కూడా ఆర్థిక నేరాల ఆరోపణలు ఉన్నాయి. దిగుమతులలో అధిక ఇన్‌వాయిస్‌లు సృష్టించి ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడని డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ నోటీసులు ఇచ్చింది. ఈ రకంగా ఇటీవల కాలంలో ఆర్థిక నేరాలకు పాల్పడిన వారంతా అంబానీ, అదానీల బంధువులుగా ఉన్నారు.

ప్రత్యేకం

లైంగిక దాడి బాధితుల్లో అత్యధికులు మైనర్లే

తాజా అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో జరుగుతున్న లైంగిక దాడుల కేసుల్లో అత్యధిక బాధితులు మైనర్లే అని తాజా అధ్యయనం వెల్లడించింది. లైంగిక దాడుల పరిశోధనలకు సంబంధించిన పూనెలోని ఒక కేంద్రంలో దాదాపు తొమ్మిది వందల కేసులను మెడికో లీగల్ ఎనాలిస్టులు విశ్లేషించారు. ఈ డేటా చాలా విచారకరమైన అంశాలను వెల్లడించింది. లైంగిక దాడుల బాధితుల్లో 60 శాతం మంది 18 సంవత్సరాల కన్నా తక్కువ వయస్సు గలవారేనని పేర్కొంది. పూనెలోని బి జె మెడికల్ కాలేజి అండ్ ససూన్ జనరల్ హాస్పటల్‌కు చెందిన ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టెక్సికాలజి విభాగం అధికారులు వెల్లడించిన డేటా మేరకు తాము పరిశోధించిన 890 లైంగిక దాడుల కేసుల్లో 534 కేసుల్లో బాధితులు పిల్లలు లేదా యుక్తవయస్సులో ఉన్న వారని తెలిపింది. నవంబరు 2015-సెప్టెంబరు 2017 మధ్య కాలంలో వీరిని చికిత్స నిమిత్తం ససూన్ ఆసుపత్రికి తీసుకు వచ్చినట్లు ఆ నివేదిక పేర్కొంది. లైంగిక దాడులకు సంబంధించి నమోదైన మొత్తం కేసుల్లో 60.23 శాతం మంది మైనర్లేనని తెలిపింది. ఇటువంటి కేసుల్లో అత్యధికులు బాలికలేనని, వీరి సంఖ్య 92.88 శాతంగా ఉందని, బాలుర సంఖ్య 7.12 శాతంగాఉందని ఆ నివేదిక వెల్లడించింది. అత్యధిక కేసుల్లో 62.55 శాతం మంది 15-18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారేనని పేర్కొంది. అత్యధిక కేసుల్లో అంటే దాదాపు 93.63 శాతం కేసుల్లో నిందితులు బాధితులకు తెలిసిన వారే కావడం విశేషం. చాలా కేసులలో దాదాపు39.51 శాతం కేసుల్లో బాధితుల బాయ్‌ఫ్రెండే నిందితుడవుతున్నా డని అధ్యయనం వెల్లడించింది. అత్యధిక కేసుల్లో అద్దెకు తీసుకున్న గదులలోనే దాడులు జరగు తున్నాయి. 26.40 శాతం కేసుల్లో దాడులు అద్దెకుతీసుకున్న గదుల్లో జరుగుతుంటే, 21.72 శాతం కేసుల్లో దుండగుల నివాసాల్లోనూ, 20.97 శాతం కేసుల్లో బాధితుల నివాసాల్లోనూ లైంగిక దాడులు జరుగుతున్నాయని అధ్యయనం వెల్లడించింది. లైంగిక దాడుల కేసుల్లో 92.88 శాతం మంది బాధితులు బాలికలు కాగా, 7.12 శాతం కేసుల్లో బాలురు బాధితులుగా ఉన్నారు. అత్యధిక కేసుల్లో అంటే దాదాపు 62.55 శాతం కేసుల్లో బాధితులు 15-18 సంవత్సరాల మధ్య వయస్సు వారు కావడం విశేషం. అత్యధిక కేసుల్లో 61.80 శాతం కేసుల్లో దుండగులు 21-30 సంవత్సరాల మధ్య వయసుస కలగారున్నారని అధ్యయనం పేర్కొంది. అలాగే 17.80 శాతం కేసుల్లో నిందితులు 11-20 సంవత్సరాల మధ్య వయస్సు కలవారు కావడం విశేషం. కనీసం 34 శాతం కేసుల్లో నిందితులు 16-18 సంవత్సరాల మధ్య వయస్సు వారిగా ఉన్నారని అధ్యయనం పేర్కొంది. ఇప్పటి వరకు నమోదైన లైంగిక దాడుల నిందితుల్లో అతి చిన్నవాడి వయస్సు 11 సంవత్సరాలు కాగా, అతి పెద్ద వాడి వయస్సు 55 సంవత్సరాలని అధ్యయనం తేల్చింది.

సంక్షిప్తం

సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన చిదంబరం

న్యూఢిల్లీ : మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరం సిబిఐ, ఇడి అధికారులు దాడులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. సోదాలు, విచారణల పేరుతో తనను, తన కుటుంబసభ్యులను వేధింపులకు గురి చేస్తున్నారని సుప్రీంకోర్టుకు తెలిపారు. 2015 నుండి చెన్నై, ఢిల్లీలోని తమ నివాసాలపై అధికారులు దాడులు నిర్వహిస్తున్నారని, సమన్లు జారీ చేస్తున్నారని 26 పేజీల రాతపూర్వక పిటిషన్ ద్వారా కోర్టుకు సమర్పించినట్లు ఆయన తెలిపారు.

రూ.1.95 కోట్ల పాత నోట్లు స్వాధీనం

బెంగళూరు : రద్దయిన పాత రూ.500, రూ.1000నోట్లను మారుస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. పాత నోట్లను మారుస్తున్నట్లు కొందరు సమాచారం అందించడంతో కొత్తనూరు పోలీసులు గోల్డెన్ ఫాం అపార్ట్‌మెంట్‌లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మారతహళ్లికి చెందిన జైమారుతి(32), హెన్నోకెటె శశి (26), మంగళూరు శరత్(28)లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.95 కోట్ల రద్దయిన నోట్లను స్వాధీనం చేసుకున్నారు. భారీగా పాత నోట్లు లభించడంతో పోలీసులు విచారణ చేపట్టినట్లు డీసీపీ గిరీశ్ తెలిపారు.

రుస్తూం-2 డ్రోన్ పరీక్ష విజయవంతం

న్యూఢిల్లీ : భారత పరిశోధన సంస్థ డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో) నిర్వహించిన మానవ రహిత వైమానిక వాహనం రుస్తూం-2 డ్రోన్ పరీక్ష విజయవంతమైంది. కర్నాటకలోని చిత్రదుర్గ జిల్లా చలకేరేలో ఆదివారం ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్) నుంచి డీఆర్‌డీవో చైర్మన్ ఎస్ క్రిస్టోఫర్, డైరెక్టర్ జనరల్ సీపీ రామనారాయణన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ సిస్టమ్ డీజీ మంజుల, సీనియర్ సైంటిస్ట్‌ల ఆధ్వర్యంలో దీనిని ప్రయోగించారు. అత్యధిక ఇంజిన్ పవర్ అమరిక కల్గిన మొదటి వాహనం కావడంతో రుస్తూం-2 ప్రాముఖ్యత సంతరించుకుందని, రుస్తూం పరీక్ష విజయవంతమైందని రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి. ఇది సింథటిక్ అపేర్చర్ రాడర్, ఎలక్ట్రానిక్ ఇంటలిజెన్స్ సిస్టమ్ వంటి పేలోడ్లను మోసుకెళ్లే సామర్థ్యాన్ని కలిగివుందని అధికారులు తెలిపారు.

అమెరికా ఆంక్షలపై చైనా నిరసన

బీజింగ్ : ఉ.కొరియాతో అక్రమ ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలతో తమ దేశ సంస్థలపై ఆంక్షలు విధించిన అమెరికాకు చైనా తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ మేరకు తాము అధికారికంగా నిరసన తెలియచేస్తూ అమెరికాకు సమాచారం పంపినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి గెంగ్‌షువాంగ్ మీడియాకు చెప్పారు. చైనా సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఏకపక్షంగా ఆంక్షలు విధించటాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇరుదేశాల మధ్య సహకారానికి విఘాతం కలిగించే ఈ తప్పుడు విధానాలకు వెంటనే తెరదించాలని తాము అమెరికాకు పంపిన లేఖలో కోరినట్లు ఆయన వివరించారు. ఐరాస తీర్మానాలకు వ్యతిరేకంగా చైనా పౌరులను కానీ, కంపెనీలను కానీ తాము ఎన్నడూ అనుమతించబోమని స్పష్టం చేశారు.

అరుదైన కలయిక

దక్షిణకొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్ ముగింపు ఉత్సవాలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరయ్యారు. అంతేకాదు ఒకవైపు అమెరికా ఉత్తర కొరియాపై ఆంక్షలు విధిస్తుండగా ఆ దేశ జనరల్ కిమ్ యంగ్ చాల్‌తో కలిసి ఉభయ కొరియాల మార్చ్ ఫాస్ట్‌ను వీక్షించారు.



ఉభయ కొరియాల స్నేహ స్ఫూర్తి వింటర్ ఒలింపిక్స్

పియాంగ్‌చాంగ్ : దాదాపు రెండు వారాల పాటు అట్టహాసంగా సాగిన శీతాకాలం ఒలింపిక్ క్రీడలు ఆదివారంనాడు ఆనందోత్సాహాల మధ్య వైభవంగా ముగిసాయి. ఉభయ కొరియాల మధ్య ఉద్రిక్తతలకు తెరదించి సౌహార్ద్రపూరిత వాతావరణానికి బాటలు వేసిన ఈ ఒలింపిక్స్ ముగియటంతో వివిధ దేశాల క్రీడాకారులు తమ స్వదేశాలకు పయనమవుతున్నారు. రాజకీయాలతో ప్రారంభమై.. రాజకీయాల మధ్యే ముగిసిన ఈ క్రీడల్లో క్రీడాకారులు అనుపమాన స్థాయిలో ప్రదర్శించిన క్రీడా నైపుణ్యం సందర్శకులను ముగ్ధులను చేసింది. ఈ క్రీడల ప్రారంభానికి ముందు ప్రాంతీయ ప్రత్యర్థులైన ఉభయ కొరియాల మధ్య కొనసాగిన ఉద్రిక్తతలతో చుట్టూ క్రీనీడలు కమ్ముకున్నాయి. అయితే ఉ.కొరియా చూపిన చొరవ, ద.కొరియా, జపాన్, చైనా వంటి దేశాలు చూపిన దౌత్య నీతితో క్రీడలు సజావుగా ముగిసాయి. ఉమ్మడి కొరియా పతాకచ్ఛాయలో పోటీ పడేందుకు ఉభయ కొరియాల క్రీడాకారులను ఒక్కతాటిపైకి తెచ్చే ప్రయత్నంలో చివరి నిముషం వరకూ కుదిరిన పలు ఒప్పందాలతో ఈ క్రీడలు ప్రారంభమయ్యాయి. ప్రారంభవేడుకల్లో ఉభయ కొరియాల క్రీడాకారులు స్టేడియంలోకి ప్రవేశించటాన్ని వీక్షించిన ప్రపంచ దేశాలు హర్షాతిరేకం వ్యక్తం చేశాయి. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని భిన్నాభిప్రాయాలు కలిగిన ప్రముఖులు ఒకే వేదికపై నుండి వీక్షించటం మరో విశేషం. ఇటీవలి వరకూ ఉత్తర, దక్షిణ ధృవాలుగా వున్న ఉభయ కొరియాల నేతలతో పాటు ఉ.కొరియాపై చిటపటలు కురిపించిన అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ పక్కపక్కనే కూర్చుని ఈ కార్యక్రమాన్ని వీక్షించిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు వేడుకలు ఈ వైవిధ్యాన్ని మరోమారు ప్రతిబింబించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక హాజరైన ఈ కార్యక్రమంలో ఉ.కొరియా అధికార వర్కర్స్ పార్టీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడైన కిమ్‌యోంగ్ చోల్ కూడా పాల్గొన్నారు.

తుపాకీ కంపెనీలపై 'ఫ్లోరిడా' బాధితుల సమరభేరి

ఫ్లోరిడా : దేశంలో తుపాకీ సంస్కృతికి తెరదించాలంటూ ఉద్యమిస్తున్న ఫ్లోరిడా హై స్కూల్ కాల్పుల ఘటన బాధిత కుటుంబ సభ్యులు తమ ఉద్యమాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా జాతీయ రైఫిల్ అసోసియేషన్ (ఎన్‌ఆర్‌ఎ)తో వ్యాపార లావాదేవీలు సాగించే కంపెనీలను బహిష్కరించాలని, పర్యాటకులు ఫ్లోరిడా రాష్ట్రాన్ని బహిష్కరించాలని వారు కోరుతున్నారు. ఆయుధాల కొనుగోళ్ల విషయంలో ఎన్‌ఆర్‌ఎ సభ్యులకు రాయితీలు ప్రకటిస్తున్న కంపెనీలను బహిష్కరించాలని చబాయ్‌కాట్ ఎన్‌ఆర్‌ఎ మూమెంట్ పేరిట ట్విట్టర్‌లో ట్వీట్లు వెలువెత్తుతున్నాయి. దీనితో పాటు ఎన్‌ఆర్‌ఎతో సంబంధాలు తెంచుకోవాలని ఆయుధ కంపెనీలను వారు డిమాండ్ చేస్తున్నారు. దీనితో వీరి వత్తిడికి తలొగ్గిన కొన్ని ఆయుధ కంపెనీలు తాము ఎన్‌ఆర్‌ఎతో సంబంధాలను నిలిపివేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. ఎన్‌ఆర్‌ఎ వార్షిక సమావేశాలకు హాజరయ్యే సభ్యులకు తాము ప్రయాణ ఛార్జీల లో ఎటువంటి రాయితీలు ఇవ్వబోమని డెల్టా, యునైటెడ్ వైమానిక సంస్థలు ఇప్పటికే ప్రకటించాయి. తమ కంపెనీలకు సంబంధించిన ప్రస్తావనలను వెబ్‌సైట్ నుండి తొలగించాలని ఈ సంస్థలు ఎన్‌ఆర్‌ఎకు ఇప్పటికే లేఖలు రాశాయి. అదే విధంగా ఎన్‌ఆర్‌ఎ సభ్యులకు తాము ఎటువంటి రాయితీలు ఇవ్వబోమంటూ కార్లను అద్దెకిచ్చే కంపెనీ హెర్జ్, అమెరికాలో అతిపెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఒకటైన ఫస్ట్ నేషనల్ బ్యాంక్ ఆఫ్ ఒమాహా ప్రకటించాయి. దీనితోపాటు తాము ఎన్‌ఆర్‌ఎ సభ్యులెవరికీ తమ కో-బ్రాండెడ్ వీసా కార్డులను రెన్యూ చేయబోమని ఈ బ్యాంకు స్పష్టం చేసింది. ఈ ప్రకటనలపై తీవ్రంగా స్పందించిన ఎన్‌ఆర్‌ఎ ఈ కంపెనీల చర్య సిగ్గుచేటని, రాజకీయ పిరికితనంతో కూడినవని విమర్శించింది. కార్పొరేట్ రాయితీలు కోల్పోయినంత మాత్రాన తమ సభ్యులెవరూ విడిపోరని ఒక ఇమెయిల్‌లో ఎన్‌ఆర్‌ఎ స్పష్టం చేసింది.

తక్కువ పనిగంటలు - ఎక్కువ ఫలితం !

జర్మనీ (ఈదేశం పేరు చెప్పగానే మోడీ, ఆయన భక్తులు పులకరించిపోతారు)లో మెటల్ వర్కర్లు గతనెలలో ఒక సమ్మె చేసి విజయం సాధించారు. 1980 దశకం తర్వాత ఇటువంటి స్థాయిలో సమ్మె జర్మనీలో జరగలేదు. ఆ సమ్మెకు నాయకత్వం వహించిన ఐ.జి. మెటల్ యూనియన్ మేనేజిమెంటుతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం వారానికి ఇప్పుడున్న 35 గంటల పనికాలం బదులు 20 గంటల పనికాలమే ఉంటుంది. రెండేళ్లపాటు ఇలా తక్కువ గంటల పనిదినాలు పాటించాక తిరిగి వారానికి 35 గంటల పని పద్ధతిని అమలు చేస్తారు. పనిగంటలు ఇలా తగ్గించే బదులు జీతాలను సుమారు 7 శాతం పెంచడానికి మేనేజిమెంటు ముందుకొచ్చింది. కాని, యూనియన్ అందుకంగీకరించక పనిగంటల తగ్గింపుకే పట్టుబట్టినిది. ఇంటి దగ్గర ఎక్కువ సమయాన్ని గడపడానికీ ఆ కార్మికులు ప్రాధాన్యతనిస్తున్నారు. పిల్లల సంరక్షణకో, వృద్ధులైన తల్లిదండ్రులను దగ్గరుండి చూసుకోడానికి అధిక సమయం గడపడమే మరింత హెచ్చు జీతాలకన్నా ముఖ్యమని వారంటున్నారు. ఇలా తక్కువ వ్యవధి పనిగంటలుంటే కార్మికులు పనిలో నాణ్యత కూడా



పెరుగుతుందని గత అనుభవాల అధ్యయనం తెలుపుతోంది. 1920 దశకంలో అమెరికాలో ఫ్యాక్టరీలలో జరిగిన ప్రమాదాల తీరును అధ్యయనం చేసిన ఒక నివేదిక కార్మికుల అలసట పెరుగుతున్న కొద్దీ ప్రమాదాలు పెరుగతాయని గమనించింది. ఆరో పనిగంట నుండి ఏదో పనిగంట మధ్య కార్మికులు ఎక్కువగా ప్రమాదాల బారినపడ్డారని ఆ నివేదిక పేర్కొంది. పరిశ్రమల యజమానులు కూడా కాలక్రమేణా పనిగంటల నిడివి తగ్గుతున్న కొద్దీ టెక్నికల్ నైపుణ్యాన్ని పెంచే నూతన, సృజనాత్మక ప్రయత్నాలు పెరుగుతాయని, కార్మికులు అలసటకు లోను గాకుండా ఉంటే వారి ఉత్పాదకత ఎక్కువగా ఉంటుందని గమనించారు.జర్మనీలో సంవత్సరానికి సుమారు 30 రోజులు జీతంలో కూడిన సెలవులు కార్మికులు కుటుంబాలతో విహారానికి పోవడం కోసం అదనంగా ఇస్తారు. ఇప్పుడు ఆ దేశంలో పనికి సంబంధించిన ఇ-మెయిళ్లను సాయంత్రం 6 తర్వాత నిషేధించాలని యోచిస్తున్నారు. అలా అయితే యజమానులు పనివేళల తర్వాత కూడా ఉద్యోగులను వత్తిడికి గురిచేసే వీలు లేకుండా ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. కెనడాలో మొదటి బిడ్డ పుట్టినప్పుడు 54 వారాల ప్రసూతి శలవు ఇస్తున్నారు.

ఇక మన దేశంలోని కార్మికులు పనిగంటల సంగతి చూదాం. యూరపు దేశాలలో వారానికి 35 గంటలు, అమెరికాలో 40 గంటలు, ఆస్ట్రేలియా, బ్రిటన్ దేశాలలో 41 గంటలు, చైనాలో 48 గంటలు ఉంటే భారతదేశంలో 52 గంటలు! అసంఘటిత రంగంలో చాలా చోట్ల 72 గంటలు కూడా ఉంది. మనదేశపు పని సంస్కృతిలో ఎంత ఎక్కువకాలం సీటుకి అతుక్కుని పోయి వుంటే అంత పనిమంతుడైన ఉద్యోగి కింద లెక్క! 1990 దశకం తర్వాత పని గంటలు పెరుగుతూ పోతున్నాయి.

పని సంస్కృతిలో జర్మనీకి, మనకు ఒక తేడా ఉంది. అక్కడ పనిగంటలు తక్కువే. అయితే పనివేళల్లో పూర్తిగా ఆ పనిమీదే ఫోకస్ పెట్టి పని చేస్తారు తప్ప కాలక్షేపం చేయరు. ఇక జీతాలు విషయం చూస్తే జర్మనీలో గంటకు వేతనం 8.84యూరోలు. అంటే రు.700/- వారానికి రు.25,000/- నెలకి రు.లక్ష! అక్కడ ఒక గంటకు ఇచ్చే జీతానికి ఇక్కడ ఒక రోజుకి అయినా ఇవ్వమని మన కార్మిక సంఘాలు పోరాడుతున్నాయన్న మాట!

కేరళలో కనీస వేతనం రోజుకి రు.600/- నిర్ణయించారని ప్రస్తావిస్తే కొందరు అంతంత జీతాలు ఇస్తూ పోతే సంస్థలకు లాభా లెక్కడ నుంచి వస్తాయని అడుగుతుంటూరు. లాభాలు ఉత్పాదకత పెరుగుదల బట్టి ఉంటాయి. సామర్థ్యం, నాణ్యత ఉత్పాదకతలో భాగాలు. ఈ రెండూ కార్మికుల పని గంటలను బట్టి గాక వారు బాగా పనిచెయ్యడం పైన ఆధారపడి వుంటాయి. ఈ కోణం నుంచి చూస్తే జర్మనీలో యజమానులు పనిగంటలు తగ్గింపుకు అంగీకరించడం ఎందుకో అర్థం అవుతుంది.

(ఫీచర్స్ అండ్ పాలిటిక్స్)

కంబోడియాలో ప్రశాంతంగా సెనేట్ ఎన్నికలు

నాంఫెన్ : కంబోడియా సెనేట్‌కు ఆదివారంజరిగిన ఎన్నికల్లో ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్లలెక్కింపును అధికారులు ప్రారంభించారు. ప్రధాని హున్‌సెన్ నేతృత్వంలోని అధికార కంబోడియా పీపుల్స్ పార్టీ (సిపిపి) ఈ ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా వ్యక్తం చేస్తోంది. మొత్తం 62 మంది సభ్యులున్న సెనేట్‌లో 58 మంది సభ్యుల ఎన్నికకు ఆదివారం నాడు ఓటింగ్ జరిగింది. వీరిని ఎన్నుకునేందుకు 123 మంది పార్లమెంట్ సభ్యులతో పాటు దేశ వ్యాప్తంగా వివిధ నగరాలలో వున్న వేలాది మంది కౌన్సిలర్లు ఓటు వేశారు. సెనేట్‌లో మిగిలిన నలుగురు అభ్యర్థులలో రాజు ఇద్దరిని, జాతీయ అసెంబ్లీ మరో ఇద్దరిని నామినేట్ చేస్తాయి. గత నవంబర్‌లో ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కోర్టు జారీ చేసిన ఆదేశాలతో సెనేట్ రద్దయిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో దాదాపు సగం మందికి పైగా కౌన్సిలర్ల ఓటు హక్కు తొలగించారని హక్కుల బృందాలు గగ్గోలుపెడుతున్నాయి. అధికార పక్షం అప్రజాస్వామికంగా వ్యవహరించిందని ప్రతిపక్ష కంబోడియా నేషనల్ రెస్క్యూ పార్టీ (సిఎన్‌ఆర్‌పి) విమర్శలు గుప్పిస్తోంది. ఈ ఓట్ల తొలగింపుతో ప్రతిపక్షాల విజయావకాశాలు నామమాత్రంగా మారాయని, ప్రతిపక్షం లేకపోవటంతో ఈ ఎన్నికలు గతం కన్నా భిన్నంగా వుంటాయని అధికార కంబోడియా పీపుల్స్ పార్టీ కౌన్సిలర్ ఒకరు వ్యాఖ్యానించారు. ఇది కేవలం తమ పార్టీకి మాత్రమే కాక దేశానికి కూడా మంచిదని అన్నారు.

సిరియాలో కాల్పుల విరమణకు ఐరాస ఆదేశం

ఐక్యరాజ్యసమితి : అంతర్యుద్ధం కారణంగా ఇక్కట్ల పాలవుతున్న ప్రజలను ఆదుకునేందుకు వీలుగా 30 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలంటూ సిరియాలో ప్రభుత్వ, తిరుగుబాటు వర్గాలను ఐక్యరాజ్యసమితి ఆదేశించింది. ఈ తీర్మానాన్ని ప్రతిపాదించిన ఎన్నికైన శాశ్వత సభ్యులు (ఇ10) బృందం మిగిలిన ఐదుగురు శాశ్వత సభ్యులపై వత్తిడి తెచ్చి ఏకగ్రీవంగా ఆమోదించేందుకు మార్గం సుగమం చేశారు. దీనితో సిరియాలో ఎటువంటిజాప్యమూ లేకుండా ఉభయ వర్గాలూ కాల్పు విరమణను పాటించాలని కోరుతున్న ఈ తీర్మానానికి మండలి ఏకగ్రవ ఆమోదం లభించింది. ఈ ప్రతిపాదనలపై దాదాపు రెండు రోజుల పాటు వాయిదాల పర్వం కొనసాగిన తరువాత కువైట్, స్వీడన్ వంటి దేశాల మద్దతుతో పి10 సభ్యదేశాల ప్రతినిధులు చర్చలుజరపటంతో రష్యాతో పాటు బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలు దీనికి అంగీకరించాయి. తీర్మానం మండలి ఆమోదం పొందిన అనంతరం అధ్యక్ష స్థానంలో ఉన్న కువైట్ ప్రతినిధి మన్సూర్ అయ్యాద్ అల్ ఒతైబీ మీడియాతో మాట్లాడుతూ 'మండలి ఈ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించటంతో ఏడేళ్ల ఈ ఘర్షణలకు తెరదించిన రాజకీయ పరిష్కార సాధనకు మార్గం సుగమమవుతుందని ఆశిస్తున్నామ'ని అన్నారు. దేశవ్యాప్తంగా కాల్పుల విరమణకు పిలుపునిచ్చిన ఈ తీర్మానం దేశంపై విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేయాలని, వైద్య, సహాయక బృందాలు స్వేచ్ఛగా సంచరించేందుకు అవకాశం కల్పించాలని, ఐరాస, ఇతర భాగస్వామ్య దేశాల సహాయ బృందాలను అనుమతించాలని సూచించింది.

మొదటి పేజీ తరువాయి

సైబర్ నేరాలపై ఫిర్యాదులకు హైదరాబాద్ వెళ్లాల్సిందేనా?

విశాఖలో అదే వ్యక్తిపై కేసును సాధారణ పోలీసులే స్వీకరించాల్సి వచ్చింది. ఇలాంటి వాటికి సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా బాధితులకు వివిధ ప్రాంతాల్లో సైబర్ క్రైమ్ పిఎస్‌లు అందుబాటులో ఉండాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి. ప్రస్తుత రోజుల్లో సామాజిక మాధ్యమాల్లో కొన్ని అభ్యంతరకరమైన పోస్టులు, వీడియోలు హల్‌చల్ చేస్తున్నాయి. వాటిలో కొన్ని వ్యక్తిగతంగా కొందరిని టార్గెట్ చేసుకుని బెదిరించేందుకు, కించపరిచేందుకు వినియోగిస్తుంటే మరికొన్ని వీడియోలు సమాజం పై ప్రభావం చూపేవిగా ఉంటున్నాయి. ఎక్కువ మంది వాటి బారిన పడి మోసపోయి, ఆర్థికంగా, కుటుంబపరంగా ఇబ్బందులు పడుతున్న వారూ ఉన్నారు. కానీ ఎపిలో సైబర్ క్రైమ్ పిఎస్ లేదు. ఫిర్యాదు చేయాల్సివస్తే హైదరాబాద్‌కు వెళ్ళాల్సిందే. మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటర్నెట్ అందుబాటులోకి తీసుకువస్తామంటున్న ప్రభుత్వం సైబర్ నేరగాళ్లను అదుపులోకి తీసుకునేందుకు మాత్రం దృష్టి పెట్టడంలేదని మహిళా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. జిల్లాకో సైబర్ క్రైమ్ పిఎస్ ఉండాలని, సైబర్ నేరాలను నమోదు చేసుకుని, చర్యలు తీసుకునేలా పటిష్టమైన సైబర్ వ్యవస్థ ఉండాలని వారభిప్రాయపడుతున్నారు. గ్రామాల వారు సైతం ఫిర్యాదు చేసేందుకు వీలుగా సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్, టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

మహిళల నేతృత్వంలో దేశాభివృద్ధి

సహాయక బృందాలను, సొసైటీలను ఏర్పాటు చేసి దీని పూర్తి ప్రయోజనాలు పొందాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు 70 సంవత్సరాల తరువాత ఇటీవలే నావి ముంబయికి సమీపంలోని ఎలిఫెంటా ఐలండ్‌లో మూడు గ్రామాలు విద్యుత్ పొందడాన్ని మోడి ప్రస్తావించారు. కేవలం విద్యుత్‌ను గురించి మాత్రమే తానీ అంశాన్ని ప్రస్తావించలేదనని అభివృద్ధి దశలో కొత్త ప్రారంభం గురించి ప్రస్తావించానని తెలిపారు. ప్రజలకు హోళి శుభాకాంక్షలు చెబుతూ తన ప్రసంగాన్ని ముగించారు.

బయట తెగడ్తలు - లోపల పొగడ్తలు

కీలకపాత్ర పోషించుకునేటట్టుగా చెప్పుకునే ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా కేంద్ర పథకాలను రాష్ట్రం ఎలా వినియోగించుకోవాలో చెప్పడానికే పరిమితమయ్యారు. తెలుగుదేశం పార్టీకే చెందిన కేంద్ర మంత్రి అశోక్‌గజపతి రాజు కూడా ఇదే విధంగా స్పందించారు. మీడియా ప్రతినిధులు ఆయన్ను రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళన గురించి ప్రశ్నించినప్పటికీ ఆయన దాటవేత వైఖరిని అవలంభించారు. మొత్తం మీద ఉపరాష్ట్రపతి, కేంద్ర మంత్రుల ముందు రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై తమ గళం వినిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న అభిప్రాయాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. అదేసమయంలో టిడిపి, బిజెపిల మధ్య మైత్రి బంధం ఏ మాత్రం సడలలేదని, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కనుగుణంగా రెండు పార్టీల నాయకులు వ్యవహరిస్తున్నారన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది.

మార్కాపురంలో ఉద్రిక్తత

భారీగా మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఆదివారం ఉద్రిక్తత పరిస్థితులేర్పడ్డాయి. ఓ కరపత్రం పంపిణీ చేస్తున్న పాస్టర్‌ను బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు దాడిచేయడాన్ని నిరసిస్తూ ఆదివారం ప్రదర్శన నిర్వహించి డిఎస్‌పి రామాంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనకు సిపిఎం మార్కాపురం ప్రాంతీయ కార్యదర్శి డి.సోమయ్య, నాయకులు డి.కె.ఎం.రఫి, ఐద్వా డివిజన్ కార్యదర్శి కె.కళావతి, కె.వి.పి.ఎస్ డివిజన్ కార్యదర్శి జవ్వాజి రాజు మద్దతుగా పాల్గొన్నారు. మైనార్టీలపై దాడి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.బిజెపి ఆర్‌ఎస్‌ఎస్‌కి సంబంధించిన వారు కూడా శనివారం రాత్రే పాస్టరుపై ఫిర్యాదు చేయగా, పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో ముందు జాగ్రత్తగా సెక్షన్ 30ని అమలులో ఉంచి పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు డిఎస్‌పి చెప్పారు. ప్రజలు సోదర భావంతో మెలుగుతున్న తరుణంలో మతాల మధ్య చిచ్చు పెడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని, మత సామరస్యానికి విఘాతం కలగకుండా చూడాలని ప్రజాస్వామ్య వాదులు పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండో రోజు 1.74 లక్షల కోట్ల పెట్టుబడులు

- **285 ఎంఒయులు- 2,86,371 మందికి ఉద్యోగాలు**
- **రెండు రోజులూ కలిపి 364 ఎంఒయులు**
- **పెట్టుబడులు రూ.రెండు లక్షల 18వేల 814 కోట్లు**
- **సిఐఐ సదస్సులో సిఎం చంద్రబాబు**



సిఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి సురేష్‌ప్రభు సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

సిఐఐ భాగస్వామ్య సదస్సులో రెండో రోజైన ఆదివారం రూ.లక్షా 74వేల 568 కోట్ల విలువైన 285 ఎంఒయులు జరిగాయి. రెండు లక్షల 86వేల 371 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మొత్తం రెండు రోజులకూ 364 ఎంఒయులు, రూ.రెండు లక్షల 18వేల 814 కోట్ల పెట్టుబడులు. 3లక్షల 84వేల 662 మందికి ఉద్యోగాలు రానున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని తిరుపతిలో ఒక మిలియన్ సెల్ ఫోన్ల ఉత్పత్తికి జియో అధినేత ముఖేష్ అంబానీ అంగీకరించినట్లు తెలిపారు. హార్డ్‌వేర్ యూనిట్, నాలెడ్జ్ ఎకానమీని ఏర్పాటు చేసుకోవడానికి జియో భారీస్థాయిలో ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందన్నారు. రూ.50వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు జియో సంస్థ తరపున సిఐఐ సదస్సుల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ప్రసాద్, కిరణ్ వెల్లడించారన్నారు. రాబోయే రోజుల్లో 20వేల ఉద్యోగాలు జియో సృష్టించబోతుందన్నారు.

ఎంఒయుల వివరాలు

రెండో రోజు జరిగిన ఒప్పందాల్లో ఎనిమిది రంగాలకు చెందిన ఒప్పందాలు జరిగాయి. ఏరోస్పేస్ డిఫెన్స్ రంగంలో రూ.9,406కోట్లు విలువైన 10 ఒప్పందాలు, 6వేల మందికి ఉపాధి, టెక్స్‌టైల్స్ రంగంలో రూ.5,337కోట్లు, 26 ఎంఒయులు, 33వేల మందికి ఉద్యోగాలు. ఇంధన రంగంలో రూ.80,435 కోట్ల విలువైన 20 ఒప్పందాలు, 49వేల మందికి ఉద్యోగాలు. వైద్య ఆరోగ్యరంగంలో రూ.5,090 కోట్లతో 25 ఒప్పందాలు, 4,750 మందికి ఉద్యోగాలు. ఆహారశుద్ధి రంగంలో 3,534కోట్లతో 169 ఎంఒయులు, 49వేల మందికి ఉద్యోగాలు. మౌలిక వసతుల రంగంలో రూ.43,486 కోట్లతో 15 ఒప్పందాలు, లక్షా 12వేల 20 మందికి ఉద్యోగాలు. ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ రంగంలో రూ.18,220 కోట్ల విలువైన రెండు ఒప్పందాలు, 38వేల మందికి ఉద్యోగాలు. పరిశ్రమల రంగంలో రూ.9,061కోట్లు పెట్టుబడులతో 19 ఒప్పందాలు, 19,100 మందికి ఉద్యోగాలు లభించనున్నట్లు చంద్రబాబు ప్రకటించారు.

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎ.అమర్‌నాథ్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ఎక్కడ సదస్సులు పెట్టినా 7 నుంచి 15శాతమే అమల్లోకి వస్తుండగా, ఎపిలో మాత్రం 30 నుంచి 40 శాతం ఎంఒయులు ఆచరణలోకి వస్తున్నాయన్నారు. సిఐఐ సదస్సు కోసం కేంద్రం నిధులు ఇస్తుందని విశాఖ బిజెపి ఎంపీ కంభంపాటి హరిబాబు చెప్పడంలో అర్థం లేదంటూ ఎద్దేవా చేశారు. ప్రభుత్వం, డిపిఐసి (జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కౌన్సిల్) సంయుక్తంగా సిఐఐ సదస్సులకు నిధులు ఖర్చుచేస్తుంటే కేంద్రం ఇస్తుందంటూ బుకాయించడం తగదని హితవు పలికారు.

వెలవెలబోయిన రెండోరోజు సదస్సు

రెండోరోజు ఆదివారం ప్రారంభమైన సిఐఐ సదస్సు మధ్యాహ్నం వరకూ కాస్త ప్రతినిధులు కనిపించినా ఆ తర్వాత మాత్రం సభా అంతా ఖాళీ అయిపోయింది. చంద్రబాబు జియో సెల్‌ఫోన్ కంపెనీ ప్రతినిధులతో సెషన్ నిర్వహించినప్పుడు మాత్రమే ప్రతినిధులు కనిపించారు. ఆయన వెళ్లిపోయాక హాల్ అంతా తేలిపోయింది.. జనం లేక సెషన్స్ నిర్వాహకులు అవస్థలు పడ్డారు. ఆదివారం మధ్యాహ్నం భోజనాల సందర్భంగా కూడా ప్రతినిధులకు భోజనాలు లభించక అవస్థలు పడ్డారు. భోజనాల కోసం హాలు బయట రోడ్డుపై ఎండలో ప్రతినిధులు బారులు తీరడం కనిపించింది.

విద్యుత్ కార్మికుల సమస్యల్ని పరిష్కరించకపోతే ప్రత్యక్ష కార్యాచరణ

రాజకీయ పార్టీల ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని వామపక్షాలు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, కాంగ్రెస్, జనసేన ప్రకటించాయి. ఆదివారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ నాయకులు వెల్లంపల్లి శ్రీనివాస్, జనసేన నాయకులు పోతిన మహేష్, సిపిఐఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పొలారి, రామారావు, లిబరేషన్ నాయకులు హరినాథ్, ఎంసిపిఐయు నాయకులు గొల్లపూడి ప్రసాదు, ఫార్వార్డ్‌బ్లాక్ నాయకులు పి.వి.సుందరరామరాజు, సిపిఐఎంఎల్ నాయకులు గుర్రం విజయకుమార్, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు మాట్లాడారు. విద్యుత్ కార్మికుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. తమ సమస్యల్ని పరిష్కరించాలని జనవరిలో కార్మికులందరూ సిఎంను కలిస్తే 20 రోజుల సమయం కావాలని కోరారని, ఇప్పటి వరకూ పరిష్కరించలేదని తెలిపారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో సుమారు 24 వేలమంది కార్మికులు ఫిబ్రవరి 20 నుండి సమ్మెలోకి దిగారని తెలిపారు. సిఎం ఇచ్చిన వాగ్దానాల్ని మాత్రం నెరవేర్చలేదని పేర్కొన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం దానికి కారణమైన కార్మికులకు మాత్రం న్యాయబద్ధంగా వేతనం ఇవ్వడం లేదని తెలిపారు. కాంట్రాక్టు పేరుతో కార్మికులకు ఇస్తున్న జీతంలో 43 శాతం కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్నారని, అదే నేరుగా కార్మికులకు చెల్లిస్తే వచ్చే నష్టం ఏమిటని ప్రశ్నించారు. ఇంతవరకు రాష్ట్రంలో కనీస వేతనాల బోర్డును ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల్ని కాలరాస్తున్నారని, ప్రపంచంలో ఎక్కడా లేని సిద్ధాంతాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నారని, కొత్తకొత్త చట్టాల్ని ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు సమానపనికి సమాన వేతనాన్ని అమలు చేయాలని ఆదేశాలిచ్చినా ఎక్కడా అమలు చేయడం లేదని తెలిపారు. ఇటీవల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్ కలిసి విన్నవించారని, సమస్యను పరిష్కరిస్తామని చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న కిమిడి కళా వెంకట్రావుకు విద్యుత్‌శాఖపై ఏ మాత్రమూ పట్టులేదన్నారు. ముఖ్యమంత్రి అన్నీ తానై చేస్తున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రసుత్తం సిఐఐ సదస్సులు నిర్వహిస్తున్న విశాఖపట్నం నగరం హుద్‌హుద్ తుఫానులో దెబ్బతింటే ఇదే విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ప్రాణాలకు తెగించి మరీ పనులు చేసి, రెండు రోజుల్లో విద్యుత్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించారని పేర్కొన్నారు. వారివల్లే అది సాధ్యమైందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. తెలంగాణా ప్రభుత్వం విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల్ని రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రకటించిందని, ఇక్కడ ఉందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కేవలం వ్యాపార ధృక్పథంతో టిడిపి పనిచేస్తే సహించేది లేదన్నారు.

ప్రభుత్వ చర్యలతో కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ముందు నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించకపోతే రాజకీయపక్షాలుగా ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో పి మధు, రామకృష్ణ

బిజెపిది దొంగనాటకం

వెనుకబడిన తెలంగాణా, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని చెప్పి ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున ఏడు జిల్లాలకు రెండేళ్లపాటు నిధులిచ్చి చేతులు దులిపేసుకుందని, ఇప్పుడు రాయలసీమ డిక్లరేషన్ పేరుతో దొంగ నాటకాలాడుతోందని, ఇదే పద్ధతి కొనసాగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. విభజన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు డిక్లరేషన్ పేరుతో దొంగనాటకానికి తెరతీసిందన్నారు. చేయాల్సిన విషయాన్ని పక్కనపెట్టి, ప్రజలను మోసం చేస్తున్నాయని, బిజెపి అసలు రంగును ప్రజలు గుర్తించాలని అన్నారు. రాయలసీమలో న్యాయవాదుల ఆందోళనపై ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు.

భూ కబ్జాలో ప్రమేయమున్నట్లు నిరూపిస్తే

రాజకీయ సన్యాసం

ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

భూ కబ్జా వ్యవహారాల్లో తనకుగానీ, తన కుటుంబ సభ్యులకుగానీ ప్రమేయం లేదని, ఉన్నట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. టిడిపి సభ్యులు, కార్యకర్తలు ఎవరు తప్పు చేసినా తనకు ఆపాదించడం సరికాదన్నారు. ఆదివారం విజయవాడ కేశినేని భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భూ కబ్జా వ్యవహారాల్లో తనపై వచ్చిన ఆరోపణలపై మాట్లాడారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జెసిలను కోరానని తెలిపారు. 75 సెంట్ల స్థలాన్ని అబ్దుల్ మస్తాన్ అనే వ్యక్తి వద్ద మధ్యవర్తుల ద్వారా సైట్ డెవలప్‌మెంట్ రిజిస్టర్ అగ్రిమెంట్ చేసుకున్నామన్నారు. అయితే ఆ స్థలం కోర్టు వివాదంలో ఉన్నట్లు తెలుసుకుని అగ్రిమెంట్‌ను ఉపసంహరించుకున్నామన్నారు. రద్దయిన ఒప్పందాన్ని ఆసరా చేసుకునే సిబిసిఐడి కేసు నమోదు చేసిందన్నారు. హైకోర్టులో వాస్తవాలు వివరిస్తూ రిట్ పిటీషన్ దాఖలు చేయడంతో విచారణపై కోర్టు స్టే విధించిందన్నారు. పెనమలూరులో సైట్ డెవలప్‌మెంట్ వివాదం, న్యూ రాజరాజేశ్వరిపేటకు సంబంధించి దారి ఆక్రమించి గోడ నిర్మించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాగంటి బాబు వ్యవహారంతో తనకు సంబంధం లేదన్నారు. ఈ సమావేశంలో టిడిపి అర్బన్ అధ్యక్షులు, శాసన మండలి విప్ బుద్ధా వెంకన్న, టిడిపి అర్బన్ ప్రధాన కార్యదర్శి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొన్నారు.

ఎప్పటికీ అతిలోక సుందరే








సినీ కలల ప్రపంచంలో అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ అందానికి ఆమె కేరాఫ్...తరాలు గడిచినా ప్రేక్షకులకు ఆమె ఆకాశం నుంచి దిగొచ్చిన దేవకన్యే. ఐదు దశాబ్దాల పాటు సినీ ప్రపంచంలో అతిలోకసుందరిగానే వెలిగింది. నాలుగేళ్ల ప్రాయం నుంచి అంతిమ శ్వాస వరకూ నటన ఆమె ఆరోప్రాణంగా బతికింది...ఆ సిరిమల్లె పువ్వే శ్రీదేవి. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు అన్ని రాష్ట్రాలకు పరిచితమైన నట విదుషీమణి ఆమె. నాలుగేళ్లప్పుడు చేసిన ముద్దుబొద్దు పాత్రైనా మొన్నటి 'మామ్' క్యారెక్టర్ అయినా తాను మాత్రమే చేయగలదు అని నిరూపించింది. అకస్మాత్తుగా ఎవరికీ తెలియకుండా గుండెపోటు అనే బూచాడు వచ్చి ఈ 54 ఏళ్ల కూనను ఓ బుల్లిపెట్టెలో పెట్టి దూరంగా తీసుకెళ్లిపోయాడు. ఈ అందాల దేవత ఇక లేదన్న వార్త సినీప్రియులను కన్నీరుపెట్టించింది. తమలో ఒకరిని కోల్పోయామనే దిగ్భ్రాంతికి గురి చేసింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ నుంచి బాలీవుడ్ వరకూ అన్ని చోట్లా ఓ వెలుగు వెలిగిన శ్రీదేవి బాలనటి నుంచి 'మామ్' వరకూ 300 చిత్రాల్లో నటించింది.

శ్రీదేవిని మించిన నాయికలు చాలా మంది వుండొచ్చు కానీ నాలుగేళ్ల ప్రాయం నుండి తుది శ్వాస వరకూ నటనే ప్రాణంగా బతికారామె. విశేషమేంటంటే ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి వారితో హీరోయిన్‌గా చేసిన శ్రీదేవి వాళ్ల పిల్లలు నాగార్జున, బాలకృష్ణలతో కూడా నటించారు. 'పదహారేళ్ల వయసు' చిత్రంలో 'సిరిమల్లె పువ్వా సిరిమల్లె పువ్వా' అంటూ శ్రీదేవి ఊగిన ఊయల ఇప్పటికీ అందరికీ గుర్తే. ఈడొచ్చిన ఆడపిల్లలంతా ఆ పాట పాడుకుంటూ శ్రీదేవినే ఊహించుకునేవారు. కుర్రాళ్లకు ఆమె అందాల దేవతే. ఏ అమ్మాయిని వర్ణించాలన్నా 'శ్రీదేవిలా ఉందిరా' అనేవారు.

బోనీ కపూర్‌తో వివాహమయ్యాక ఆమె కొంతకాలం సినిమాలకు దూరమవడంతో అభిమానులు నిరాశ చెందారు. ఆ తరువాత 2012లో వచ్చిన 'ఇంగ్లిష్ వింగ్లిష్' చిత్రంతో సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు. 2017లో వచ్చిన 'మామ్' చిత్రం ఆమె నటించిన అద్భుత చిత్రాల్లో ఒకటి అని చెప్పాలి. ఈ సినిమాలో అమ్మ అంటే శ్రీదేవిలా ఉండాలి అన్నంతగా పాత్రలో లీనమై నటించారు.

ఆ తరువాత మంచి కథలు వస్తే తప్పకుండా నటిస్తానని శ్రీదేవి చాలా సందర్భాల్లో చెప్పారు. ఇప్పుడు ఆమె పెద్ద కూతురు జాన్వి కపూర్ సినిమాల్లోకి రాబోతున్నారు. 'ధడక్' చిత్రంతో జాన్వి ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నారు. శరవేగంగా ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. శ్రీదేవి తన కుమార్తె వద్దే సెట్స్‌లో ఉంటూ అన్నీ దగ్గరుండి చూసుకునేవారు. షారుక్ ఖాన్ నటిస్తున్న 'జీరో' చిత్రంలో శ్రీదేవి అతిథి పాత్రలో నటించాల్సి ఉంది. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో షారుక్ మరుగుజ్జు పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ నచ్చడంతో శ్రీదేవి తన పాత్రలోనే నటిస్తానని చెప్పారట. ఇంతలో శ్రీదేవి ఇలా హఠాత్తుగా మరణించడం హాలీవుడ్‌ను విచారంలోకి నెట్టింది.

చిన్నప్పటి నుంచీ నటనే


'క్షణక్షణం'లో వెంకటేష్, శ్రీదేవి

శ్రీదేవి తన నటనా జీవితాన్ని బాల నటిగా నాలుగేళ్ల ప్రాయంలోనే ప్రారంభించింది. 'కన్దన్ కరుణాయ్' (1967) అనే తమిళ చిత్రంతో కెరీర్‌ను మొదలు పెట్టింది. కానీ 'తునైవాన్'తోనే గుర్తింపు వచ్చింది. అందుకే అదే ఆమె మొదటి చిత్రంగా చెబుతారు. శ్రీదేవి తెలుగు 80 సినిమాలకు పైగా చేశారు. అందులో కృష్ణతోనే 31 సినిమాలు చేయడం విశేషం. ఆమె తెలుగు సినిమాలు చేసినా మొదట్లో ఎక్కువగా తమిళం, మలయాళం చిత్రాలలో నటించిది. ఆమె నటించిన మలయాళం చిత్రాలకు ఎక్కువగా ఐ.వి. శశి దర్శకత్వం వహించారు. శ్రీదేవి నటించిన మలయాళ చిత్రాల్లో 'ఆద్యపాదం', 'ఆలింగనము', 'కుట్టవుమ్ శిక్షయుమ్', 'ఆ నిమషం' తదితర చిత్రాలు చెప్పుకోదగినవి. 1976లో బాలచందర్ దర్శకత్వంలో చేసిన చిత్రం 'మూండ్రు ముదచ్చు'లో కమల్ హాసన్, రజనీ కాంత్‌లతో కలిసి నటించి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆ చిత్రం తమిళ చలన చిత్ర సీమకి పెద్ద గుర్తింపు తెచ్చింది. ఈ చిత్రం రజనీకాంత్ సినీ జీవితంలో ఒక మైలురాయి. 'మూండ్రు ముడిచ్చు' తరువాత శ్రీదేవి మరిన్ని విజయవంతమైన చిత్రాలలో వీరితో (కమల్ హాసన్, రజనీ కాంత్) కలిసి నటించారు. తమిళ చిత్రసీమలో ఎక్కువ కాలం అగ్రకథానాయికగా వెలిగిన శ్రీదేవి, కమల్ హాసన్‌తో మొత్తం 27 సినిమాల్లో నటించింది. వాటిల్లో 'గురు', 'శంకర్ లాల్,' 'సిగప్పు రోజక్కల్' 'తాయుళ్లమాల్ నానిల్లై' , 'మీండుం కోకిల', 'వాజ్వే మాయం', 'వరుమైయిన్ సిగప్పు', 'నీలా మలార్గల్', 'మూండ్రం పిరై', '16 వయత్తినిలే', ఆఖరి పోరాటం, అందగాడు, ఆకలి రాజ్యం, కల్యాణం రామన్ ముఖ్యమైనవి. రజనీ కాంత్‌తో 'ధర్మయుద్ధం', 'ప్రియ', 'పొక్కిరి రాజా', 'టక్కర్ రాజా', 'అడుతా వారిసు', 'నాన్ అడిమై ఇల్లై' మొదలగు చిత్రాలలో నటించింది.


భర్త బోనీకపూర్, కుమార్తె జహ్నవి, ఖుషితో శ్రీదేవి


'ఇంగ్లిష్ వింగ్లిష్'లో శ్రీదేవి

శివకాశీలో పుట్టి దుబాయ్‌లో నేలకొరిగి



శ్రీదేవి ఆగస్టు 13వ తేది 1963లో శివకాశి (తమిళనాడు రాష్ట్రం)లో జన్మించింది. చిన్నప్పుడే ముఖానికి రంగేసుకుంది. నాలుగేళ్ల ప్రాయంలోనే ఎం.ఎ తిరుముగమ్ దర్శకత్వంలో 'తునైవాన్'(1969)అనే భక్తిరస చిత్రంతో సినీరంగ ప్రవేశం చేసింది. అంచెలంచెలుగా ఎదిగింది. తమిళ, తెలుగు చిత్రసీమల్లో 80, 90 దశకాల్లో అగ్రకథానాయికగా వెలిగింది. 90 దశకంలో అత్యధిక పారితోషికం తీసుకున్న కథానాయిక ఈమె. అందం, అభినయం, నటన ఆమెను అగ్రకథానాయికగా నిలిపింది.

చిన్న నాటి శ్రీదేవి

శ్రీదేవి తండ్రి అయ్యప్పన్ న్యాయవాది. తల్లి రాజేశ్వరి. సోదరి శ్రీలత, సోదరుడు సతీష్ ఉన్నారు. శ్రీదేవికి అన్నీ తానై నడిపించిన అమ్మ రాజేశ్వరి అంటే ఆమెకెంతో ఇష్టం. హిందీ సినీ నిర్మాత, ఆమెతో కలిసి ఎన్నో సినిమాలలో నటించిన హీరో అనిల్ కపూర్ సోదరుడు అయిన బోనీకపూర్‌ను 1996 జూన్ 2న శ్రీదేవిని వివాహం చేసుకున్నారు.

ఆఖరి ట్వీట్ ఇదే...

తోటి నటీనటులను, ఇతర సినిమాలను ప్రోత్సహించడంలో శ్రీదేవి ఎప్పుడూ ముందుంటారు. తమిళంలో నటి ధన్సిక ప్రధాన పాత్రలో 'కాతడి' అనే చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవల చిత్ర ట్రైలర్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ట్రైలర్ చాలా అద్భుతంగా ఉందంటూ శ్రీదేవి ట్వీట్ చేశారు. చిత్ర బ ందానికి విషెస్ తెలిపారు. ఈ ట్వీట్ పెడుతున్నప్పుడు శ్రీదేవి దుబాయ్‌లో ఉన్నారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఇలాంటి ఓ మంచి సినిమాను అభినందించాలి అన్న ఆలోచనను బట్టే అర్థమవుతోంది శ్రీదేవిది ఎంత గొప్ప మనసో. దురద ష్టవశాత్తూ ఆమె చేసిన ఆఖరి ట్వీట్ కూడా ఇదే.

తెలుగు వారితో ఎనలేని అనుబంధం

శ్రీదేవికి, తెలుగు చిత్రపరిశ్రమకు ఎనలేని అనుబంధం ఉంది. రెండు తరాల హీరోలతో నటించి మెప్పిచింది. కథానాయిక అంటే తనే అనేటట్టు చేసింది. తెలుగులో సుమారుగా 80 చిత్రాలకు పైగా నటించింది. శోభన్ బాబు, ఎన్టీఆర్, కృష్ణ, ఏఎన్నార్ నుంచి రెండో తరం వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ వంటి వారితోనూ చేసి మెప్పించింది. తండ్రీ కొడులతో కథానాయిక చేసిన ప్రత్యేకత శ్రీదేవి సొంతం.

ఎక్కువగా రాఘవేంద్ర దర్శకత్వంలో సినిమాలు చేసింది. అన్నికంటే ఆమెకు ఓ నటిగా గుర్తింపు తెచ్చిన సినిమాలు చాలా ఉన్నా 'పదహారేళ్ల వయసు' చిత్రం అనే చెప్పాలి. 'సిరిమల్లెపువ్వ సిరిమల్లెపువ్వ'.. అంటూ ఊయలు ఊగుతూ సాగే పాటలో ఆమె వయసుకు తగ్గట్టే హావభావాలు పలికించడంతో తనకు తానే సాటి అనిపించింది. అందుకే ఆ పాత్ర అందరి మదిలో ముద్రించుకుపోయింది. మిగిలిన సినిమాలు ఇంతకంటే గొప్పగా ఆడినా, బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లు తెచ్చిపెట్టినా ఇది మొదట గుర్తింపు తెచ్చిందనే చెప్పాలి. చిరంజీవితో చేసిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి', వెంకటేష్ నటించిన 'క్షణం క్షణం' మంచి గుర్తింపునిచ్చాయి. 'జగదేకవీరుడు అతిలోక సుందరి'లో ఆమె చేసిన పాత్రే ఇప్పటికీ అందరికీ గుర్తిండిపోయింది.

ఎన్.టి.రామారావుతో 'కొండవీటి సింహం', 'వేటగాడు', 'సర్దార్ పాపారాయుడు', 'బొబ్బిలిపులి' వంటి హిట్ చిత్రాల్లో నటించింది. అక్కినేని నాగేశ్వరరావుతో ప్రేమాభిషేకం, 'ముద్దుల కొడుకు', 'బంగారు కానుక', 'ప్రేమకానుక తదితర సినిమాల్లో మెప్పించింది. తెలుగులో ఎక్కువ సినిమాలు కృష్ణతోనే చేసింది. ఆమె చేసిన 80 చిత్రాల్లో 31 చిత్రాలు కృష్ణ హీరోగా చేసినవే. వాటిల్లో 'కంచుకాగడా', 'కలవారి సంసారం', 'కృష్ణావతారం', 'బుర్రిపాలెం బుల్లోడు' మొదలైనవి హిట్ చిత్రాలు. తమిళంలో కమల్ హాసన్, తెలుగులో కృష్ణతోనే ఎక్కువ సినిమాల్లో నటించింది శ్రీదేవి. నాగార్జుతో 'ఆఖరి పోరాటం', 'గోవింద గోవింద', వెంకటేష్‌తో 'క్షణక్షణం'చేసింది. ఈ సినిమాకు నంది అవార్డు కూడా వరించింది.

బాలీవుడ్‌లోనూ అగ్రకథానాయికే



శ్రీదేవి దక్షిణాది భాషల్లోనే కాకుండా బాలీవుడ్‌లో కూడా అగ్రకథానాయికగా ఎదిగింది. అప్పట్లో బాలీవుడ్‌లో అత్యధిక పారితోషికం తీసుకున్న కథానాయిక కూడా శ్రీదేవే కావడం విశేషం. మొదట్లో ఆమె ఎక్కువ చిత్రాలు జితేంద్రతోనే నటించారు. వాటిలో అధిక శాతం తెలుగు నుండి రీమేక్ చేసిన చిత్రాలే. అవన్నీ ముఖ్యంగా కె. రాఘవేంద్ర రావు, కె.బాపయ్య దర్శకత్వం వహించినవే. 1978లో శ్రీదేవి చేసిన మొదటి హిందీ చిత్రం 'సోల్వా సావన్'. అమోల్ పాలేకర్‌తో కలిసి నటించింది. ఆ చిత్రం విజయవంతం కాలేదు. కానీ జితేంద్రతో కలిసి నటించిన తదుపరి చిత్రం 'హిమ్మత్వాలా' మంచి విజయం సాధించింది. ఆ చిత్రంతో శ్రీదేవిని ఉత్తర భారతదేశంలో తండర్ హైగా పిలిచారు. ఆ ఒక్క చిత్రంతో ఆమె హిందీ చిత్రరంగంలో పెద్దస్టార్‌గా ఎదిగిపోయింది. ఆ తర్వాత చేసిన 'సద్మ' చిత్రంలో ఆమె కెరీర్‌నే మార్చేసింది. 1980 లలో ఆమె ఎన్నో విజయవంతమైన చిత్రాలలో నటించారు. వాటిలో 'నగీన', 'మిస్టర్ ఇండియా', 'చాందిని', 'చాల్ బాజ్' తదితర చిత్రాలు. 'చాల్ బాజ్' చిత్రానికి గానూ శ్రీదేవికి మొదటి ఫిల్మ్ ఫేర్ పురస్కారం లభించింది. 'మిస్టర్ ఇండియా'లో శ్రీదేవి చేసిన నటనను విమర్శకులు సైతం ప్రశంసించారు. ఆ సినిమాతోనే ఆమెకు బాలీవుడ్‌లో 'మిస్ హవ హవాయి' అని పేరు వచ్చింది. 'చాందిని' చిత్రం ఆమె సినీ జీవితంలో మరో మైలురాయిగా చెప్పుకోవచ్చు. యాష్ చోప్రా ఆమెతో 'చాందిని' తరువాత 'లమ్హే' (1991) చిత్రాన్ని రూపొందించారు. ఈ చిత్రానికి గానూ ఆమె రెండో ఫిల్మ్ ఫేర్, అంతర్జాతీయ ఉత్తమ నటిగా పురస్కారాలు అందుకుంది. 'ఖుదా గవా', 'గుమ్రా' చిత్రాలలో ఆమె నటనతో ఆమె ఎంతో మంది హృదయాలను దోచుకుంది.

ప్రముఖుల సంతాపాలు

54 ఏళ్ల తక్కువ వయసులో మన నుంచి దూరమైంది. ఇంకా ఎన్నో సినిమాల్లో నటించగలుదు. అలాంటి వ్యక్తి మన అందరినీ విడిచిపపెట్టిపోవడం బాధాకరం. 85 చిత్రాల్లో చేస్తే 31 నాతోనే చేశారు. ఐదు దశాబ్దాల పాటు వెలుగింది. – కృష్ణ

శ్రీదేవి మరణవార్త తెలిసి షాక్ అయ్యా, చాలా విచారంగా ఉంది. ఆమె అద్భుతమైన నటి, మహిళ. ఎప్పటికీ నా అభిమాన నటి. . ఆమె కుటుంబానికి, శ్రేయోభిలాషులకు తట్టుకునే బలం ఇవ్వాలని దేవుడ్ని కోరుకుంటున్నా. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలి
– మహేశ్‌బాబు

శ్రీదేవి అందం, అభినయంతో అందరినీ మెప్పించారు. ముంబయి వెళ్లినప్పుడల్లా శ్రీదేవి కుటుంబంతో మాట్లాడేవాడిని. ఆమె చిన్నప్పటి నుంచి చాలా ఆరోగ్యంగా ఉండేవారు.
– సినీ నిర్మాత సి.అశ్వనీదత్

శ్రీదేవి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. బాలనటిగానే ఆమె ఎన్నో చిత్రాలు చేశారు. ఆమె లేని లోటు తీర్చలేనిది.
– మురళీమోహన్

'శ్రీదేవి మరణవార్త విని గుండె పగిలిపోయింది. ఆమె ఆత్మకు శాంతి కలగాలి. ఆమె కుటుంబం ధైర్యంగా ఉండాలి' – రమ్యకృష్ణ

'శ్రీదేవి చనిపోయారని తెలిసి షాకయ్యాను. అసలు అనుకోలేదు. ఆమె నటనతో చాలా మందిని ప్రభావితం చేశారు. అద్భుతమైన నటి. చిత్ర పరిశ్రమలో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది'. – హేమమాలిని


తల్లిదండ్రులు రాజేశ్వరి,అయ్యప్పన్‌తో శ్రీదేవి

కూతుర్ని హీరోయిన్‌గా చూడకముందే

శ్రీదేవి భర్త నిర్మాతగా రాణిస్తున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏ వేడుక జరిగినా కుటుంబ సభ్యులంతా హాజరువుతూ ఉంటారు. చనిపోయే ముందు దుబాయ్‌లో జరిగిన పెళ్లికి కూడా అందరూ వెళ్లారు. శ్రీదేవికి జాహ్నవి, ఖుషి ఇద్దరు కూమార్తెలు. పెద్ద కుమార్తె జాహ్నవిని కథానాయికగా చేయాలని ఆమె కోరిక. దాని కోసం చాలా కాలం అన్వేషించింది. 'ధడక్'లో ఆమె కథానాయికగా చేస్తోంది. కానీ అది విడుదలై తల్లిగా కూతురు ఎదుగుదలను చూడకముందే కన్నుమూయడం బాధాకరం.

'శ్రీదేవి లేని లోటు తీర్చలేదని. వారి కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుతం తరుపున ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా" – తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

'శ్రీదేవి చనిపోవడం చాలా బాధాకరం. ఆమె కుటుంబానికి దేవుడు ధైర్యాన్ని ప్రసాదించాలి'– వెంకటేశ్

'వచ్చారు, చూశారు, గెలిచారు. స్వర్గం నుంచి వచ్చారు. అక్కడికే తిరిగి వెళ్లిపోయారు'
–ఎన్టీఆర్ (జూనియర్)

'నాకెంతో ఇష్టమైన నటి శ్రీదేవి చనిపోయారంటే నమ్మలేకపోతున్నాను. జీర్ణించుకోలేకపోతున్నాను'– –
కాజల్ అగర్వాల్

'శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలి'– నాగార్జున

రూపాయి



అందరికీ ఉండాలి సేవింగ్స్ అకౌంట్



బ్యాంకింగ్ రంగంలో వచ్చిన నూతన విధానాలు, సాంకేతిక అభివృద్ధి కారణంగా గతంతో పోల్చుకుంటే.. ఇప్పుడు ఏ బ్యాంక్‌లోనైనా ఖాతా తెరవడం చాలా సులభతరమైంది. అయితే అందుకు కావాల్సిన కనీస పద్ధతులు, నిబంధనలు తెలియకుండా ఖాతా తెరవాలని ప్రయత్నిస్తే ఒక్కొక్కసారి భంగపడే ప్రమాదమూ ఉంది. బ్యాంకు నిబంధనలు ముందుగానే తెలుసుకుంటే అందుకు తగ్గట్టుగానే అవసరమైన పత్రాలతో బ్యాంకు అకౌంట్ ప్రారంభించడం తేలికవుతుంది. దీన్ని అధిగమించాలంటే సరాసరి బ్యాంకు అధికారుల్ని సంప్రదించడంగానీ, బ్యాంకులతో తరచూ లావాదేవీలు జరిపేవారిని అడిగి తెలుసుకోవడంగానీ చేయాలి. ఏదైనా బ్యాంకు నుంచి కొత్తగా అకౌంట్ ప్రారంభించే విషయంలో చాలామందికి అనేక అనుమానాలూ ఉంటాయి. ఆయా విషయాల గురించి ఈ వారం "రూపాయి" కథనంలో తెలుసుకుందాం!!

ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల మొదలుకొని పట్టణ ప్రాంతాలతో సహా చాలామంది ఏదైనా బ్యాంకులో కొత్తగా ఖాతా తెరవాలంటే జంకుతుంటారు. ఎందుకంటే..ఎలా అకౌంట్ ప్రారంభించాలి? దానికి కావాల్సిన అర్హతలేంటి? కనీసం డబ్బు ఎంత దగ్గర ఉండాలి? ఖాతా తెరవడంవల్ల లాభాలేంటి? ఏ బ్యాంకులో అకౌంట్ తెరిస్తే మంచిది? ఇలాంటి సందేహాలు చాలానే ఉంటాయి.

బ్యాంకు అకౌంట్ తప్పనిసరి

నిత్యజీవితంలో ఇప్పుడు దాదాపుగా ప్రతి ఒక్కరి ఆర్థిక లావాదేవీలన్నీ బ్యాంకు ఆధారంగానే జరుగుతున్నాయి. రోజువారీ కూలీల నుంచి పెద్ద పెద్ద పారిశ్రామిక దిగ్గజాల దాకా బ్యాంకుతో ప్రమేయం లేకుండా దైనందిన జీవితం గడపడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండటం తప్పనిసరి అయ్యింది. అయితే కొత్తగా అకౌంట్ ప్రారంభించాలంటే అందుకు ఎవరు అర్హులు? ఏం చేయాలి? అనే సందేహాలు.. ఇప్పటికీ గ్రామీణప్రాంత ప్రజల్లో నెలకొని ఉందనేది వాస్తవం.

నియమ నిబంధనలు

దాదాపు దేశంలోని ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రభుత్వం పరిధిలో పనిచేసేవి, ప్రయివేటు బ్యాంకులు ఇలా దాదాపు అన్ని బ్యాంకింగ్ సంస్థలూ కొత్త అకౌంట్ ప్రారంభించే విషయంలో ఇంచుమించు ఒకేరకమైన నిబంధనల్ని అనుసరిస్తాయి. పద్దెనిమిదేళ్లు దాటిన ఎవరైనా ఏదైనా బ్యాంకు నుంచి సేవింగ్స్ బ్యాంకు అకౌంట్ ప్రారంభించవచ్చు. కొన్ని సందర్భాల్లో మైనర్లు అంటే పద్దెనిమిదేళ్ళకు లోబడిన వయసుగలవారూ తల్లిదండ్రుల సమక్షంలో, వారి అనుమతితో (సంతకం చేయించాలి) బ్యాంకు ఖాతా తెరిచే సౌలభ్యం ఉంటుంది. దీనికి పాస్‌పోర్ట్ సైజ్‌గల రెండు ఫొటోలు, నివాస ధృవీకరణపత్రం, పాన్‌కార్డ్ నెంబర్, కనీసం రూ.500 నుంచి రూ.1000 ప్రారంభం మొత్తం సిద్ధం చేసుకుంటే సరిపోతుంది.



అమెరికాలాంటి దేశాల్లో యూనిక్ సోషల్ సెక్యూరిటీ నెంబర్ ఆధారంగా బ్యాంకు అకౌంట్ ప్రారంభించుకోవచ్చు. ఆ నెంబర్లోని కొత్త ఖాతాదారుడికి సంబంధించిన అన్ని వివరాలూ ఉంటాయి. ప్రత్యేకించి డాక్యుమెంట్ ఆధారాలను పేపర్ రూపంలో సమర్పించాల్సిన అవసరం ఉండదు.

అన్ని బ్యాంకులూ అందరి అవసరాలను తీర్చలేవు. బహుళ ప్రయోజనాల్నీ నెరవేర్చలేవు. కొన్ని బ్యాంకులు ప్రత్యేక రంగాలకు, ప్రాంతాలకు మాత్రమే పరిమితమై సేవలందిస్తుంటాయి.



ఇంకొన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా ఖాతాదారులకు సేవలందించేలా అన్ని ప్రాంతాల్లోనూ శాఖల రూపంలో అందుబాటులో ఉంటాయి. అందుకే అవసరానికితగ్గ బ్యాంకుల్ని ఎంచుకోవాల్సిన బాధ్యత మనదే. ఆయా సేవల ఆధారంగా బ్యాంకుల్ని "లార్జ్ చైన్ బ్యాంక్స్", "స్మాలర్ లోకల్ బ్యాంక్స్" అని రెండు రకాలుగా పిలుస్తుంటారు.

లార్జ్‌చైన్ బ్యాంక్ సిస్టమ్

దాదాపు దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణ ప్రాంతాల్లో విస్తరించి ఉండే బ్యాంకులన్నీ ఈ లార్జ్‌చైన్ బ్యాంక్ కేటగిరిలోకే వస్తాయి. అకౌంట్ ప్రారంభించిన చోటనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ ఆ బ్యాంకు సేవల్ని అందుకోవచ్చు. ఉదాహరణకు విజయవాడ బ్రాంచ్‌కి చెందిన ఖాతాదారుడు ఇతర ప్రాంతాల్లో ఆ బ్యాంకుకు చెందిన బ్రాంచ్ (శాఖలు) ఉంటే ఎలాంటి అదనపు చెల్లింపులు లేకుండానే ఆర్థిక లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ముఖ్యంగా ఎలాంటి నష్టభారమూ లేకుండా సంబంధిత బ్యాంకుకు చెందిన ఏటిఎమ్‌ల నుంచి నగదు డ్రా చేసుకునే అవకాశం ఉంది. లార్జ్‌చైన్ బ్యాంకులన్నీ చాలావరకు రోజులో 24 గంటలూ సేవలు అందిస్తుంటాయి. కొన్ని ప్రత్యేకతరహా అకౌంట్ కలిగిన ఖాతాదారులు విదేశాల్లోనూ ఆయా బ్యాంకు బ్రాంచ్‌ల నుంచి లేదా అనుబంధ బ్యాంకుల నుంచి నగదు లావాదేవీలు చేసుకునే వీలుంటుంది. దేశం మొత్తంగా అన్ని ప్రాంతాల్లోనూ సేవలందించే ఇలాంటి బ్యాంకులపట్ల ప్రజల్లోనూ నమ్మకం ఎక్కువే.

లోకల్ బ్యాంక్ సిస్టమ్

గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, రాష్ట్ర పరిధిలో మాత్రమే సేవలందించే బ్యాంకులన్నీ ఖాతాదారులకు సేవలు అందించడంలో ఎప్పుడూ మెరుగ్గానే ఉంటాయి. ఆయా ప్రాంతాలకు చెందిన ఖాతాదారుల పెట్టుబడుల ఆసరాగా నిర్వహించే బ్యాంకుల్లో ఖాతాదారుడిని గుర్తుపెట్టుకుని మరీ బ్యాంకు ఉద్యోగులు సేవలందిస్తుంటారు. ముఖ్యంగా స్థానిక ప్రజల పెట్టుబడులు, తీసుకునే రుణాలు, చెల్లింపులు ఆధారంగా బ్యాంకు వృద్ధి, సేవలు కొనసాగుతుంటాయి. అయితే ఇతర ప్రాంతాల్లో ఆయా బ్యాంకులకు చెందిన లావాదేవీలు జరపలేము. గ్రామీణ, రాష్ట్రీయ బ్యాంకులు కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడవల్ల.. ఏటిఎమ్ వంటి కీలకమైన సేవలు ఇతర ప్రాంతాల్లో పొందలేము. మన అవసరాల ఆధారంగా తగిన బ్యాంకులో అకౌంట్ ప్రారంభిస్తే మంచిది.

అకౌంట్..అనుకూలమేనా?

కొత్తగా బ్యాంకుతో అనుబంధం మొదలుపెట్టాలనుకునేవారు తొలుత "సేవింగ్స్ అకౌంట్" ప్రారంభించడం మంచిది. అవసరాలకు దాచుకోగల మొత్తాన్ని,



ఆదాయంలో మిగిలిన సొమ్మును సేవింగ్స్ అకౌంట్ రూపంలో భద్రంగా ఉంచుకోవడానికి ఇదొక చక్కటి మార్గం. ఈ అకౌంట్ ద్వారా డిపాజిట్ చేసిన సొమ్మును ఎప్పుడు కావాలంటే అప్పుడు విత్ డ్రా చేసుకోవచ్చు. అలాగే చేతిలో డబ్బులు ఉన్నప్పుడు సేవింగ్స్ అకౌంట్‌లో పొదుపు చేసుకోవచ్చు. వడ్డీ నామమాత్రంగానే ఉన్నాగానీ దాచుకున్న డబ్బుకు భద్రత, అవసరాలకు మరొకరికి డబ్బు పంపిణీ చేయడం, సమయ పరిమితి లేకుండా ఏటిఎమ్ నుంచి డ్రా చేసుకోవడం వంటి సౌకర్యాలు సేవింగ్స్ అకౌంట్ ద్వారా పొందవచ్చు.

ఆన్‌లైన్ బ్యాంకింగ్

ఏటిఎమ్ సదుపాయంలేని రోజుల్లో డబ్బులు వేయాలన్నా, తీయాలన్నా, వేరొకరి అకౌంట్లోకి డబ్బులు పంపాలన్నా.. కచ్చితంగా బ్యాంక్‌కు వెళ్ళాల్సి వచ్చేది. విత్‌డ్రా, క్రెడిట్, డిమాండ్ డ్రాఫ్ట్(డీడి) నింపితేగానీ నగదు లావాదేవీలు జరిగేవి కాదు. ఆన్‌లైన్ పద్ధతి అందుబాటులోకొచ్చాక బ్యాంకు పనులన్నీ సులభంగా మారిపోయాయి. వ్యక్తిగత ఖాతా వివరాలన్నీ మొబైల్ ఫోన్ ద్వారానే ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలైంది. నగదు డిపాజిట్ చేసినప్పుడు, తీసినప్పుడు, ట్రాన్స్‌ఫర్ (బదిలీ) చేసినప్పుడు సెకన్లలో అప్‌డేట్ అయిన ఖాతా వివరాల్ని బ్యాంకు ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఎస్మెమ్మెస్ అలెర్ట్ పంపుతుంది. దీనికి అకౌంట్ ప్రారంభించే సమయంలో ఖాతాదారుడి వ్యక్తిగత ఫోన్ నెంబర్‌ని నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే బ్యాంకుని సంప్రదించి, ఆన్‌లైన్ రిజస్ట్రేషన్ ఫార్మాలిటీస్ పూర్తిచేస్తే వ్యక్తిగత యూజర్ ఐడి, పాస్‌వర్డ్ బ్యాంకు అందజేస్తుంది. దీని సాయంతో ఉన్నచోట నుంచే డెస్కటాప్, ఇంటర్‌నెట్ సదుపాయంగల హైస్పీడ్ ఫోన్ ఉపయోగించి, నగదు పంపిణీ చేయొచ్చు. ఇలా సేవింగ్స్ అకౌంట్ నుంచి అనేకమైన ఆర్థిక ప్రయోజనాలు అందిపుచ్చుకోవచ్చు.

తప్పనిసరి.. డాక్యుమెంట్స్

బ్యాంకు అకౌంట్ ప్రారంభించడానికి కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్స్ తప్పనిసరిగా ఉండాలి. రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, వ్యక్తిగత గుర్తింపు, చిరునామా పత్రాలు, ప్రారంభ డిపాజిట్ రూపంలో కొంత సొమ్ము సిద్ధం చేసుకోవాలి.

వ్యక్తిగత రుజువు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు వారు పనిచేసే ఉద్యోగానికి సంబంధించిన ఐడీ కార్డ్ లేదా ఆధార్‌కార్డ్ రుజువుగా చూపించాలి. ఇతరులు అంటే ప్రయివేటు ఉద్యోగస్తులు, వ్యాపారస్థులు, అసంఘటిత కార్మికులు, రోజువారీ పనులు చేసుకునే కూలీలు తదితరులు ఓటర్ ఐడీ, ఆధార్‌కార్డు వ్యక్తిగత గుర్తింపు కోసం ఇవ్వాలి.

నివాస ధృవీకరణ పత్రం

టెలిఫోన్ బిల్లు, కరెంట్ బిల్లు, గ్యాస్ పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ ఏదో ఒకటి రుజువుగా చూపించవచ్చు. వీటితో పాన్‌కార్డ్ ఉంటే అప్లికేషన్ ఫారమ్‌లోని సంబంధిత కాలమ్‌లో పాన్‌కార్డ్ నెంబర్ వేస్తే మంచిది. భవిష్యత్తులో అధిక మొత్తంలో డబ్బులు వేసినా, తీసినా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవు.

- వి. చైతన్య

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006



పొడుపు కథ

ఇది పుల్లని పండు
చూస్తే నోరూరుచుండు
దాని చిగురు, కాయ, పండు
వంటకాలలో ఉపయోగం మెండు?


జవాబు : చింతపండు

జోక్ :

తండ్రి : ఒరేయ్ శ్రీనూ! నువ్వు ఎప్పుడూ, దేంట్లోనూ ఫస్ట్ రావేంటిరా?


శ్రీను : ఎందుకు రాను నాన్నా..! బెల్లు కొట్టగానే బయటకొచ్చేది ఫస్ట్ నేనేగా!

నీడ కనిపెట్టండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలో కొన్ని బొమ్మలు వాటి నీడలు ఉన్నాయి. అందులో.. ఏ నీడ దేనిదో కనిపెట్టండి!


ఎవరెస్టు ఆ పేరెలా వచ్చింది!



పిల్లలూ..! ప్రపంచంలో అత్యంత ఎత్తయిన పర్వతం ఏది అంటే..? ఎవరెస్ట్ అని టక్కున చెబుతాం. ఆ పేరు ఎందుకు వచ్చింది అంటే మాత్రం మన దగ్గర సమాధానం దొరకదు. ఇంతకీ ఈ పర్వతరాజుకు ఆ పేరు ఎలా వచ్చింది? భారతదేశంలో ఏ పర్వతం అన్నిటికంటే ఎత్తయినది అని లెక్కించమని గ్రేట్ ఆర్క్ అనే సంస్థకు ఆంగ్లేయులు బాధ్యతను అప్పగించారు. ఆ సంస్థ సర్వేయర్ జనరల్ సర్ జార్జ్ ఎవరెస్ట్ (1790–1866) ఆధ్వర్యంలో పనులు మొదలైనాయి. అన్ని ప్రాంతాలను లెక్కిస్తూ.. ఓ పెద్ద పర్వతం దగ్గరికి వచ్చారు. లెక్కలు పూర్తయ్యాక తేలిందేమంటే ప్రపంచంలోనే అంతకన్నా ఎత్తయిన పర్వతం లేదని తేలింది. నిజానికి అంతకుముందే.. క్రీస్తు శకం 1852లో భారత ప్రభుత్వం ఈ పర్వతానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు ఒక పర్యవేక్షక బృందాన్ని అక్కడికి పంపింది. ఈ బృందంలో జనరల్ సర్ జార్జ్ ఎవరెస్ట్‌తోపాటు, బృందానికి గుమాస్తాగా పనిచేసిన బెంగాలీ రాధానాథ్ సికందర్ ఉన్నారు. రాధానాథ్ ఎంతో కష్టపడి ఈ శిఖరాన్ని గురించి అనేక విషయాలు సేకరించాడు. ఈ శిఖరం ఎత్తుని, సరైన స్థితిని కనుగొన్నది సికందరే. తనకు లభించిన సమాచారాన్ని అంతటినీ జార్జ్ ఎవరెస్టుకు పంపేవాడు.



ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు శిఖరానికి పేరుపెట్టడం గురించి చర్చ వచ్చినప్పుడు ఎవరెస్టు పేరును ప్రతిపాదించడం, ఆమోదించడమూ జరిగిపోయింది. అంత శ్రమించిన రాధానాథ్‌కు శ్రమ తప్ప ఏ గుర్తింపూ రాలేదు. ★



నేను గీసిన బొమ్మ





బేవర సందీప్ ,
6 వ తరగతి ,
శ్రీ ఆదర్శ పబ్లిక్ స్కూల్
తిమ్మాపురం,
ఎస్.రాయవరం
మండలం,
విశాఖ జిల్లా.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com





కన్నుల పండువగా కార్యక్రమాలు
ప్రత్యేక అతిథిగా ఇవాంక ట్రంప్



ముగిసిన వింటర్ ఒలింపిక్స్

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : 2018 వింటర్ ఒలింపిక్స్ ఆదివారంతో ఘనంగా ముగిసాయి. ముగింపు వేడుకల్లో కళాకారులు ప్రత్యేక కార్యక్రమాలు ప్రదర్శించారు. బాణాసంచా వెలుగులు, సంగీత కార్యక్రమాలతో స్టేడియం సరికొత్త వెలుగులతో నిండిపోయింది. ముంగిపు వేడుకల్లో అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. దక్షిణకొరియా అధ్యక్షులు మూన్ జై ఇన్, అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ అధ్యక్షులు థామస్ బాచ్, ఉత్తర కొరియా జనరల్ కిమ్ యాంగ్ చోల్, ఇతర అధికారులతో కలిసి ముగింపు కార్యక్రమాలను ఇవాంక ట్రంప్ వీక్షించారు. అయితే ఈ ప్రారంభోత్స కార్యక్రమంలో ముందుగా దక్షిణకొరియా అధ్యక్షులు మూన్ జైతో కరచా లనం చేయడానికి ఇవాంక, కిమ్ యాంగ్ చోల్ అంగీకరించలేదు. అతనికి కొన్ని ఇంచ్‌ల దూరంలో కూర్చుని కార్యక్రమాలను వీక్షించారు. ఫోటోలకు నవ్వుతూ ఫోజులు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియా అధ్యక్షులు మూన్ జై ఇన్ మాట్లాడుతూ ఈ ఒలింపిక్స్‌ను శాంతి క్రీడలుగా వర్ణించారు. ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి తమ దేశం కృషిచే స్తుందన్నారు. శాంతి కోసం అమెరికా, ఉత్తర కొరియా లతో మాట్లాడ్డానికి సిద్ధంగా వుందని ప్రకటించారు.

థామస్ బాచ్ మాట్లా డుతూ మృతి చెందిన అథ్లె ట్లుకు నివాళులర్పించారు. ప్రపం చానికి వారు ఒక ఉదాహరణగా నిలిచారని అన్నారు. ఈ పోటీల్లో పతకాలు సాధించిన కొంత మంది అథ్లెట్లును థామస్ వేదికపైకి ఆహ్వానించారు. వారిని అభినందించారు. నాలుగేళ్ల తరువాత బీజింగ్‌లో జరిగే 2022 వింటర్ ఒలింపిక్స్‌లో మళ్లీ కలుసుకుందామని పిలుపు ఇచ్చారు. వివిధ జట్ల ఆటగాళ్లు మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్నారు. ఈ నెల 9న ఈ వింటర్ ఒలింపిక్స్ ప్రారంభమయ్యాయి. 15 క్రీడల్లో 102 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. 92 దేశాల నుంచి సుమారు 3 వేల మంది అథ్లెట్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ముక్కోణపు సిరీస్‌కు టీమిండియా ఎంపిక

న్యూఢిల్లీ : వచ్చే నెల్లో శ్రీలంకలో జరుగ నున్న ముక్కోణపు టీ 20 సిరీస్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించారు. విరాట్ కోహ్లి, ఎంఎస్ ధోనిలకు ఈ సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చారు. వీరితో పాటు జస్ప్రిత్ బుమ్రా, భువనేశ్వర్ కుమార్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్‌లకు కూడా విశ్రాంతినిచ్చారు. ఈ మేరకు 15 మందితో కూడిన భారత జట్టులో రోహిత్ శర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పచెప్పగా, శిఖర్ ధావన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. హైదరబాద్ పేసర్ మొహ్మద్ సిరాజ్‌కు మరోసారి అవకాశం కల్పిస్తూ సెలక్టర్లు నిర్ణయం తీసుకు న్నారు. ప్రధానంగా దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, రిషబ్ పంత్‌లకు అవకాశం దక్కింది. మార్చి 6 నుంచి ఆరంభ మయ్యే ముక్కోణపు టి20 సిరీస్‌లో భారత్, శ్రీలంకలతో పాటు బంగ్లాదేశ్ పాల్గొనుంది.

భారత్ జట్టు : రోహిత్ శర్మ(కెప్టెన్), శిఖర్ ధావన్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేశ్ కార్తీక్, దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, అక్షర్ పటేల్, విజయ్ శంకర్, శార్దూల్ ఠాకూర్, జయదేవ్ ఉనాద్కత్, సిరాజ్, రిషబ్ పంత్

6వ స్థానానికి దిగజారిన కోహ్లి

న్యూఢిల్లీ : ఆదివారం ప్రకటించిన ఐసిసి టి20 బ్యాట్స్ మెన్ల జాబితాలో భారత కెప్టెన్ విరాట్ కోహ్లి 3 స్థానాలు దిగజారి 6వ స్థానంలో నిలిచాడు. దక్షిణా ఫ్రికాతో తాజాగా ముగిసిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో కోహ్లి 27 పరుగులు మాత్రమే చేశాడు. ఈ జాబితాలో న్యూజిలాండ్‌కు చెందిన మున్రో, ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్ మ్యాక్స్‌వెల్, పాకిస్తాన్‌కు బాబర్ అజామ్ తొలి మూడు స్థానాల్లో ఉన్నారు.

కాగా, టీ20 బౌలర్లలో భారత్‌కు చెందిన భువనేశ్వర్ ఏకంగా 20 స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో భువి ఏడు వికెట్లు సాధించాడు. మరో భారత బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒక స్థానం దిగజారి 5వ స్థానంలో వున్నాడు. ఈ జాబితాలో ఆఫ్ఘన్ బౌలర్ రషీద్ ఖాన్ తొలిస్థానంలో ఉన్నాడు. టీ20 జట్లలో భారత్ మూడో స్థానంలో ఉంది. పాక్, ఆసీస్ భారత్ కంటే ముందున్నాయి.

మేరీకోమ్, సీమాకు రజతాలు

సోఫియా (బుల్గేరియా) : ఇక్కడ జరుగు తున్న స్ట్రాండ్జ మెమరియల్ బాక్సింగ్ టోర్న మెంట్‌లో భారత్‌కు చెందిన మేరీకోమ్, సీమా పూనియా రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. ఆదివారం 48 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్‌లో అతిథ్య దేశానికి చెందిన సెవ్ద అసెనోవా చేతిలో మేరికామ్ ఓటమి చెందింది. 81 కేజీల విభాగంలో సీమాపై రష్యా క్రీడాకారిణి అన్నా ఇవోనోవా విజయం సాధించింది. ఈ టోర్నిలో ఈ రెండు రజతాలతో భారత్ మరో నాలుగు కాంస్య పతకాలు కూడా సొంతం చేసుకుంది. 54 కేజీల విభాగంలో మీనా కుమారి దేవి, 60 కేజీల్లో ఎల్.సరితా దేవి, 75 కేజీల్లో స్వీటీ బోర్రా, 81 కేజీల్లో భాగ్యబాటి కచారి కాంస్య పతకాలు సాధించారు.

భారత్‌కే ఐసిసి టెస్టు చాంపియన్‌షిప్



కేప్‌టౌన్ : ఐసిసి టెస్టు చాంపియన్ షిప్‌ను భారత్‌కు అందచేశారు. ప్రస్తుత ఐసిసి టెస్టు జట్ల జాబితాలో భారత్ 121 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఈ ఏడాది కటాఫ్ తేదీ (ఏప్రిల్ 3) లోగా మరే జట్టు భారత్‌ను అధిగమించే అవకాశం లేదు. దక్షిణాఫ్రికా (115 రేటింగ్ పాయింట్లు), ఆస్ట్రేలియా (104) జట్లు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. తొలిస్థానంలో ఉన్న భారత్‌కు 10 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ ప్రకటించారు. జట్టు కెప్టెన్ విరాట్ కోహ్లికి ఐసిసి టెస్టు చాంపియన్‌షిప్ టైటిల్ (గద)ను అందచేశారు. దక్షిణాఫ్రికాతో శనివారం మూడో టీ20 ముగిసిన అనంతరం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఐసిసి క్రికెట్ హల్ ఆఫ్ ఫామెర్స్ సునీల్ గవాస్కర్, గ్రేమీ పోలాక్‌లు కోహ్లికి ఈ గదను అందచేశారు. ఈ సందర్భంగా ఐసిసి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ రిచర్డ్సన్ భారత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గత 12 నెలల నుంచి టెస్టులో భారత్ అద్భుతమైన ప్రతిభ కనబరుస్తుందని ప్రశంసించారు.

చిన్న హజారే ఫైనల్లో సౌరాష్ట్ర

సెమీస్‌లో ఆంధ్రాపై గెలుపు



న్యూఢిల్లీ : విజయ్‌హజారే ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర క్రికెట్ జట్టు ప్రవేశించింది. ఆదివారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుపై సౌరాష్ట్ర 59 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో కర్నాటక విధించిన 255 పరుగుల లక్ష్యాన్ని చేధించడానికి బరిలోకి దిగిన ఆంధ్రప్రదేశ్ జట్టు 45.3 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటయింది. సౌరాష్ట్ర బౌలర్ ధర్మేంద్ర సిన్హా జడేజా నాలుగు వికెట్లు సాధించి తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరో బౌలర్ సౌర్య సనందియా రెండు కీలక వికెట్లు తీశాడు. చిరాగ్ జాని, ప్రేరక్ మంకడ్, కమలేష్ మక్వనాలకు తలో ఒక వికెట్ లభించింది. ఆంధ్రా జట్టులో బోడపాటి సుమంత్ (42 పరుగులు), ద్వారకా రవితేజ (42) మాత్రమే రాణించారు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర 49.1 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటయింది. జట్టులో ఆర్పిత్ వసవద (58), రవీంద్ర జడేజా (56) అర్ధ సెంచరీలతో రాణించారు. ఓపెనర్ సమర్థ వ్యాస్ 46 పరుగులు చేశాడు. ఈ ట్రోఫీలో శనివారం జరిగిన తొలి సెమీఫైనల్లో మహా రాష్ట్రపై కర్నాటక 9 వికెట్ల తేడాతో విజయం సాధిం చింది. ఈ నెల 27న జరిగే ఫైనల్లో కర్నాటక, సౌరాష్ట్ర జట్లు తలపడతాయి.

సందేశాత్మకంగా నాటక ప్రదర్శనలు

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాల్లో భాగంగా ఆదివారం గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న ప్రదర్శనలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఆధునిక కాలంలో మాయలు, మంత్రాలు ఆధునిక విజ్ఞానాన్ని మార్చలేమని 'సర్వేంద్రియానం నయనం' నాటిక ద్వారా వివరించారు. అందరి అవయవాలు ఒక్కటేనన్నది నాటక సారాంశం. అవయవదానం ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చునని చాటిచెప్పేదే నాటకం ఇతివృత్తం. ఆధునిక కాలంలో దాతల సహకారంతో దేశంలో పేదలు ఎన్నో రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారన్న సందేశాన్ని 'దాత నీకు దండమే' నాటకం చాటిచెప్పింది. అన్నం పెట్టే రైతు అనుభవంలేని వారి సలహాలు విని అత్యాశకు పోయి చెడువ్యసనాలకు గురై అప్పులబాధలో కూరుకుపోయి అక్రమ పంటలను పండించి జైలు పాలైన రైతు కుటుంబ గాదే 'అన్నదాత సుఖీభవ' అన్నదాతను కష్టాలకు గురిచేయవద్దని ఆదుకోవాలన్నదే నాటకం ఇతివృత్తం. సంఘంలో పెద్ద మనుషులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల మధ్య జరిగే సంభాషణ ప్రేక్షకులకు హాస్యాన్ని పంచడంతోపాటు మానవత్వ విలువలను 'మాయబజార్ 'నాటిక చాటిచెప్పింది. పేదరికంలో మగ్గుతున్న తల్లిదండ్రులు కష్టపడి ధనాన్ని



గుంటూరు జిల్లా తెనాలిలో నందినాటకోత్సవాల్లో భాగంగా ప్రదర్శించిన 'అన్నదాతా సుఖీభవ' నాటికలో సన్నివేశం

కూడబెట్టి బిడ్డలను చదివిస్తున్నారు. పెరిగి పెద్దయిన తరువాత తానే దిక్కవుతాడనుకున్న బిడ్డలు అర్థాంతరంగా చనిపోతే ఆ కుటుంబం పరిస్థితి ఏవిధంగా ఉంటుందన్నది 'బ్రతుకు చిత్రం' ద్వారా కళాకారులు చాటి చెప్పారు. యర్రా శ్రీదేవి మెమోరియల్ వారు, తుళ్ళూరు కళాపరిషత్ మధు థియేటర్ ఆర్ట్స్ తుళ్ళూరు వారు, అమెచ్యూర్ ఆర్ట్స్ అకాడమీ వరంగల్ వారు, శ్రీ స్నేహమయి కళాసమితి సత్తెనపల్లి వారు, ఉ షోదయ కళానికేతన్ గుంటూరు వారు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకత ఉట్టిపడేలా చేశాయి. ఈ సందర్భంగా సీనియర్ నటులు పగిడాల శ్యామ్‌సుందర్, కంకణాల అరుణ్‌కుమార్‌ను సత్కరించారు. ఆయా నాటక పరిషత్‌లకు ప్రోత్సాహకం కింద రూ.15 వేల చెక్కులను అందించారు.

విద్యుత్ కార్మికుల జీవితాల్లో అంధకారం



- అమలు కాని క్రమబద్ధీకరణ హామీ
- చాలీచాలని జీతాలు
- ప్రమాదపుటంచున ప్రాణాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగం ఎంత కీలకమో, క్షేత్ర స్థాయిలో పని చేసే 24 వేల మంది కాంట్రాక్టు కార్మికులు కూడా అంతే కీలకం. జెన్‌కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, ట్రాన్స్‌కో పరిధిలోని పంపిణీ వ్యవస్థలో, డిస్కంల పరిధి లోని సబ్‌స్టేషన్‌ల నుంచి గ్రామ స్థాయి వరకూ వివిధ విభాగాల్లో వాచ్‌మెన్లు, డ్రైవర్లు, సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, షిఫ్టు ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ రీడర్లు, బిల్ కలెక్టర్‌లు, స్టోరు కీపర్లు, ఇతర విభాగాల్లో 10 నుంచి 20 ఏళ్లుగా పని చేస్తున్నారు. లైన్ల నిర్వహణలో విద్యుత్ ప్రమాదాలకు గురై వందల మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. శాశ్వత ఉద్యోగులు చేసే పనిని స్కిల్డ్ వర్కర్లు అవలీలగా చేస్తున్నారు. విద్యుత్ సంస్థలో దశాబ్దాల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనం అందకపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ కాంట్రాక్టు కార్మికులుగానే కొనసాగుతున్నారు. వీరి శ్రమతోనే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోంది. హుద్‌హుద్ తుఫాను కారణంగా విశాఖ జిల్లాలో విద్యుత్తు వ్యవస్థ పూర్తిగా నేలమట్టమైనప్పటికీ కేవలం 24 గంటల వ్యవధిలో పునరుద్ధరించిన సందర్భంలోనూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు కార్మికులు అక్కడ సేవలందిం చారు. కాంట్రాక్టు కార్మికుల్ని క్రమబద్ధీ కరిస్తామని ఎన్నికల ముందు టిడిపి మ్యానిఫెస్టోలో పేర్కొంది. తీరా అధికారంలోకొచ్చాక విద్యుత్ రంగంలోని కార్మికుల్ని క్రమబద్ధీకరించకుండా కాలయాపన చేస్తోంది. గత మూడున్నరేళ్లుగా నేతలకు, అధికారులకు పలుమార్లు వినతి పత్రాలివ్వడంతో పాటు ఆందోళనా కార్యక్రమాల్ని చేపట్టినా ప్రభుత్వం దిగిరాకపోగా కాంట్రాక్టు కార్మికులే లేరంటూ ఆర్థిక శాఖా మంత్రి ప్రకటించడం గమనార్హం. సమాన పనికి సమాన వేతనం, పీసు రేటు రద్దు, థర్డ్‌పార్టీ కాంట్రాక్టు విధానం రద్దు, దశలవారీ క్రమబద్ధీకరణను కార్మికులు కోరుతు న్నారు. చివరి అస్త్రంగా కార్మికులు జనవరి 27న సమ్మెలోకి వెళ్ళనున్నట్లు నోటీసు ఇచ్చారు. యాజమాన్యం సూచన మేరకు సమ్మెను ఫిబ్రవరి 20కి వాయిదా వేశారు. అయిన ప్పటికీ 20వ తేదీ వరకూ చర్చలకు పిలవక పోవడం, సమ్మె ప్రారంభించిన రోజు జరిపిన చర్చల్లో స్పష్టత ఇవ్వకపోవడంతో కార్మికులు సమ్మెలోకి వెళ్లక తప్పలేదు. సమ్మె కారణంగా లైన్లలో సమస్యలేర్పడినా మరమ్మతులకు, సబ్‌స్టేషన్‌ల నిర్వహ ణలో వచ్చే సమస్య లకు, క్షేత్ర స్థాయిలో సరఫరాలో సమ స్యల్ని పరిష్కరిం చేందుకు సిబ్బంది అందుబాటులో లేరు. కంప్యూటర్ ఆపరేటర్లు, స్టోర్ కీపర్లు, ఉన్నతాధికారుల వాహనాల డ్రైవర్లు విధులకు దూరంగా ఉన్నారు.


గత ప్రభుత్వ నిర్ణయాన్నీ పట్టించుకోలేదు...

విద్యుత్ సంస్థల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల్ని క్రమబద్ధీకరించాలని వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. దశలవారీగా క్రమబద్ధీకరించాలని మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయంతో పదేళ్ల కిందట 7,500 మంది కార్మికుల్ని తొలి దశలో క్రమబద్ధీకరించారు. తరువాతి ప్రభుత్వాలు ఆ నిర్ణ యాన్ని అమలు చేయడంపై శ్రద్ధ చూపలేదు. స్వయంగా హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకొచ్చిన అనంతరం విద్యుత్తు రంగ కార్మికులతో తమకు సంబంధం లేదంటూ తనను కలిసిన కార్మిక సంఘాల నేతలతో చెప్పడంపై కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కాంట్రాక్టు వర్కర్ల జీతాలు పెంచితే ప్రభుత్వంపై పడే భారం కేవలం రూ.204 కోట్లు మాత్రమేనని, థర్డ్ పార్టీ విధానం రద్దుతో ఈ మొత్తంలో మరో 40 శాతం వరకూ భారం తగ్గుతుందని ఆ శాఖాధికారులు అంటున్నారు.

చర్యలు శూన్యం...

అత్యవసర సర్వీసుల్లో ఒకటైన విద్యుత్తు రంగంలో కార్మికుల సమ్మె నివారణకు యాజమాన్యం చర్యలు తీసుకోలేదు. సమ్మె ప్రారంభానికి ముందు రోజు చర్చలు జరిపినప్పటికీ హామీలు, యాజమాన్యం నియమించిన కమిటీలో చెప్పిన విషయాలు, వాటిని అమలు చేసే తేదీ వంటి విషయాల్లో స్పష్టత ఇవ్వలేదు. రెండో రోజు విద్యుత్ శాఖ మంత్రి కళా వెంకట్రావు సమక్షంలో జరిగిన చర్చ ల్లోనూ ఇదే తీరు. కార్మికుల సమ్మె కారణంగా సరఫరాలో తలెత్తే సమస్యల నిరవారణకు సిబ్బందిని సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు అదనపు సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. శాశ్వత ఉద్యోగుల సెలవుల్ని రద్దు చేసి, అందరూ విధుల్లో ఉండే విధంగా చర్యలు తీసుకు న్నారు. అధికారులు, అందబాటులోఉన్న సిబ్బందితో బృందాల్ని ఏర్పాటు చేసి ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే వెళ్లి పరిష్కరించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

12 ఏళ్ల నుంచి పనిచేస్తున్నా రూ.7,500 జీతం



డి.కృపానంద్ (వాచ్‌మేన్, కానుమోలు సబ్‌స్టేషన్)

గత పన్నెండేళ్ల నుంచి కానుమోలు సబ్‌స్టేషన్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తున్నాను. చేరినప్పుడు కేవలం రూ.2,000 ఇచ్చేవారు. ప్రస్తుతం 7,500 ఇస్తున్నారు. ఈ మొత్తం కుటుంబ పోషణకు ఏమాత్రం పరిపోవడం లేదు. ఇద్దరు పిల్లల్ని పెంచాలంటే ఏటా అప్పులు పెరిగిపోతున్నాయి.

పీసురేటుతో కార్మికులు నష్టపోతున్నారు



జివిఎస్ చక్రవర్తి (బిల్ కలెక్టర్, పటమట)

పీసురేటు విధానంలో సంస్థలో పనిచేసే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. నెలంతా పని చేసినా రూ.6 నుంచి 7 వేలు సంపాదించడం గగనంగా ఉంది. వారాంతపు, జాతీయ సెలవు దినాల్లో సైతం పనిచేయిస్తున్నారు. ఈ సంపా దనతో నగరంలో ఎలా బతకాలి. 25 ఏళ్లుగా నేను ఇదే పని చేస్తున్నాను.

నా బేసిక్ జీతం రూ.5,500



ఉషారాణి (స్టోర్ కీపర్, టిఎల్‌సి స్టోర్సు

నేను స్టోరు కీపరుగా పదేళ్ల నుంచి పని చేస్తున్నాను. ఉద్యోగంలో చేరినప్పుడు 1,400 జీతం ఇచ్చేవారు. ప్రస్తుతం బేసిక్ రూ.5,500. అలవెన్స్‌లు మరో రూ.2,000 ఇస్తున్నారు. ఇంత తక్కువ జీతంతో మేమెలా కుటుంబాన్ని పోషించుకోవాలో యాజమాన్యమే చెప్పాలి.

అలరించిన 'ఊరుభంగం' ప్రదర్శన

ముగిసిన నాటిక పోటీలు

ప్రజాశక్తి - నరసరావుపేట (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా నరసరావుపేటలో రంగస్థలి సంస్థ ఆధ్వర్యంలో మూడ్రోజులుగా నిర్వహిస్తున్న 20వ ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం ముగిశాయి. మూడ్రోజులపాటు ప్రదర్శనలు ఆద్యంతం కళా హృదయాలను తన్మయాత్వానికి గురి చేశాయి. ఆదివారం ప్రదర్శనల్లో భాగంగా తొలిగా విజయవాడవారు 'ఊరుభంగం' నాటికను ప్రదర్శించారు. దుర్యోధనుడిని భీముడు గదతో తొడలు విరవడం, దాన్ని ధృతరాష్టుడు చూడ్డం, అశ్వత్థామ సౌప్తిక వధకు ప్రతిజ్ఞ పూనడం తదితర సన్నివేశాలతో రసవత్తరంగా సాగింది. సాయి ఆర్ట్స్ పలకలూరివారి 'మధురం' నాటిక భూమికి స్వేచ్ఛ ఉంది, కోకిలకు స్వేచ్ఛ ఉంది అయితే మహిళలకు స్వేచ్ఛ లేకపోవడం ఏమిటంటూ చైతన్య పూరితమైన సన్నివేశాలతో సాగింది. ప్రకృతి నిశ్శబ్ధం ఆహ్లాదకరంగాను, మహిళ నిశ్శబ్ధం భయంకరంగానూ ఉందంటూ మహిళల శక్తి సామర్థ్యాలను ప్రదర్శించారు.

అలరాజుల రాయబారం, పల్నాటియుద్ధం నాటికలోని ఓ సన్నివేశం అందరి హృదయాలను దోచుకుంది. అనంతరం బహుమతి ప్రదానోత్సవానికి కిలారు వెంకట్రావు అధ్యక్షత వహించారు. స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ నవరసాలు ఉట్టిపడేలా, సమాజంలో వాస్తవ గాధలను చూపుతూ ప్రదర్శనలు ఉన్నాయని అభినందించారు. అనంతరం సినీ నటులు, రచయిత గొల్లపూడి మారుతీరావును సత్కరించారు.



వేదికపై ప్రదర్శించిన నాటికలోని ఓ సన్నివేశం

బాపట్లలో బీచ్ కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)



ఆంధ్రప్రదేశ్ - హిమాచల్‌ప్రదేశ్ జట్ల మధ్య పోటీ

గుంటూరు జిల్లా బాపట్ల మండలం సూర్యలంక తీరంలో జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. 28వ తేదీ వరకూ నిర్వహించే పోటీలకు 23 రాష్ట్రాల నుంచి మహిళలు, పురుషుల విభాగంలో పలు జట్లు పోటీల్లో తలపడ నున్నాయి. తొలిరోజు పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ - మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ - తెలంగాణ జట్లు తలపడ్డాయి. మహిళల విభాగంలో హిమాచల్‌ప్రదేశ్ - ఆంధ్రప్రదేశ్, హర్యానా - విదర్భ జట్లు పోటీపడ్డాయి. పలు రాష్ట్రాల క్రీడాకారులతో తీరంలో సరికొత్త సందడి నెలకొంది. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నాలుగు కోర్టుల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలను ప్రారంభించిన ఎకెఎఫ్ఐ చైర్మన్, ఎమ్మెల్సీ కెఇ ప్రభాకర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, ఎకెఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దినేష్ పాటిల్, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి వీర్లంకయ్య, కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ జయప్రకాష్ నారాయణ, ఎంపిపి మానం విజేత పాల్గొన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68